
12-7Pg1exHMNWJQE.qxd:12-7Pg1exHMNWJQE.qxd 01/01/01 9:49 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-7-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 161 పేజీలు: 12 వెల: 6.50

**కొత్తపార్టీ పెట్టిన లాలూ కుమారుడు తేజ్ ప్రతాప్** 9లో

**రూ.40వేలకు పెరిగిన వీసా ఫీజులు**



ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలాపాలపై అధికారులతో సమావేశమైన కమిటీ చైర్మన్ కూన రవికుమార్

## ప్రభుత్వ రంగసంస్థల
# నిర్వహణపై పరిశీలన

### విశాఖ జిల్లాలో పర్యటించిన లెజిస్లేచర్ కమిటీ
### ప్రత్యేక జ్యుడీషియల్ ప్యానెల్ ఏర్పాటుకు చర్యలు

**విశాఖపట్నం, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ, వాటి కార్యకలాపాలు, పనితీరు, అకౌంట్ల ఆడిటింగ్ పై పరిశీలనకు ఉభయ సభల సభ్యులతో ఏర్పాటైన లెజిస్లేచర్ కమిటీ జిల్లా పర్యటనను శుక్రవారం ప్రారంభించింది. ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న ఈ కమిటీ శుక్రవారం ఉదయం జిల్లాకు చేరుకొని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యింది. ఛైర్మన్ కూన రవికుమార్‌తో పాటు >>2

# మానవ వనరులే అభివృద్ధికి మెట్లు

### నాడు కుటుంబ నియంత్రణను ప్రోత్సహించా..
### నేడు జనాభా నిర్వహణ అవసరమంటున్నా
### దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ స్ఫూర్తిని కొనసాగించాలి
### ప్రపంచజనాభా దినోత్సవ సదస్సులో సిఎం చంద్రబాబు


శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** జనాభా భారం కాదు, ఆస్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రస్తుత కాలంలో జనాభా నియంత్రణ కాదు నిర్వహణ అవసరమన్నారు. ప్రపంచ జనాభా 1989 జూలై 11న ప్రపంచ జనాభా 5 బిలియన్లకు చేరిన సందర్భంగా ఐక్యరాజ్య సమితి జూలై 11వ తేదీని ప్రపంచ జనాభా దినోత్సవంగా ప్రకటించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేశారు. ఈ రోజు ప్రపంచంలో 10 నుంచి 24 యేళ్ల వయసు ఉన్న వారు 1.8 బిలియన్లు ఉన్నారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారు. కానీ జనాభా ఉన్న దేశాలవైపే అగ్రరాజ్యాలు చూడాల్సి వస్తోంది. జనాభా ఎప్పటికీ భారం కాదు. అదే మనకు తిరుగులేని ఆస్తి. ఎక్కువ జనాభా ఉన్న మన దేశంలో అభివృద్ధి సాధ్యమా అనే పరిస్థితి నుంచి ఆ జనాభానే మనకు అడ్వాంటేజ్‌గా మారింది. 140 కోట్ల జనాభా కలిగి ఉన్న మన దేశం చైనానుకూడా వెనక్కు నెట్టింది అని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో నేను కుటుంబ నియంత్రణను ప్రోత్సహించా. ఇప్పుడు నేనే జనాభా నిర్వహణ అవసరమని చెబుతున్నా అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలు లేదనే చట్టం తెచ్చానని గుర్తుచేశారు. ఇప్పుడు ఇద్దరు పిల్లలకన్నా ఎక్కువ ఉండాలంటున్నామన్నారు. ఎప్పటికప్పుడు ఆలోచన విధానంలో మార్పు వస్తుందన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పాలసీలను మార్చుకోకపోతే చాలా సమస్యలు వస్తాయని >>2

### ఆదాయార్జన శాఖల ద్వారా
# ఆర్థికవృద్ధికి కృషి

### రూ.180 కోట్ల విలువైన నరేగా పనులు రీఓపెన్ చేయించాం
### సంస్కరణలతో ఫలితాలు వస్తున్నాయి
**శాఖాధికారులుగా కాదు..లీడర్లుగా వ్యవహరించండి: సిఎం చంద్రబాబు**

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** సంస్కరణల అమలు ద్వారా రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సంక్షేమం అందిస్తూ..అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు...ఆదాయార్జన శాఖల ద్వారా మరింత రెవెన్యూ పెరగాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆదాయార్జన శాఖలపై,వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, మున్సిపల్, పంచాయతీరాజ్, అటవీ శాఖలపై చంద్రబాబు సమీక్షించారు. ఆయా శాఖల్లో ఆదాయార్జనకు సంబంధించి పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయ సముపార్జన అనేది ఎంత వరకు చేయగలిగామనే అంశంపై వివిధ శాఖల ఉన్నతాధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆదాయార్జన శాఖలు సొంతంగా ఆదాయాలు పెంచుకోవడం పైనా దృష్టి సారించాలి. ఆదాయ సముపార్జనలో ఉన్న లీకేజీలను గుర్తించి, వాటిని నివారిస్తూ రాష్ట్రానికి ఆదాయం పెంచేలా చూడాలి. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఆదాయాలను ఎలా ఆర్జించాలనే అంశాలపై దృష్టి సారించాలి. వివిధ పథకాల్లో కేంద్రం నుంచి ఎలా నిధులు ఉన్నాయో గుర్తించి ఆ మేరకు ప్రతి పైసాను రాష్ట్రానికి తెచ్చుకునేలా కార్యాచరణ అమలు చేయాలి. రాష్ట్ర సొంత ఆదాయాలు పెంచుకుంటూనే.. కేంద్ర నిధులపై దృష్టి పెడితే .. రాష్ట్ర ఖజనా కు నిధుల ఇన్ ఫ్లో పెరుగుతుంది. ఈ దిశగా అధికారులు నిరంతరం పని చేస్తూనే ఉండాలి." అని ముఖ్యమంత్రి సూచించారు.

2014-19 మధ్య కాలంలో చేపట్టిన రూ. 180 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులను గత ప్రభుత్వం నిలిపేసింది. దీని వల్ల ఆ డబ్బులు కేంద్రం నుంచి రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఆగిపోయిన ఉపాధి హామీ పనులను తిరిగి రీఓపెన్ చేయించాం. ఏడాది పాటు నిరంతరం ఫాలో అప్ చేయడం వల్ల 3.52 లక్షలకు పైగా పనులను మళ్లీ రీఓపెన్ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరగా ప్రాసెస్ చేయాలి. ఓ నెల రోజుల్లోగా ఈ పనులకు సంబంధించిన రూ.180 కోట్లు వచ్చేలా చేయాలి. ఇక గత ఏడాది లానే ఈసారి కూడా గ్రామాల్లో నరేగా పనులను ప్రాధాన్యతల వారీగా గుర్తించి.. గ్రామసభల్లో ఆమోదం తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్సైజ్, ఇసుక, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల లాంటి శాఖల్లో సంస్కరణలు తెచ్చాం. ఇవి సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఈ సంస్కరణలతో ప్రజలకు మేలు జరుగుతోంది. రాష్ట్రానికి కొంత మేర ఆదాయం పెరిగింది. ప్రజలతో నిత్యం సంబంధం కలిగి ఉండే ఆదాయార్జన శాఖల పనితీరు మెరుగ్గా ఉండాలి. ఆయా శాఖల పనితీరు మీద ప్రజల్లో సంతృప్తి స్థాయి కూడా పెరగాలి. ప్రస్తుతం అన్న క్యాంటీన్లు, పెన్షన్ల పంపిణీ వంటి వాటిల్లో సంతృప్తి స్థాయి 90శాతం దాటింది. స్టాంపులు రిజిస్ట్రేషన్లు, మున్సిపల్, పంచాయతీరాజ్, ఎక్సైజ్, గనులు వంటి శాఖల్లో కూడా >>2



### ద.మ రైల్వే జిఎంగా
## ఎస్.కె శ్రీవాత్సవ
### పిసిఇగా ఆంజనేయులు రెడ్డి

**గుంతకల్లు రైల్వే, జూలై 11,ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా సంజయ్ కుమార్ శ్రీవాత్సవ,ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్‌గా డి ఆంజనేయులు రెడ్డిలను నియమిస్తూ రైల్వే బోర్డు ప్రత్యేక సంచాలకులు రవీందర్ పాండే ఆదేశాలు జారీ చేశారు. భారతీయ రైల్వే 1988వ బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వే ఇంజనీరింగ్ సర్వీసెస్‌కు చెందిన సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ ప్రస్తుతం అలహాబాద్‌లోని కేంద్ర రైల్వే విద్యుద్దీకరణ సంస్థ(కోర్(జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. అలాగే దక్షిణ మధ్య రైల్వే పిసిఇగా పనిచేసిన బ్రహ్మానందం జూన్ 30న పదవి విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో ప్రస్తుతం సిటిఇగా పనిచేస్తున్న డి. ఆంజనేయులురెడ్డిని నియమిస్తూ రైల్వే బోర్డు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.

# నెల్లూరును స్మార్ట్ సిటీగా మారుస్తాం

### త్వరలో రూ.830 కోట్లతో కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు
### నగరంలోని 13 హైస్కూళ్ల ఆధునీకరణ: మంత్రి పి.నారాయణ

**నెల్లూరు, జులై 11, ప్రభాతవార్త-వైద్యం:** నెల్లూరును స్మార్ట్ సిటీగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులతో సిటీ టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటిక ఇటు


శుక్రవారం నెల్లూరులో అధికారులు, నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ మంత్రి నారాయణ

సంక్షేమం ఇటు అభివృద్ధిని సమపాళ్లలో కూటమి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. నెల్లూరు నగర కార్పొరేషన్లలోనే 830 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. అక్టోబర్ ఒకటో తేదీ నాటికి అన్ని పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు. అమృత్ స్కీం కింద ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు అందిస్తామని మంత్రి చెప్పారు. ఏడాదిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా పూర్తి చేస్తామని వెల్లడించారు. సిటీలోని 13 హైస్కూల్స్‌ను డిసెంబర్ కల్లా వీఆర్‌సీ తరహాలోనే ఆధునీకరిస్తామని మంత్రి >>2



శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

## ల్యాబ్ టెక్నీషియన్లు
# నలుగురు సస్పెన్షన్

### రంగరాయ వైద్యకళాశాలలో లైంగికవేధింపుల కేసు
### క్రిమినల్ కేసులు నమోదు చేసిన పోలీసులు
### దోషులపై కఠిన చర్యలు తప్పవు: కలెక్టర్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో,జూలై 11 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా రంగరాయ వైద్య కళాశాల పారామెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపుల సంఘటనలో నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు ను విధుల నుండి సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేసామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జి.బిందుమాధవ్ సంయుక్తంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంగరాయ వైద్య కళాశాలలో పారామెడికల్ విద్యార్థినుల నుండి లైంగిక వేదింపులు అంశంపై అందిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలు, అటువంటి సంఘటనలు విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాలలో పునరావృతం కాకుండా చేపట్టిన చర్యలను గురించి వివరించారు. ఈ నెల 9వ తేదీన రంగరాయ వైద్య కళాశాలలో బిఎస్సి మెడికల్ లాబొరేటరీ టెక్నాలజీ కోర్సు చదువుతున్న 60 మంది విద్యార్థులు కళాశాలలో లాబ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వి.కళ్యాణ చక్రవర్తి తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేదింపులకు పాల్పడుతున్నాడని ఈ మెయిల్ ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ కు ఫిర్యాదు చేసారన్నారు. దీనిపై ఆర్ఎంసి ప్రిన్సిపాల్ వెంటనే స్పందించి ఈ ఫిర్యాదును లైంగిక వేధింపుల నిరోధానికి కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్నల్ కంప్లయింట్స్ కమిటీ విచారణకు అప్పగించారని, ఈ కమిటీ 9,10 తేదీలలో బిఎస్సీ ఎంఎల్టీ కోర్స్ చదువుతున్న 60 మంది విద్యార్థులు, నిందిత ఉద్యోగుల లను విచారించి, అందరి వాంగ్మూలాలు, రుజువులను నమోదు చేసిందన్నారు. విచారణ సందర్భంగా 55మంది విద్యార్థినులు, నిందితుడు కళ్యాణ చక్రవర్తితో పాటు, మరో ముగ్గురు లాబ్ టెక్నీషియన్లు ఎస్.గోపాలకృష్ణ, బి.జిమ్మిరాజు, జివిఎస్ ప్రసాదరావులు కూడా తమపై లైంగిక వేధింపులకు, అనుచిత ప్రవర్తనకు పాల్పడ్డారని తెలిపారన్నారు. కమిటీ విచారణలో ఫిర్యాదులోని ఆరోపణలు నిజమని 55మంది విద్యార్థినులు తెలియజేసారని, రుజువుల >>2

# మాతృభాష, రాజ్యభాష రెండూ కీలకమే


శుక్రవారం హైదరాబాద్‌లో రాజ్యభాష స్వర్ణోత్సవాలను ప్రారంభిస్తున్న ఎపి డిప్యూటీ సిఎం పవన్. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తదితరులు

### హిందీని నేర్చుకోవడం మరింత బలపడడానికే: ఎపి డిప్యూటీ సిఎం పవన్
### జాతీయ భాషావిభాగానికి 50యేళ్లు: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 11, ప్రభాతవార్త:** విద్య, ఉపాధి, వ్యాపార అవకాశాలకోసం భాషతో సంబంధం లేకుండా ముందు కెళ్తున్న ప్రస్తుత రోజుల్లో హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అలా చేయడం రాబోయేతరాల అభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుందన్నారు. శుక్రవారం గచ్చిబౌలి జిఎంసి బాలయోగి స్టేడియంలో నిర్వహించిన రాజ్య భాష విభాగం స్వర్ణోత్సవ వేడుకల్లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి >>2

## రజత్ భార్గవ్ సిట్ విచారణకు హాజరు

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో విశ్రాంత ఐఎఎస్ అధికారి రజత్ భార్గవ్ సిట్ ఎదుట శుక్రవారం విచారణకు హాజరయ్యారు,గత ప్రభుత్వ హయంలో రజత్ భార్గవ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా పనిచేసారు. మద్యంపై విడుదలైన జీవోలు,లావాదేవీలు తదితర విషయాలపై సమాచారం కోసం సిటన అధికారులు ఆయనను విచారణకు రావాలని ఆదేశించారు.విజయవాడలో సిట్ కార్యాలయంలో రజత్ భార్గవ్‌ను విచారిస్తున్నారు.శుక్రవారం ఉదయం 10గంటలకు రజత్ భార్గవ్ విచారణకు రావల్సి ఉండగా, అనారోగ్య కారణాలతో >>2

# ఒక్క యేడాదిలో సంక్షేమం డబుల్

### ఆర్థిక నిర్వహణ కష్టమైనా మా బాధ్యతగా భావిస్తున్నాం
### సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల

**కనేకల్ జూలై 11 ప్రభాతవార్త:** నిధుల సమీకరణ ఎంత కష్టమైన ప్రజాసేవ మా బాధ్యతగా భావిస్తామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని కనేకల్లు మండలం ఎర్రగుంట గ్రామంలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు గ్రామంలో కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులతో కలసి ప్రారంభించారు.అనంతరం సభానుద్దేశించి ఆయన మాట్లాడుతూ... వైకాపా పాలనలో రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఆవేదన వ్యక్తపరిచారు.అప్పుల కూపంలోకి నెట్టివేసి బయట ఎక్కడ అప్పు


ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

పుట్టకుండా చేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి ఎదురుకానన్ని ఆర్థిక సమస్యలు మనరాష్ట్రాల్లో వైకాపా పాలకులు సృష్టించారని ధ్వజమెత్తారు. నిత్యం అప్పుల కోసం రాత్రింబవళ్లు ఎంతో శ్రమించాల్సి వస్తుందన్నారు. ప్రతి నెలా ఖర్చులకు డబ్బులు సర్దుబాటు చేయడం పెద్ద సవాలుగా మారిందన్నారు. గ్రామాల్లో మహిళలు ఎలాగైతే ఖర్చుల కోసం ఇబ్బంది పడుతుంటారో అదేవిధంగా రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధులు సమకూర్చడం కూడా సమస్యగా ఉంటుందన్నారు. వైకాపా దివాలా తీయించిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు చతురత, అనుభవంతో రాష్ట్రం ప్రగతిబాట పట్టిందన్నారు. రాష్ట్రఆదాయం పెంచే విధంగా >>2

# మానవ వనరులే అభివృద్ధికి మెట్లు

>>తెలిపారు. మంచి పాలసీ ఏ విధంగా తేవాలని ఇక్కడ మనం కూర్చొని ఆలోచిస్తున్నామన్నారు. సామాజిక పరిస్థితులల్లోను మార్పు వస్తుందన్నారు. మానవ వనరుల అధికంగా ఉన్నందు వలనే భారత్ నుంచి, కీలకంగా తెలుగు రాష్ట్రాలనుంచి ప్రజలు ఇతర దేశాలకు వెళ్లి తమ ప్రతిభ చూపుతున్నారన్నారు.ఇప్పుడు ప్రవాస భారతీయులు అత్యధికంగా ఆయా దేశాల్లో ధనవంతులుగా ఉన్నారు.ఈ రోజు వార్త కథనాలు గమనిస్తే అమెరికాలోని విదేశీయుల్లో సంపన్న భారతీయులు అధికంగా ఉన్నారన్నారు. అందులో తెలుగువారు ఉండటం గర్వంగా ఉందన్నారు. దక్షిణాదిలో జనాభా తగ్గడం వల్ల నియోజకవర్గాల పునర్విభజనలో పార్లమెంట్ సీట్లు కూడా తగ్గుతాయనే చర్చ జరుగుతోందన్నారు. జనాభా ప్రత్యుత్పత్తి రేటులో 1.8 శాతంగా ఉన్న ఏపీ 2.1 శాతానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విజన్ భారత్2047 లక్ష్యసాధనకు జనాభా పెరుగుదల ఎంతో కీలకమని చంద్రబాబు అన్నారు. రాబోయే 20 యేళ్లలో వచ్చే పెను మార్పులకు అంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమ్మిళిత వృద్ధి జనాభా పెరుగుదలకు సరైన మార్గమన్న సీఎం జనాభా పెరుగుదలకు మంచి పాలసీని తీసుకొస్తామన్నారు. అభివృద్ధి ఉన్న చోటికి ప్రజలు వలస వస్తారనటానికి హైదరాబాద్ ఓ ఉదాహరణ అని గుర్తు చేశారు. సరైన ఆదాయం, ఉద్యోగం లేకపోవడం వల్లే చాలామంది పిల్లలు వద్దనుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. విధానాల్లో మార్పుల ద్వారా ఈ సమస్యలను అధిగమించాలని సూచించారు. ఇప్పుడు ఏ దేశంలో జనం ఉంటే వారికే ఎక్కువ గౌరవం దక్కుతోందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఎక్కువ జనాభా ఉన్న దేశం భారతదేశమని, సుమారు 143 కోట్లమంది ఉండగా, చైనా జనాభా 130 కోట్లని తెలిపారు. అమెరికాలో ఫెర్టిలిటీ రేటు 1.62 మాత్రమేనని 2.1 ఫెర్టిలిటీ రేటు ఉంటే రీప్లేస్‌మెంట్ ఉంటుందని లేనిపక్షంలో రోజురోజుకూ జనాభా తగ్గిపోతుందని తెలిపారు. మన దేశంలో బీహార్ 3.0,మేఘాలయ 2.9, వంటి రాష్ట్రాల్లో ఎక్కువ ఫెర్టిలిటీ రేటు ఉందని తెలిపారు. అలాగే ఏపీలో అది 1.78 చేరుకుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకున్న తెలుగువారు అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. దేశమంటే మనుషులు అనే నినాదానికి సార్థకత చేకూరాలని అన్నారు. గురజాడ చెప్పిన స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. ఎక్కువ మంది పిల్లలు ఉంటే కొన్ని దేశాల్లో అదే ఇస్తున్నారు, ప్రత్యక్ష నగదు బహుమతి ఇస్తున్నారని గుర్తు చేశారు. పలు దేశాల్లో చైల్డ్ అలవెన్స్ కింద ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తున్నారని తెలిపారు. హంగేరీలో పెద్ద కుటుంబాలకు కార్లు ఇస్తున్నారని సీఎం వివరించారు. చైనాలో ఇద్దరు పిల్లలు ఉంటే ప్రభుత్వం రూ.12 లక్షలు ఆర్థిక సాయం చేస్తోందన్నారు. ఏపీలో ఎంతమంది పిల్లలు ఉన్న తల్లికి వందనం కింద ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇస్తున్నామని సీఎం వెల్లడించారు.

**యువశక్తి తగ్గి..వృద్ధులు పెరుగుతున్నారు:** ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జనాభాతో పాటు జననాల రేటు తగ్గిపోతోందని చంద్రబాబు అన్నారు. యువశక్తి తగ్గిపోయి వృద్ధులు పెరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశంలోనైతే వయోజన సమస్య వస్తుందో అక్కడ వృద్ధిరేటే నిలిచిపోతుంది. భవిష్యత్తులోనూ సమస్యలు వస్తాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో సంతానోత్పత్తి రేట్ పడిపోతోంది. అమెరికాలో 1.62 శాతం, యూకేలో 1.54 శాతం, హంగేరిలో 1.50 శాతం, ఫ్రాన్స్‌లో 1.49 శాతం, రష్యాలో 1.47 శాతం, జర్మనీలో 1.46 శాతం, కెనడాలో 1.33 శాతం, జపాన్‌లో 1.23 శాతం, చైనాలో 1.02 శాతం, సింగపూర్‌లో 0.96 శాతం ఉంది. సంపన్న దేశాల్లో తక్కువ జననాల రేటు కన్పిస్తోంది. 2.1 కంటే తక్కువ ఉంటే జనాభా తగ్గిపోతుంది. మన దేశంలో బీహార్ 3.0, మేఘాలయ 2.9, యూపీ 2.4, జార్ఖండ్ 2.3, మణిపూర్ 2.2, తమిళనాడు 1.8, తెలంగాణ 1.8, కేరళ 1.8, కర్ణాటక 1.7, ఏపీ 1.7 శాతంగా ఉన్నాయి. జనాభా సమతుల్యత సాధించాలంటే 2.1 రేట్ ఉండాలి. అప్పుడే జనన మరణాలు సమతుల్యంగా ఉంటాయని సీఎం వివరించారు.

**అగ్రస్థానంలో భారతీయులే:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో మన దేశంలో సుస్థిర పాలన, అభివృద్ధి జరుగుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణలు 1995లో టెక్నాలజీ విప్లవం వచ్చిందన్నారు. ఐటీతో ప్రపంచవ్యాప్తంగా మన భారతీయులు అగ్రస్థానంలో నిలిచారన్నారు. అమెరికాలో 43 దేశాలకు చెందిన 125 మంది బిలియనీర్లలో మనవారు 10 మంది ఉన్నారు. ప్రపంచంలో అత్యధిక తలసరి ఆదాయం మన భారతీయులకే వస్తోంది. 2047 వరకూ జనాభా పరమైన ప్రయోజనం ఉన్నప్పటికీ సరైన సమయంలో పరిష్కార మార్గాలు అవలంభిస్తే విజేతలుగా నిలుస్తామని అన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తొలి సదస్సుకు వచ్చిన వారితో ముఖ్యమంత్రి కాసేపు మాట్లాడారు. జనాభా నిర్వహణపై వాళ్ల అభిప్రాయాలు అడిగారు. ఈ క్రమంలో కొందరు తమ అభిప్రాయాలు చెప్పడంతో పాటు కొన్ని సందేహాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నేను ఐదేళ్ల కుప్పం వెళ్లినప్పుడు ఒక ఉమ్మడి కుటుంబాన్ని చూశా. మూడు తరాలవారు కలిసి ఉంటున్నారు. పనులే కాదు సంపదకూడా వారు పంచుకుంటున్నారు. ప్రభుత్వాలు జనాభా ఎక్కువ మంది ఉంటే తక్కువ డబ్బు ఇస్తున్నాయి. ఇకపై జనాభా నియంత్రణ కాకుండా జనాభా నిర్వహణ విధానంతో ముందుకెళతామన్నారు. ఎన్టీఆర్ తాతమ్మ కల అనే సినిమా తీశారు. ఎందరు పిల్లలుంటే అంత సంతోషమని అందులో చూపించారు. పిల్లలను కనే వరం భగవంతుడు మహిళలకు ఇచ్చారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ మహేంద్ర దేవ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మైనా మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సుహానీ జలోటా, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ ఎం.ప్రకాశమ్మ, ప్రొఫెసర్ సంజయ్ కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ల్యాబ్ టెక్నీషియన్లు నలుగురు సస్పెన్షన్

>>పరిశీలనలో కూడా లైంగిక వేదింపులు, అశ్లీల మెస్సేజులు, అనుచిత ప్రవర్తన జరిగినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా నలుగురు నిందిత ఉద్యోగులను రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సస్పెండ్ చేసి, వారిపై స్థానిక వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయగా, శుక్రవారం మధ్యాహ్నం వారందరినీ అరెస్ట్ చేయడంజరిగిందని,వీరిపైచట్టపరమైనచర్యలుచేపట్టడం జరుగుతుందన్నారు.

ఈ సంఘటనలో తమపై జరుగుతున్న లైంగిక వేదింపులపై ధైర్యం ముందుకు వచ్చి ఫిర్యాదు చేసిన విద్యార్థినులను, ఫిర్యాదుపై తక్షణ విచారణ నిర్వహించి వారిలో వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని నింపిన ఆర్ఎంసి ప్రిన్సిపాల్, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఆర్ఎంసి సంఘటన లో విద్యార్థినులు, పనిచేసే మహిళలపై లైంగిక అకృత్యాలను నిరోధించేందుకు జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయలలో మహిళల రక్షణకు ఏర్పాటైన అంతర్గత కమిటీలను మరింత బలోపేతం చేసి చైతన్య పరుస్తామని తెలిపారు. విద్యార్థినులు, పనిచేసే మహిళలు లైగింక వేదింపులు ఎదురైతే నిర్భయంగా ఈ కమీటీలకు గాని, తనకు గానీ తెలియజేయాలని, ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచి, నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.

జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ఆర్ఎంసీ సంఘటనలో పోలీస్ స్టేషన్లలో శుక్రవారం ఉదయం ఫిర్యాదు నమోదు కాగా, నేరారోపితులు నలుగురిని మధ్యాహ్నం రెండున్నర లోపు అరెస్ట్ చేయడం జరిగిందని, సంబంధిత సెక్షన్ల ప్రకారం వారిపై చర్యలు గైకొనడం జరుగుతుందన్నారు. బాలికలు, మహిళల రక్షణకు చేపట్టిన చర్యల్లో భాగంగా పోలీస్ శాఖ ..శక్తి యాప్.. ను అందుబాటులోకి తెచ్చిందని, విద్యార్థినులు, వర్కింగ్ ఉమెన్ తమ పట్ల జరిగే అకృత్యాల నుండి రక్షణ పొందేందుకు ఈ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే శక్తి యాప్ గురించి బాలికలు, మహిళలందరికి తెలియజేసి అవసర సమయాల్లో వినియోగించుకునేలా చైతన్య పరచాలని మీడియాను కోరారు. ఈ సమావేశంలో రంగారాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏ.విష్ణువర్ధన్, జిజిహెచ్ ఇన్చార్జి సూపరింటెండెంట్ డా.పి.శ్రీనివాసన్, ఆర్ఎంసి పారామెడికల్ కోర్సుల కోఆర్డినేటర్ డా.కె.సతీష్ పాల్గొన్నారు.

# ఒక్క యేడాదిలో సంక్షేమం డబుల్

>> ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. పెద్దపెద్ద కంపెనీ ద్వారా పెట్టుబడులు పెట్టించి ఉపాధి కల్పనకు ముఖ్యమంత్రి అనునిత్యం శ్రమిస్తుంటారని గుర్తు చేశారు. తద్వారా రాష్ట్ర ప్రజలకు ఉపాధితో పాటు రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా, ప్రజా సంక్షేమం కోసం బాధ్యతగా పని చేస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పక్కగా ఒక్కోహామీని నెరవేర్చుతున్నామన్నారు. సంక్షేమం డబుల్ చేయగా, అభివృద్ధి పదింతలు చేస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తొలిసారి జిల్లాకు వచ్చినప్పుడు జిల్లా అభివృద్ధికి మొదట కూలీగా పనిచేస్తానని హామీ ఇచ్చామన్నారు. తనకు ముఖ్యమంత్రి ఇచ్చిన అవకాశాన్ని జిల్లా రుణం తీర్చుకోవటానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. ముఖ్యంగా తన పూర్వీకుల రాజకీయ నేపథ్యం రాయదుర్గం నియోజకవర్గంతో ముడిపడిందన్నారు. అందువల్లే ఉరవకొండతో పాటు రాయదుర్గంతో గట్టి సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. మంత్రి పయ్యావులతో మొదటి నుండి సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయనీ ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. ప్రతి క్షణం ప్రజాహితమే లక్ష్యంగా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజల విశ్వాసం, ఆశీస్సులతో ఎంపికైన ప్రభుత్వం పేదరికాన్ని దూరం చేయటానికి ఎంతగానో శ్రమిస్తోందన్నారు. ఐదేళ్ల వైకాపా దుష్టపాలన హెచ్ ఎల్ సి వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆర్థిక శాఖ మంత్రి పయాలకేశవుల సహకారంతో హెచ్ఎల్‌సి అత్యవసర పనులకు అనుమతులు లభించాయన్నారు. వారందరి చలవవల్లే గండ్లు, పైపింగ్లు పడే పరిస్థితి నుంచి బయట పడగలుగుతున్నామన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ తో తనకున్న వ్యక్తిగత పరిచయాలతో సకాలంలో తగిన సూచనలు సలహాలు ఇస్తూ ముందుకు నడిపిస్తుంటారని పేర్కొన్నారు. ప్రజలకు మేలు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల, ఎమ్మెల్యే కాలవ

చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రితో పాటు పయ్యావుల అనేక నిద్రలేని రాత్రులు గడుపుతుంటారన్నారు. నీధుల సమీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద కష్టంగా మారిందన్నారు. అయినప్పటికీ జిల్లాను ఏదో విధంగా అభివృద్ధి పరచాలనే దృఢ లక్ష్యంతో మంత్రి నిధులు సమకూర్చ గలుగుతున్నారన్నారు. ఇంత గడ్డు పరిస్థితుల్లో కూడా రూ.3800 కోట్ల తో హంద్రీనీవా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే వైకాపా పాలనలో ఆగిపోయిన జీడిపల్లి బైరవాణి తిప్ప ప్రాజెక్ట్ పనులు పునఃప్రారంభించామన్నారు. ఆవులదట్ల, మాల్యం బ్రాంచ్ కాలువలకు నీధులు సమకూర్చి సకాలంలో పూర్తి చేయడానికి మంత్రి తోడ్పాటు అందించాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న దశలో రాయదుర్గాన్ని కూడా ప్రతిపాదన చేయించుకొమ్మని ముందే అప్రమత్తం చేశారన్నారు. నేమకల్లు రిజర్వాయర్‌తో పాటు హెచ్.ఎల్.సి ఆధునికరణ పనులను పూర్తి చేసుకోవడానికి మంత్రి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాల్లో కొనసాగినంత కాలం తమ ఇరువురి మధ్య ఇదే విధమైన ప్రేమ, అభిమానాలు కొనసాగాలని, దాంతో ప్రజలకు ఏదో విధంగా మేలు జరగాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ రంగసంస్థల నిర్వహణపై పరిశీలన

>> కమిటీలో సభ్యులుగా వున్న శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కాంట్రాక్టర్ ఐజాక్ బాషా, శాసనసభ్యులు నడికుదిటి ఈశ్వరరావు, ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు(బేబీ నాయన), గిడ్డి సత్యనారాయణ తదితరులు సమావేశంలో పాల్గొని పలు ప్రభుత్వ సంస్థల పనితీరుపై అధికారులతో చర్చించి ఆయా సంస్థల నిర్వహణకు సంబంధించి వార్షిక నివేదికలు, అకౌంట్ల ఆడిట్, పనితీరుకు సంబంధించిన పలు అంశాలను తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో జి.వి.ఎం.సి. కమిషనర్ కేతన్ గార్గ్, వి.ఎం.ఆర్.డి.ఏ. జాయింట్ కమిషనర్ రమేష్, పర్యాటక సంస్థ డివిజనల్ మేనేజర్ జగదీష్, జిల్లా పర్యాటక అధికారి మాధవి, ఏపిఐఐసి అధికారులు తమ సంస్థల పనితీరు, కార్యకలాపాలపై కమిటీకి వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును మదింపుచేసి వాటి అకౌంట్ల నిర్వహణ, ఆర్థిక నిర్వహణపై నివేదికలను పరిశీలించి,వాటి నిర్వహణను మెరగుపరిచేందుకు ప్రభుత్వానికి తమ కమిటీ సూచనలు చేస్తుందని ఛైర్మన్ కూన రవికుమార్ చెప్పారు. అన్ని ప్రభుత్వ సంస్థలు తమ కార్యక్రమాలపై, అకౌంట్ల నిర్వహణ, ఆడిట్ పై పూర్తిస్థాయి సమాచారంతో కూడిన నివేదికలు అందజేసినపుడే తాము ప్రభుత్వానికి సరైన నివేదికలు అందించగలమని చెప్పారు. రాష్ట్ర పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ పదహారేళ్ల తర్వాత ఈ సమావేశం తొలిసారిగా నిర్వహిస్తోందని ఛైర్మన్ రవికుమార్ పేర్కొన్నారు. విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యక్రమాలు, చేపట్టిన ప్రాజెక్టులపై జి.వి.ఎం.సి. కమిషనర్ కేతన్ గార్గ్ వివరించారు. వి.ఎం.ఆర్.డి.ఏ. కమిషనర్ తరపున జాయింట్ కమిషనర్ రమేష్ సంస్థ కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా విశాఖ నగరాభివృద్ధి సంస్థ ద్వారా న్యాయ వివాదాల సత్వర పరిష్కారానికి చేసిన ఏర్పాట్లపై కమిటీ ఆరా తీసింది. ప్రజలకు త్వరగా సేవలు అందించేందుకు వీలుగా ప్రత్యేక జ్యుడిషియల్ ప్యానెల్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ సూచించారు. విఎంఆర్‌డిఏ అకౌంట్ల ఆడిట్ గురించి కూడా తెలుసుకున్నారు. ఏపి పారిశ్రామిక మౌళిక సదుపాయాల సంస్థ ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా పారిశ్రామిక వేత్తలకు కేటాయించిన భూములు, వాటిని ఏ మేరకు సద్వినియోగం చేసుకొని పరిశ్రమాలు ఏర్పాటు చేస్తున్నారనే అంశంపై కమిటీ సభ్యులు చర్చించారు. ఆయా భూములను పారిశ్రామిక వినియోగానికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగించినపుడు ఏ రకమైన చర్యలు చేపట్టారనే అంశంపై కూడా కమిటీ సభ్యులు ఆరా తీశారు. శ్రీకాకుళం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యకలాపాలపై అక్కడి మునిసిపల్ కమిషనర్ ప్రసాదరావు వివరించారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులు, వాటి నిర్వహణపై సంస్థ డివిజనల్ మేనేజర్ జి.వి.బి.జగదీష్ వివరించారు. సమావేశంలో ఏపి లెజిస్లేచర్ కమిటీ సంయుక్త కార్యదర్శి పి.వి.సుబ్బారెడ్డి, జి.వి.ఎం.సి. అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ సింహాచలం, మెడ్‌టెక్ జోన్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖజిల్లాల పర్యాటక అధికారులు నారాయణరావు, కుమారస్వామి, మాధవీలత, వి.ఎం.ఆర్.డి.ఏ. ఎస్టేట్ ఆఫీసర్ బి.దయానిధి పాల్గొన్నారు.

# విచారణకు హాజరు

>> ఆయన ఆలస్యంగా వచ్చారు.మొదట తన అనారోగ్యం దృష్ట్యా మరో రోజు విచారణకు వస్తానని రజత్ భార్గవ్‌ను కోరారు.అయితే కీలక సమాచారం కావాల్సి వుండగా,ఆయన తప్పని సరి విచారణకు తక్షణం రావాలని సిట్ అధికారులు ఆయనకు స్పష్టం చేసారు.దాంతో నేడే విచారణకు వచ్చారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు నేతలు, అధికారుల్ని సిట్ విచారించి అరెస్ట్ చేసారు.

# సిటీగా మారుస్తాం

>>నారాయణ తెలిపారు. 9వ డివిజన్లో 22 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటు చేస్తామని అదే విధంగా అల్లీపురం డంపింగ్ యార్డులో అన్ని హంగులతో పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. పినాకినిలో వాటర్ స్పోర్ట్స్ ఆక్రమిస్తే తిరిగి తీసుకుంటామని హెచ్చరించారు.సమీక్షలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# ఆర్థికవృద్ధికి కృషి

>> సంతృప్త స్థాయి కూడా 90 శాతం వచ్చేలా అధికారులు పని చేయాలి." అని చంద్రబాబు ఆదేశించారు ఆదాయార్జన శాఖలను లీడ్ చేస్తున్న అధికారులు వినూత్నంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఈ శాఖలకు చెందిన అధికారులు చక్కటి నాయకత్వం అందిస్తే.. ఆయా శాఖల పని తీరు మరింత మెరుగ్గా ఉంటుంది. ఆయా శాఖల్లో ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని అన్నారు. నాయకులుగా ఆలోచించి పని చేస్తే ఎలాంటి సమస్యకు అయినా పరిష్కారం లభిస్తుంది. రాష్ట్రానికి అభివృద్ధి ఎంత ముఖ్యమో.. సంక్షేమమూ అంతే ముఖ్యం. రెండు సమపాళ్లల్లో ఉండాల్సిందే. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని.. రాష్ట్రాన్ని మరింత ప్రగతి బాటన పయనించే విధంగా పని చేయాలి." అని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 22 మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో నారాయణపూర్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 8 మంది మహిళా మావోయిస్టులు ఉండగా లొంగిపోయిన వారిపై రూ.37లక్షల రివార్డు ఉందని ఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా లొంగిపోయిన ఒక్కొక్కరికి రూ.50వేల నగదు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అబూజ్‌మడ్ అడవుల్లో నిరంతరం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ కొనసాగుతుందని, ఈ యేడాదిలో ఇప్పటి వరకు 110 మంది మావోయిస్టులు లొంగిపోవడం జరిగిందని ఎస్పీ తెలియజేశారు.



శుక్రవారం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను సత్కరించి, గణేశ ప్రతిమను బహూకరిస్తున్న సీఎం చంద్రబాబు

# గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో సీఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ, జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నశీర్‌తో శుక్రవారం సాయంత్రం దాటిన తరువాత సీఎం చంద్రబాబునాయుడు బేటీ అయ్యారు.ఉండవల్లిలోని తన ఇంటి నుంచి రాజభవన్‌కు చేరుకున్న చంద్రబాబుకు అక్కడి సిబ్బంది ఘన స్వాగతం పలికారు.జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నశీర్ చంద్రబాబు సాదరంగా రాజభవన్‌లోకి ఆహ్వానించారు.అనంతరం గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నశీర్‌తో చంద్రబాబు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.రాష్ట్రంలో ఇటీవల అమలులోకి తీసుకుని వచ్చిన తల్లికి వందనం పథకంతో సహా పేదరిక నిర్మూలనకు పీ4 పథకం ద్వారా తీసుకుంటున్న చర్యల గురించి సీఎం గవర్నర్‌కు వివరించారు.రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు.అమరావతి రాజధాని నిర్మాణం,యోగ దినోత్సవం, తల్లితండ్రులు,ఉపాధ్యాయుల మెగా సమావేశాల నిర్వహణ.ప్రపంచ రికార్డుల సాధన, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి,ఆదాయం కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు.శాంతి భద్రతల పరిస్థితుల గురించి సీఎం తెలిపారు.తాజా రాజకీయాలతో సహా నాలుగురోజుల పాటు ఢిల్లీలో పర్యటించే అంశంపైన సీఎం చంద్రబాబు ఏపీ గవర్నర్‌కు వివరించారు. ఆరోగ్యరంగంలో తీసుకుంటున్న చర్యలను తెలిపారు.గవర్నర్‌ను ఈ సమావేశ అనంతరం గవర్నర్‌ను సీఎం చంద్రబాబు సముచిత రీతిన సన్మానించారు.శ్రీగణేశ ప్రతిమను బహుకరించారు.గంటకు పైగానే గవర్నర్‌తో సీఎం పలు అంశాలపై చర్చించారు.అనంతరం సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాస గృహానికి చేరుకున్నారు.

# కేంద్రం ఎరువుల కోత విధించలేదు

## వ్యవసాయ శాఖ సంచాలకులు డిల్లీ రావు

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం చేసే ఎరువుల కేటాయింపులలో ఇప్పటివరకు ఎటువంటి కోత విధించలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డిల్లీ రావు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజనుకు ఎప్పటి మాదిరిగానే 16.76 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు.. కేటాయించగా జూన్ నెల ఆఖరు నాటికి 5.64 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి వచ్చినట్లు వీటిని ప్రైవేటు, సహకార సంస్థల ద్వారా రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఎరువుల వినియోగ పరిణామ క్రమంలోనీ సందర్భాన్ని ప్రస్తావిస్తూ పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలు తీర్చే విధంగా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయు ఉద్దేశంతో అధిక దిగుబడి ఇచ్చు వంగడాలను అభివృద్ధి చేసి వాటికి కావలసిన పోషకాలను రసాయనిక ఎరువుల రూపంలో అందించడాన్ని అలవాటు చేసింది, ప్రోత్సహించింది వ్యవసాయ శాఖనే అని, అయితే ప్రస్తుత మెరుగుబడిన భూభౌతిక పరిస్థితి మరియు నేలలోని పోషకాల లభ్యతల ఆధారంగా కొత్త తరం పంటల రకాల సాగు ద్వారా తక్కువ ఎరువుల వినియోగంతో అదే దిగుబడులను సాధించవచ్చని తెలిపారు.కొంత మంది వివిధ వేదిక లలో పేర్కొన్నట్లు ఎరువుల కేటాయింపులలో కేంద్రప్రభుత్వం కోత విధించడం , వాటిని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి రైతులను ఇబ్బందులకు గురి చేయడం జరిగిందన్న వార్త పూర్తిగా అవాస్తవం అని తెలిపారు. రైతులు అవగాహన లోపంతో రోజు రోజుకు పెంచుకుంటూ పోతున్న రసాయన ఎరువుల వాడకపు మోతాదు తద్వారా ఉత్పన్నమయ్యే దుష్పరిణామాలు దృష్టిలో వుంచుకొని అధిక ఎరువుల వినియోగాన్ని తగ్గించడానికి మాత్రమే కొన్ని ప్రత్యామ్నాయ పద్ధతులను అందుబాటులోకి తేవటం జరిగిందని తెలిపారు. వాటిలో ముఖ్యంగా సేంద్రియ మరియు జీవన ఎరువుల వాడకాన్ని పెంచడం, రసాయన ఎరువుల పై ఆధారాన్ని కొంతమేర తగ్గించడం, దిగుబడి మెరుగుదల తో పాటు పర్యావరణ హానిని నివారించడం, పచ్చి రొట్ట పైర్ల వాడకం ద్వారా భూమి సారవంతమయి ,నేరుగా నత్రజని నేలకు అందించడంలో సహాయ పడతాయి, భూసార పరీక్షల ఆధారంగా పంటలకు సరిపోయే ఎరువుల మోతాదును వాడకం ద్వారా రసాయన ఎరువుల ఖర్చును తగించవొచ్చు అని అన్నారు నానో ఎరువులు వాడటం. వల్ల ఎరువుల వృథా తగ్గి ఎరువుల పై ఖర్చు కూడా తగ్గుతుంది, నేల ఆరోగ్యం మెరుగు అవుటం నీటి కాలుష్యం తగ్గటము జరుగుతాయి పప్పు జాతి పంటలను అంతర ,ప్రధాన పంటలుగా వేసుకోవడం వలన వాటి వేర్లు గాలిలో ఉన్న నత్రజనిని నేలకు అందించి భూమి సారవంతము చేస్తాయి తద్వారా ఎరువుల వాడకం తగ్గుతుంది. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించడానికి వివిధ ప్రత్యామ్నాయాల పై రైతులలో అవగాహన కల్పించడం వ్యవసాయ శాఖ యొక్క ముఖ్య ఉద్దేశం.

# మాతృభాష, రాజ్యభాష రెండూ కీలకమే

>> కిషన్ రెడ్డి, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌తో పాటు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశ ఐక్యతలో రాజ్యభాష హిందీ కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేశారు. దేశ సమైక్యతలో భాగంగా ఒక బెంగాలీ గీతం జాతీయ గీతం అయ్యింది, ఒక పంజాబీ భగత్ సింగ్ దేశం కోసం పోరాడే విప్లవకారుడు అయ్యాడు, రాజస్థాన్‌కు చెందిన రాణాప్రతాప్ శౌర్యానికి చిహ్నం అయ్యారు. తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా అయ్యారు. మద్రాస్ ప్రెసిడెన్సీ, ద్రవిడ ప్రాంతంలో ఉన్న ఒకరు చేసిన మువ్వన్నెల జెండా దేశానికి తిరంగా అయిందని పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రతీ భాషా జీవ భాష, మాతృ భాష.. కానీ రాజ్య భాష మాత్రం హిందీ అని ఆయన స్పష్టం చేశారు. మనం ఇంట్లో మాట్లాడుకోవడానికి మాతృ భాష ఉంది. కానీ మన ఇంటి సరిహద్దులు దాటితే మన రాజ్య భాష హిందీ ఉందన్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు దేశంలోని ఇతరత్రా అన్ని భాషల పౌరులకు మాతృ భాష మీద గౌరవం ఉంటుందని అన్నారు. విద్యా, వైద్యం, వ్యాపారం, ఉపాధి కోసం అన్ని భాషలు, మాండలికాలు అవధులను దాటుకుంటూ వెళ్లిపోతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో హిందీ వద్దు అనుకోవడం, వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని పరిమితం చేసినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని కోల్పోయినట్లు కాదని, మనం మరింత బలపడటం అన్నారు. ఇంకొక భాషని అంగీకరించడం అంటే మనం ఓడిపోవడం కాదు, కలిసి ప్రయాణం చెయ్యడం అని తెలిపారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం వల్లనే ఐటీ రంగంలో ముందున్నామని, అలాంటిది దేశం మొత్తం మీద ఎక్కువ శాతం జనాభా మాట్లాడే హిందీ భాష నేర్చుకోవడం వల్ల ప్రయోజనమే కానీ నష్టం ఉండదన్నారు. సౌత్ ఇండియన్ సినిమాలలో 31 శాతం సినిమాలు హిందీలో డబ్ అయ్యి ఆదాయం పొందుతున్నాయని, ఇలా వ్యాపారాలకు హిందీ కావాలి, నేర్చుకోవడానికి మాత్రం హిందీతో ఇబ్బందేంటి అని పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు.

**భాషలు వేరువేరు అయినా, భారతీయులందరి భావన ఒక్కటే : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

భాషలు వేరువేరు అయినా, భారతీయులందరి భావన ఒక్కటేననడానికి ఇదొక ఉదాహరణ అని తెలిపారు. అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో హిందీ, ఇతర భారతీయ భాషల ద్వారా ప్రజలతో సమన్వయం చేసుకుంటూ వికసిత భారత్, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను చేరుకునేందుకు మనమంతా కలిసి ప్రయత్నించాలన్నారు. మన దేశంలోని ప్రజలందరిని తమ తమ మాతృభాషల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలకు అనుసంధానించడం చాలా అవసరమన్నారు. అప్పుడే ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతారని తెలిపారు. జాతీయభాషా విభాగం ఏర్పాటై 50 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ స్వర్ణ జయంతి వేడుకల్లో భాగంగా మొదటి కార్యక్రమాన్ని ఢిల్లీలో నిర్వహించగా, రెండో కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తుండటం మనందరికీ గర్వకారణమని అన్నారు. ఏ సంస్థకైనా 50 ఏళ్ల ప్రయాణం చాలా ప్రత్యేకమైనదని, ఈ 50 ఏళ్లలో సాధించిన ప్రయాణాన్ని గుర్తుచేసుకోవడం, సంబరాలు చేసుకోవడం ఒక ఎత్తయితే, భవిష్యత్ కార్యాచరణను నిర్దేశించుకోవడం మరో కీలకమైన అంశమని అన్నారు. మాతృభాష స్థానాన్ని ఎలాంటి ఇతర భాషా తీసుకోలేదని మహాత్మాగాంధీ, హిందీభాషాభివృద్ధి అవసరమని మహర్షి దయానంద సరస్వతి, భౌతికశాస్త్రాన్ని మాతృభాషలో నేర్పాలని ప్రఖ్యాత శాస్త్రవేత్త సీవీ రామన్, తాను శాస్త్రవేత్తగా ఎదిగేందుకు కారణం మాతృభాషలో విద్యాబోధనే అని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పడం, మాతృభాషలో విద్యను ప్రోత్సహించాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పడం ఇవన్నీ ప్రాంతీయభాషలకు గౌరవాన్ని ఇస్తూనే.. ఒక జాతీయ భాష ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతున్నాయన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజపేయి ఐక్యరాజ్య సమితిలో హిందీలో ప్రసంగించి మన భాషకు అంతర్జాతీయ తీసుకొచ్చారని, మన దేశంలో అనేక భిన్న భాషలు ఉన్నప్పటికీ, అందులోని భావన మాత్రం ఒకటేనని, స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో వందేమాతరం, భారత మాతాకీ జై నినాదాలు దేశమంతా ప్రతిధ్వనించాయన్నారు. నరేంద్రమోడీ ప్రభుత్వం 11 భారతీయ భాషలకు ప్రాచీన భాష హోదాను కల్పించిందన్నారు. ఈ భాషలన్నింటికీ కనీసం 1500-2000 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. 2020లో తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానంలోనూ ప్రాంతీయ భాషలకు పెద్దపీట వేసిందని, ప్రధానమంత్రి మోడీ కూడా విదేశీ పర్యటనల్లో హిందీలోనే మాట్లాడటం, వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నప్పుడు అక్కడి భాషలో మాట్లాడటం ఇవన్నీ భారతీయ భాషల గౌరవాన్ని పెంచే దిశగా తీసుకున్న నిర్ణయాలే అని తెలిపారు. ఈ గౌరవాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మనమంతా మన మాతృభాషల్లో మాట్లాడటం, మన దేశ భాషలను గౌరవించుకోవడం చాలా అవసరమని అన్నారు.

## వారం - వర్జ్యం

12-07-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
విదియ రా.1.45
ఉత్తరాషాఢ ఉ.6.35
వర్జ్యం : ఉ.10.38-12.15
దు.కె.5.42-7.22
శుభసమయం:ఉ.5.20-6.00, సా.6.30-7.10
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగులు ప్రమోషన్లు పొందుతారు. కళారంగాలవారికి సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**వృషభం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారు విదేశీ పర్యటనలు పొందుతారు. సోదరుల నుండి శుభవార్తలు వింటారు.

**మిథునం:** కొత్తమిత్రులు పరిచయమై సాయం అందిస్తారు. ఆరోగ్యంపట్ల చాలా జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** బంధువుల నుండి ముఖ్య సమాచారం అందుతుంది. కాంట్రాక్టులు చివరిలో దక్కించుకొంటారు.

**సింహం:** ఇంటిలో కొంత సౌఖ్యం, సంతోషం కలుగుతాయి. శక్తి సామర్థ్యాలకు, ప్రతిభా పాటవాలకు తగిన గుర్తింపు పొందుతారు.

**కన్య :** ఆర్థికంగా చికాకులు ఎదుర్కొంటారు. ముఖ్యమైన పనులు శ్రమానంతరం పూర్తిచేస్తారు.

**తుల :** చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైనా పట్టుదలతో పూర్తిచేస్తారు. రుణవత్తిడులు పెరిగి చికాకులు పెడతాయి.

**వృశ్చికం:**కుటుంబంలో ఏర్పడిన చిక్కులు తొలగిపోతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**ధనుస్సు:** ఆకస్మికంగా డబ్బు చేతి కందుతుంది. జీవితభాగస్వామి సలహాతో గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**మకరం:** ఓర్పు, పట్టుదలతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించు కోగలరు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**కుంభం:** ఎంతో కాలంగా వేధిస్తున్న సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఉద్యోగా లలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**మీనం :** అరుదైన ఆహ్వానాలు అందుతాయి. జీవిత భాగస్వామ్య నుండి ఆస్తి లాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జగన్ విధ్వంస యాగం కొనసాగిస్తున్నారు

## ఆరోగ్య మంత్రి సత్యకుమార్




**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వినాశనం కోసం సీఎం చంద్రబాబు ప్రగతి యజ్ఞం చేస్తుంటే.. జగన్ విధ్వంస యాగాన్ని కొనసాగిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటనలో విమర్శించారు. పరామర్శల పేరుతో జగన్ విధ్వంస రాజకీయాలకు తెర తీస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన వాహనాల కింద సొంత పార్టీ కార్యకర్తలు పడి మరణించినా మనస్తత్వం జగన్‌దన్నారు. మామిడిని ట్రాక్టర్లతో తొక్కించడమేమిటన్నారు. ఆయన వైఖరితో ప్రజలకు మరింత దూరమవుతున్నారన్నారు.ఏడాది కూటమి పాలనలో సాధించిన విజయాలను తట్టుకునే స్థితిలో జగన్ లేడన్నారు.రాష్ట్రాన్ని జగన్ ఆర్థికంగా నష్ట పరిస్థితికి, సీఎం చంద్రబాబు వ్యవస్థను గాడిలో పెట్టారన్నారు.కూటమి ప్రభుత్వ పాలనతో పెట్టుబడులకు దేశంలో అత్యంత అనువైన నాలుగు రాష్ట్రాల్లో ఏపీ ఒకటని ప్రఖ్యాత ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. జగన్ దుశ్చర్యలకు ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారన్నారు.11 సీట్లకు పరిమితమైన ఆ పార్టీ వచ్చే ఎన్నికల్లో పులివెందులతో సహా ఎక్కడా గెలిచే అవకాశాలు లేవన్నారు.

# చట్టాల సరళీకరణ ద్వారా సులభతర వాణిజ్యం

## - డి రెగ్యులేషన్, కంప్లయెన్స్ రిడక్షన్ అంశాలపై కీలక సమావేశం

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** జూలై:వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన చట్టాల సరళీకరణలో భాగంగా సులభతర వాణిజ్యం కింద డి రెగ్యులేషన్, కంప్లయెన్స్ రిడక్షన్ అంశాలపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి(కోఆర్డినేషన్)కేబినెట్ సెక్రటేరియట్, టాస్కుఫోర్సు కమిటీ సభ్యులు మనోజ్ గోవిల్,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ల నేతృత్వంలో శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర కార్యదర్శి మనోజ్ గోవిల్ మాట్లాడుతూ దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డీ రెగ్యులేషన్, కంప్లయెన్స్ రిడక్షన్ కు అనుగుణంగా చట్టాల్లో మార్పులు చేయడం ముందుందని పేర్కొన్నారు. కాలాను గుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా సులభతర వాణిజ్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ చట్టాలకు అనుగుణంగా పాత చట్టాల్లో మార్పులు చేర్పులు,సరళీకరణ చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన రీతిలో ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు.దానిలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం డి రెగ్యులేషన్ మరియు కంప్లయెన్స్ రిడక్షన్ పై కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక టాస్కుఫోర్సు ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.వివిధ చట్టాల అమలును మరింత సులభతరం చేయడం ద్వారా ప్రజలకు వాణిజ్య వేత్తలకు ఉపయోగపడే విధంగా కృషి చేయడం జరుగుతుందని కేంద్ర కార్యదర్శి మనోజ్ గోవిల్ పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం నేషనల్ బిల్డింగ్‌కోడ్‌ను అమలులోకి తెచ్చిందని దానిని రాష్ట్రాలు పూర్తి స్థాయిలో అనుసరించి వివిధ బహుళ అంతస్తుల భవనాల్లో అగ్నిప్రమాద సంబంధిత భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని మనోజ్ గోవిల్ సూచించారు. ఈసమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ



డిరెగ్యులేషన్, కంప్లయెన్స్ రిడక్షన్ అంశాలపై సమావేశంలో మనోజ్ గోవిల్, కె.విజయానంద్

వివిధ చట్టాల డీ రెగ్యులేషన్ మరియు కంప్లయెన్స్ రిడక్షన్ కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వ జన్ విశ్వాస్ చట్టానికి అనుగుణంగా రాష్ట్ర స్థాయి చట్టాల్లో మార్పులు చేర్పులు చేపట్టి ఆయా చట్టాల సరళీకరణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.ఇందుకు సంబంధించి ఇప్పటికే 76 చట్టాల్లో మార్పులు చేర్పులు చేసి సరళీకరణకు ప్రతిపాదించడం జరిగిందని వాటిలో ఎక్సైజ్ శాఖలో 18,భూగర్భ గనుల 19,కార్మిక ఫ్యాక్టరీస్ అండ్ బాయిలర్స్ శాఖలో 21,సహకార శాఖలో 4,ఇంధన శాఖలో 3 చట్టాలను ప్రతిపాదించినట్టు సిఎస్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు సాంకేతికతను మరింత చేరువ చేసి తద్వారా సకాలంలో మెరుగైన సేవలు అందించడంలో ముందుందని ముఖ్యంగా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఇప్పటికే 520 సేవలను అందుబాటు లోకి తేవడం జరిగిందని సిఎస్ విజయానంద్ తెలిపారు.

# జిఎస్టీ వసూళ్లలో ఏపి రోల్ మోడల్ గా ఉండాలి

## - డేటా అనలటిక్స్ ద్వారా పన్నుల విశ్లేషణ: సీఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** జీఎస్టీ వసూళ్లలో ఏపీ దేశానికి రోల్ మోడల్ గా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పన్ను ఎగవేతలు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన కేంద్ర రాష్ట్ర జీఎస్టీ అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. డేటా అనలటిక్స్ లాంటి సాంకేతికతను వినియోగించి ఎగవేతలను అడ్డుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమర్ధవంతమైన పన్ను వసూళ్ల ప్రక్రియ ద్వారా జాతీయ సంపదను పెంచాలని సీఎం సూచించారు. అది ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ఉపకరించాలని సీఎం అన్నారు. దీనికోసం జీఎస్టీ రియలైజేషన్ కోసం కేంద్ర రాష్ట్రాల అధికారుల మధ్య సమాచార సమన్వయం ఉండాలన్నారు. జీఎస్టీ వసూళ్లకు సంబంధించి పొరుగు రాష్ట్రాలతో పోటీ పడేలా కార్యాచరణ ఉండాలని అన్నారు. వస్తున్న పన్ను వసూళ్ల సమాచారాన్ని డేటా అనలటిక్స్ ద్వారా విశ్లేషించాలని ముఖ్యమంత్రి అన్నారు. ఎగవేతలను గుర్తించేందుకు విద్యుత్ వినియోగం లాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఏపీలో ఎలాంటి పన్ను ఎగవేతలకు అవకాశం లేకుండా చూడాలని జీఎస్టీ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రతీ వ్యవస్థా సమర్ధవంతంగా పని చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, పెట్టుబడులను ఆకర్షించటంలో ఏపీ దేశంలో 4 స్థానంలో ఉందని... అన్ని రంగాల్లోనూ ఏపీ బెస్ట్ గా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో హైదరాబాద్ ను అభివృద్ధి చేసినందు వల్లే తెలంగాణా రాష్ట్రానికి 75 శాతం మేర ఆదాయాన్ని తెచ్చిపెడుతోందని ఏపీలోని విశాఖ, విజయవాడ, తిరుపతి లాంటి నగరాలు కూడా అదే స్థాయికి చేరుస్తామని అన్నారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్లలో ఎక్కడా పొరపాటు జరక్కుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల సమాచారాన్ని ఒకచోటకు చేర్చి డేటా లేక్ ను రూపొందిస్తుందని ఈ సమాచారాన్ని కేంద్ర జీఎస్టీ అధికారులకూ అందుబాటులోకి తెస్తామన్నారు.

## రాష్ట్రంలో 211 మంది

# బాల కార్మికులకు విముక్తి

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 1 నుంచి 30 వరకు నిర్వహించిన తనిఖీల్లో 211 మంది బాల కార్మికులకు పని నుంచి విముక్తి కల్పించినట్లు కార్మికశాఖ ఒక ప్రకటనతో తెలిపింది. వీరిలో 14 ఏళ్ళ లోపు వారు 21 మంది ఉన్నారని పేర్కొంది. సంబంధిత యజమానులపై కనీస వేతనాల చట్టం కింద 147 కేసులు నమోదు చేశామని, కనీస వేతనాల చట్టం అథారిటీ కోర్టు ద్వారా ఆయా బాల కార్మికులకు రూ.1,98,148 ఇప్పించామని తెలిపింది. నిబంధనలు ఉల్లంఘించి పిల్లలను యజమానులు పనిలో పెట్టుకుంటే ఆరు నెలల నుండి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష,రూ.20 వేల నుండి రూ.50 వేల వరకు కోర్టులు జరిమానా విధిస్తాయని తెలిపింది.

# తిరుమల సమాచారం

# స్వచ్ఛంద వ్యవస్థలో సంస్కరణలు

## - శ్రీవారి సేవగ్రూప్ పర్యవేక్షకులకు ఐఐఎంతో శిక్షణ



**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు వస్తున్న అశేషసంఖ్య భక్తులకు ఇతోధిక సేవలందించడంలో కీలకపాత్ర వహిస్తున్న శ్రీవారిసేవకుల స్వచ్ఛంద వ్యవస్థలో సంస్కరణలపై టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా త్వరలో ప్రారంభించనున్న ప్రొఫెషనల్ శ్రీవారి సేవ, ఎన్ఆర్ఐ సేవ, గ్రూప్ పర్యవేక్షకుల సేవల కార్యాచరణ పురోగతి గురించి శుక్రవారం సాయంత్రం ఇఒ ,అదనపు ఇఒ ఇతర అధికారులతో కలిసి సమీక్షించారు. ఐఐఎం అహమ్మదాబాద్ బృందంచే పర్యవేక్షకులకు శిక్ష;ణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని ఇఒ ఈ సందర్భంగా సంబంధిత ఐటి జిఎం శేషారెడ్డి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవికి సూచనలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు., ఈ సందర్భంగా ఐటి విభాగం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పర్యవేక్షకుల కోసం రూపొందించిన అప్లికేషన్‌ను చూపించారు. ప్రొఫెషనల్స్ సేవలను త్వరితగతిన ప్రారంభించాలని, ఎన్ఆర్ఐ సేవలను విస్తరించేందుకు ఏపిఎన్ఆర్‌టి సంస్థతో సంప్రదింపులు చేయాలని ఇఒ తెలిపారు. ఈ సమావేశంలో అశ్వనీ ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమకుమారి, పిఆర్ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న భక్తుల రద్దీ - వెంకన్న దర్శనానికి 24గంటలు



**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం.. వరుసగా రెండవ శనివారం, ఆదివారంతో రెండుమూడురోజులు సెలవులు రావడంతో ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. లక్ష మందికిపైగా తిరుమలలో భక్తులు ఉండ టంతో శుక్రవారం ఉదయానికి వైకుంఠమ్ 1,2క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి వెలుపల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి.ఉదయానికి స్వామివారి సర్వదర్శనానికి 20గంటలు సమయం పడుతుండగా సాయంత్రానికి ఈ రద్దీ విపరీతంగా పెరిగింది. సాధారణ సర్వదర్శనానికి 24గంటలు సమయం కేటాయిస్తున్నారు. 300 రూపాయలు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో సిఫార్సుల ద్వారా ఎస్ఇడి ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఎనిమిదిగంటల పైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు.టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు 10-12గంటలు నిరీక్షణ తప్పడంలేదు. శుక్రవారం సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 25వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. వెలుపల క్యూలైన్లలో, ఆలయంలోపల కంపార్టుమెంట్లలో శ్రీవారిసేవకులు భక్తులకు నిరంతరాయంగా పాలు,టీ, అన్నప్రసాదాలు,తాగునీరు పంపిణీ చేస్తున్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో అత్యాధునిక భద్రత

## - తిరుమలలో భద్రతపై టిటిడి ఇఒ సమీక్ష

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తుల భద్రతతోబాటు శ్రీవారి ఆలయ రక్షణకు సంబంధించి పూర్తిస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులకు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, ఎల్అండ్‌టి ప్రతినిధుల నిపుణుల బృందం, ఐటి జిఎం శేషారెడ్డి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, వివిఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, సదాలక్ష్మిలతో కలసి సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భద్రతా ప్రణాళికలపై ఎల్అండ్‌టి సంస్థతో ఆయన సాంకేతిక పరిజ్ఞానం,

భద్రత వ్యవస్థను ఆధునీకరించడంపై సమాలోచనలు చేశారు. అత్యాధునిక సాంకేతిక స్కానర్లు, ట్రాఫిక్ కంట్రోల్, ఇంటిగ్రేటెడ్ సర్వైలెన్స్‌సిస్టం, కామన్అలారం మేనేజ్‌మెంట్ విధానం,కమాండ్ కంట్రోల్ వ్యవస్థ వంటి అంశాలను ఇఒకు వివరించారు.

# అన్యమత ఉద్యోగులపై వీడని మౌనం..

## - ఎఇఒ సస్పెన్షన్‌తోనూ స్పందించని టిటిడి!

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూయేతర ఉద్యోగులను గుర్తించిన అధికారులు వారిని ఇతర శాఖలకు బదిలీ చేయడంగానీ స్వచ్ఛంద పదవీవిరమణ చేయించడంలో మౌనమెందుకనే ప్రశ్నలు టిటిడి ఉద్యోగవర్గాల్లో వ్యక్తమవు తున్నాయి. మొన్నటికిమొన్న టిటిడి మార్కెటింగ్ విభాగంలో యాత్రికులు సమర్పించే కొన్ని వస్తువులు వేలంవేసే విభాగంలో ఒక అసిస్టెంట్ కార్యనిర్వహణ అధికారి(ఎఇఒ )రాజశేఖరబాబు అన్యమత ఆచారాలను పాటిస్తున్నారని,ప్రతి ఆదివారం చర్చికి వెళ్ళి ప్రార్థనలు చేస్తున్నారనే ఆధారాలతో అందిన ఫిర్యాదుతో టిటిడి అధికారులు ఆయనపై తక్షణం సస్పెన్షన్ వేటువేశారు. ఇదే ధోరణిని మిగిలిన వారిపై ఎందుకు తీసుకోలేక పోతున్నారనే విమర్శలు ఇప్పుడు టిటిడిలో బలంగా వినిపిస్తున్నాయి. రెండురోజుల క్రిందట టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి కూడా ఆలయం ముందు అన్యమత ఉద్యోగులు వారికివారే స్వచ్ఛందంగా తప్పుకోవాలని,లేకుంటే బయటకు పంపడం జరుగుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా శుక్రవారం ఉదయం కేంద్రసహాయమంత్రి బండిసంజయ్ తిరుమలలో శ్రీవారి దర్శనానంతరం అన్యమత ఉద్యోగులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. టిటిడిలో వెయ్యిమందికిపైగా అన్యమతస్థులు పనిచేస్తున్నారని, దేవుని పేరుతో జీతం తీసుకుంటూ అన్యమత ఉద్యోగులు హిందూ సనాతన ధర్మంపై విశ్వాసం లేదని ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. టిటిడి పాలకమండలి, అధి కారులు ఇప్పటికైనా మేల్కొని హిందూయేతర ఉద్యోగులను అందరినీ తొలగించాలని అల్టిమేటమ్ ఇచ్చారు. టిటిడిలో అన్యమతస్థులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకో వాలన్నారు. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సేవలో నిజమైన భక్తి,విశ్వాసాలు నిబద్ధతతో పనిచేసే వారికి అవకాశం కల్పించాలని కీలక సూచనలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదేగాక మూడునాలుగునెలల ముందే టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో అన్య మతస్థ ఉద్యోగులపై చర్యలు తీసుకుం టామని ,అన్యమత ఉద్యోగులను సాగనంపుతామని ప్రకటించారు. ఇప్పటికీ అలాంటి చర్యలేవీ తీసుకోకపోవడం దేనికి నిదర్శనమని టిటిడి ఉద్యోగవర్గాలు మండిపడుతున్నాయి.టిటిడిలో వేలాదిరూపాయలు దేవుని సొమ్మును జీతం తీసుకుంటూ అన్యమత ఆచారాలను పాటిం చడం, ఏకంగా ఆ దేవుని ప్రార్థనలు చేయడం ఎంతవరకు మంచిదనేది దుమారం రేపుతోంది. టిటిడిలో ప్రస్తుతం 6,700మంది వరకు శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. వారేగాక ఇంకా సొసైటీల క్రింద, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో 12వేలమంది వరకు పనిచేస్తున్నా కొందరు అన్య మతాన్ని ఆచరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరీ శాశ్వత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల్లో మార్పు వస్తుందనేది ఉద్యోగులు చెబుతున్నారు. -300మంది హిందూ ధార్మికసంస్థ టిటిడిలో 300మంది వరకు అన్యమత ఉద్యోగులు ఉన్నారనే విషయాన్ని ఈ ఏడాది జనవరిలోనే టిటిడి పాలకమండలి ,అధికారులు వెల్లడిం చారు. వారిలో వివిధ హోదాల్లో అధికారులుగా చలామణి అవుతూ టిటిడి జీతం తీసుకుంటూ అన్యమతాన్ని బలంగా ఆచరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న 22మందిని తొలి విడతలో గుర్తించారు. వీరిలో 18మందిని ఆలయ వ్యవహారాలకు ,కార్యకలాపాలకు దూరంగా ఉంచి ఇతర విభాగాలకు బదిలీ చేసిన విషయం విదితమే.

# హిందూమతంపై భక్తి, చిత్తశుద్ధి ఉన్న వారికే ఉద్యోగాలు కల్పించాలి

## - తిరుమలలో కేంద్రమంత్రి బండి సంజయ్



**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ సనాతన ధర్మంపై విశ్వాసం లేని, అన్యమత ఉద్యోగులను తక్షణం తొలగించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టిటిడి పాలకమండలి వెంటనే వారందరినీ బయటకు సాగనంపాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఓ ఉద్యోగిని తొలగించడంపై స్పందించిన ఆయన ఒకరిని తొలగిస్తే సరిపోదని, అన్యమత ఉద్యోగులందరినీ గుర్తించి వెంటనే తొలగించాలని టిటిడికి అల్టిమేటమ్ ఇచ్చారు. టిటిడిలో ఉన్న అన్యమతస్థులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.శ్రీవారి సేవలో నిజమైన భక్తి,నిబద్ధతతో పనిచేసే వారికి అవకాశం కల్పించాలని సూచించారు. అన్ని మతాల వారిని ఆదరించడానికి టిటిడి సత్రం కాదని కేంద్రమంత్రి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టిటిడి ఏ ఒక్కరి ఆస్తి కాదని,హిందువులు అందరిదీ అని అన్నారు. సనాతన ధర్మంకోసం అందరూ ఐక్యంగా ఉండాలని ఆయన సూచించారు. తెలుగురాష్ట్రాల్లో ధూపదీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలతోబాటు పురాతన ఆలయాలను టిటిడి అభివృద్ధిచేయాలని ఆయన కోరారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇల్లెందు రామాలయం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, వేములవాడ ఆలయాల అభివృద్ధికి టిటిడి సహకారం అందించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి హోదాలో పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఉదయం ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. పుట్టినరోజున శ్రీవారి దర్శనంతో మనసు సంతోషం వ్యక్తం చేశారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కేంద్రమంత్రి వెంట టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, డిప్యూటీ ఇఒ భాస్కర్ ఉన్నారు.

# వైద్య విద్యార్థినులపై లైంగిక వేధింపులు - ముఖ్యమంత్రి తీవ్ర అసహనం

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** కాకినాడ జీజీహెచ్ లో వైద్య విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేసారు.ఈ ఘటనపై అధికారులను నివేదిక కోరారు. సీఎంకు వైద్యఆరోగ్య శాఖ అధికారులు నివేదిక అందించారు. అనంతరం నిందితులపై కఠిన చర్యలకు సీఎం ఆదేశించారు. మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో ల్యాబ్ అటెండెంట్ గా పనిచేస్తున్న కళ్యాణ్ చక్రవర్తి అనే ఉద్యోగిపై ఈనెల 9వ తేదీ విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. తీసుకున్న అధికారులు దీనిపై అదే రోజు కమిటీని నియమించి విచారణ చేపట్టారు. గురువారం రాత్రి వరకు విద్యార్థినులతో మాట్లాడి విచారణ కమిటీ నివేదిక సిద్ధం చేసింది. కాకినాడ జీజీహెచ్ లో వైద్య విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురిని అధికారులు సస్పెండ్ చేశారు. ల్యాబ్ అటెండెంట్ కళ్యాన్ చక్రవర్తితో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు జిమ్మి రాజు, గోపాల కృష్ణ, ప్రసాద్ లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నలుగురిపై పోలీసు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. అనంతరం జిమ్మీ రాజు, గోపాలకృష్ణ, ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బయో కెమిస్ట్రీ ల్యాబ్ అటెండెంట్ కల్యాణ్‌చక్రవర్తి పరారీలో ఉన్నారు. మొబైల్ స్విచ్ఛాఫ్ చేసి కల్యాణ్‌చక్రవర్తి వెళ్లిపోయారు. కల్యాణ్‌చక్రవర్తి పెట్టుకున్న సెలవును సైతం హెచ్‌వోడీ రద్దు చేశారు. ఘటనపై నివేదిక, తీసుకున్న చర్యలను కాకినాడ జీజీహెచ్ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపారు.నేను ఇక్కడ విధుల్లో జూన్ 23న చేరాను. అప్పటి నుంచి ఈ విషయాలు నా దృష్టికి రాలేదు. జులై 8న కొంతమంది విద్యార్థులు నా వద్దకు వచ్చారు. వారిలో ఇద్దరు ముగ్గురు ల్యాబ్ అటెండెంట్ గా పనిచేస్తున్న కళ్యాణ్ చక్రవర్తి తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఏదైనా చెప్పాలంటే భుజాలపై చేతులు వేసి తట్టి చెప్తున్నారని తెలిపారు. తరువాత రోజు ఉదయం చక్రవర్తిని పిలిపించి హెచ్చరించాను. పద్ధతి మార్చు కోవాలని సూచించాను.

# పల్నాడు భక్తుడి బంగారు ఉంగరం అప్పగింత

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనానికి వచ్చిన పల్నాడుజిల్లా బొల్లాపల్లిమండలం వెల్లటూరుగ్రామం భక్తులు గదిలో వదలిపెట్టిన బంగారు ఉంగరాన్ని టిటిడి సిబ్బంది నిజాయితీతో గుర్తించి అప్పగించారు.పల్నాడుకు చెందిన బి.సుధాకర్ కుటుంబంతో తిరుమలకు వచ్చారు. వకుళమాత విశ్రాంతి గృహంలో నంబర్ 229 గదిని పొందారు. గురువారం సాయంత్రం దర్శనానికి వెళ్ళి వచ్చి గదిని ఖాళీచేసి భక్తులు హడావిడిగా బయటకు వచ్చేశారు. ఆ తరువాత గదిని శుభ్రంచేయడానికి వెళ్లిన సిబ్బంది 5గ్రాముల బంగారు ఉంగరం ఉండటాన్ని గుర్తించి వెంటనే దాన్ని వకుళమాత సూపరింటెండెంట్ శ్రీరామ్ భక్తుల చిరునామాతో ఉన్న నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం తెలిపారు. ఉంగరం వివరాలు తెలుసుకుని అప్పగించారు. దీంతో భక్తులు టిటిడి సిబ్బంది నిజాయితీకి కృతజ్ఞతలు తెలిపారు.

## విజయనగరం భక్తులకు డాలరున్న బంగారు గొలుసు అప్పగింత

**తిరుమల,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనానికి వచ్చిన విజయనగరంకు చెందిన మాలేడా బ్రహ్మం కుటుంబం గురువారం తిరుమలకు వచ్చారు. రాంభగీచా విశ్రాంతి గృహం -1లో 134 గదిని పొందారు. గదిలో దిగిన వాళ్ళు శుక్రవారం ఉదయం స్వామివారి దర్శనానంతరం గదికి చేరుకున్నారు. మధ్యాహ్నం గదిని ఖాళీచేసి భక్తులు వెళ్ళిపోయారు. గదిలో సిబ్బంది గమనించి 4తులాల బంగారు గొలుసు, డాలర్‌ను రాంభగీచా విశ్రాంత గృహం మేనేజర్ కామరాజు, ఆఫీస్ సబార్డినేట్ పిజి సురేశ్‌కు అందించారు. వాళ్ళు భక్తుడి ఫోన్‌చేసి వదలివెళ్ళిన బంగారుగొలుసును తిరిగి భద్రంగా అందజేశారు. టిటిడి సిబ్బంది విలువైన బంగారు గొలుపును భక్తులకు అప్పగించడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఆ స్వామివారే మాకు మంచి చేశారని అన్నారు.

# రెవెన్యూ మాన్యువల్ సిద్ధం చేసిన ప్రభుత్వం

**విజయవాడ జులై 11 ప్రభాతవార్త ప్రతినిధి:** భూ చట్టాలు , పరిపాలన, ప్రభుత్వ ఆదేశాలపై పౌరులకు అవగాహన కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. బ్రిటిష్ హయాం నుంచి ఇటీవల వరకు ప్రభుత్వ పరంగా వెలువడిన ఆదేశాలతో మాన్యువల్‌ను 14 వాల్యూమ్స్‌ను రెవెన్యూ శాఖ తయారుచేసింది. 3706 పేజీలతో తయారైన ఈ పుస్తకాలను సీపీఎల్ఏ వెబ్‌సైట్‌లో ఉంచబోతున్నారు. భూములకు సంబంధించి రాష్ట్రంలో 200 కు పైగా చట్టాలు ఉన్నాయి. వీటి గురించి రెవెన్యూ ఉద్యోగులకే పూర్తిస్థాయిలో అవగాహన లేదు. ఏ సమస్యకు ఏ చట్టం వర్తిస్తుందో అధికారుల్లో కొందరికీ తెలియదు. దీంతో క్షేత్రస్థాయిలో కొత్త సమస్యలు వస్తున్నాయి. కోర్టుల్లో జరిగే విచారణ సమయంలో ఈ వివరాలు అందుబాటులో లేక బాధితులతోపాటు అధకారులూ అవస్థలు పడుతున్నారు. ఇక సామాన్యుల పరిస్థితి మరీ దారుణం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు భూ చట్టాలు, ఉత్తర్వులు, నియామాలను 14 పుస్తకాల రూపంలో సీసీఎల్ఏ సిద్ధం చేసింది. భూ కేటాయింపులు పేదలకు ఎసైన్డ్, ఇంటిస్థలాల పంపిణీ రికార్డ్స్ ఆఫ్ రైట్స్, భూముల పరిరక్షణ , ఆక్రమణల నిరోధం, ఇనాం చుక్కల భూముల ,ఇతర వ్యవహారాల గురించి ఈ మాన్యువల్ సిద్ధమైంది. సీసీఎల్ అదనపు కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిటీ గత జనవరి నుంచి పనిచేయడం ఆరంభించింది. 200 కు పైగా చట్టాలు ఉన్నా 50 చట్టాల కార్యకలాపాలే తరచూ జరుగుతుంటాయి. ఇందుకు అనుగుణంగా వాటి వివరాలను సిద్ధం చేశారు. ఆంధ్రప్రదేశ్ డాటెడ్ ల్యాండ్స్ యాక్ట్ -2017 వచ్చినప్పటి నుంచి హైకోర్టు నుంచి వెలువడిన ఆదేశాల వరకు 53 పేజీల్లో వివరించారు. జిల్లాల విభజన ప్రారంభం నుంచి జులై 23,2024 వరకు వెలువడ్డ చట్టాలు , 84 జీఓలతో 346 పేజీల పుస్తకం తయారైంది. ప్రస్తుతం రెవెన్యూ మాన్యువల్ ఆంగ్లంలో తయారైంది. ఇందులో పౌరులకు నిత్యం అవసరమైన చట్టాలు, ఇతర సమాచారాన్ని తెలుగులోకి తీసుకురావాల్సి ఉంది. ప్రస్తుతం సిద్ధంచేసిన వాల్యూమ్స్‌లోని సమాచారాన్ని ఏఐ సాయంతో చాట్‌బాట్స్ ద్వారా వినే సౌకర్యాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు. భూ పరిపాలనపై తరచూ వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నారు.

pnb Housing Finance Limited Ghar Ki Baat

**అనుబంధం-IV-A - స్థిరాస్తి/లు యొక్క ఇ-వేలం బహిరంగ విక్రయ ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యందు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు ఏర్పాటుతో చదువబడే దాని క్రింద స్థిరాస్తుల యొక్క విక్రయం కొరకు ఇ-వేలం-విక్రయ ప్రకటన

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష్ భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ-110001, ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com

బ్రాంచి కార్యాలయం: జిబి ప్రైమ్ 31-4-363, 1వ అంతస్తు, అరండల్‌పేట్, 4వ లేన్, గుంటూరు-522002.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ప్రత్యేకించి కాలమ్ నెం.A మరియు పేర్కొనబడిన రుణగ్రహీత(లు) మరియు హామీదారు/లు)లకు నోటీసు జారీ చేయునది ఏమనగా సెక్యూరిటీ క్రెడిటార్ వద్ద తనఖా పెట్టబడిన/ఛార్జ్ చేయబడిన కాలమ్ నెం.D మరియు తెలుపబడిన స్థిరాస్తు(ల)ను (కాలమ్ నెం.C యందు పేర్కొనబడిన) వానిని M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటార్, నిర్మాణాత్మకంగా/భౌతికంగా స్వాధీనం చేసికొని ఉన్నారు. మరియు క్రింద పేర్కొన్న వివరాల ప్రకారం "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా ఏది ఏలా ఉన్నవి అక్కడ ఏది ఉందో అది అలా" ప్రాతిపదిక అమ్మివేయబడుతుంది. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యందు ఇట్టి తేదీ నాటికి సవరింపబడిన విధంగా గల రూల్ 8(6) మరియు 9 ప్రకారంగా కాలమ్ నెం.A యందు తెలిపిన విధంగా కేసును బట్టి రుణగ్రహీతలు/తనఖాదారులు (మృతి చెంది ఉన్నట్లయితే) వారి యొక్క రుణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/చట్టబద్ధవారసులు, చట్టబద్ధ ప్రతినిధులు (తెలిసినవారు లేదా తెలియనివారు), ఎగ్జిక్యూటర్లు, పాలనాధికారులు, సక్సెసర్లు, అసైనీలకు నోటీసులు ఇవ్వబడుచున్నవి. మరిన్ని సవివరమైన నియమ నిబంధనల కోసం (వేలానికి సంబంధించిన) M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యందు ఇవ్వబడిన లింకును, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క వెబ్‌సైట్‌ను అనగా www.pnbhousing.com చూడవచ్చును.

| రుణం నెం./రుణగ్రహీత పేరు/ సహ-రుణగ్రహీత/హామీదారు/ చట్టబద్ధ వారసులు (A) | డిమాండ్ మొత్తం & తేది (B) | స్వాధీనత యొక్క స్వభావం (C) | తనఖాపెట్టబడిన ఆస్తుల వివరణ (D) | రిజర్వు ధర (RP) (E) | బయానా (RP యొక్క 10%)(F) | బిడ్ సమర్పణకు చివరి తేది (G) | బిడ్ ఇంక్రిమెంటల్ రేట్ (H) | ఇన్‌స్పెక్షన్ తేది మరియు సమయం (I) | వేలం తేది మరియు సమయం (J) | తెలిసిన అభ్యంతరాలు/ కోర్టుకేసులు ఉన్నట్లయితే (K) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| HOU/GNTR/0322/966058 B సత్యనారాయణ/ B మహాలక్ష్మి & లక్ష్మి శ్రీనివాస ట్రేడర్స్, B.O: గుంటూరు | రూ. 29,15,727.00 12.04.2024 తేదీ నాటికి | భౌతికంగా | 501.0. 4వ అంతస్తు, ఏసుగంటీస్ సిండిరెల్లా, ఏసుగంటీస్ సిండిరెల్లా, D.నం.18/A18/B మరియు 19 LP నం. 4 2016, ఫ్లాట్ నం.11 12 13 అగతవరప్పాడు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522509 | రూ. 21,82,000 | రూ. 2,18,200 | 28.07.2025 | రూ. 10,000 | 18.07.2025 ఉ.10.00 గం. నుండి సా.5.00 గం. | 29.07.2025 మ.02.00 గం. నుండి మ.3.00 గం. | *లేవు / తెలియవు |
| HOU/GNTR/0223/1078328 బిస్వాస్ శంకర్ / బిస్వార్ మినతి B.O: గుంటూరు | రూ. 19,26,176.00 07.02.2024 తేదీ నాటికి | భౌతికంగా | D.నం.73/B, ఫ్లాట్ నం.13, ఇ.నం.6-99/16, అస్సెట్ నం.1133, పెద్దకాకాని, గుంటూరు, ఏసయ్య ఫెల్లోషిప్ ప్రార్థన మందిరం దగ్గర, మెయిన్ రోడ్, కొప్పురావూరు, కొప్పురావూరు గ్రామ పంచాయతీ, పెదకాకాని మండలం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522508 | రూ. 13,34,000 | రూ. 1,33,400 | 28.07.2025 | రూ. 10,000 | 18.07.2025 ఉ.10.00 గం. నుండి సా.5.00 గం. | 29.07.2025 మ.02.00 గం. నుండి మ.3.00 గం. | *లేవు / తెలియవు |
| HOU/GNTR/0921/913744 తంబుల్లూరి జ్యోతి/తంబులూరి కొటేశ్వరరావు/ జ్యోతి పాత ఐరన్ స్క్రాప్ ట్రేడర్స్, B.O: గుంటూరు | రూ. 37,93,127.00 23.03.2024 తేదీ నాటికి | భౌతికంగా | DIV నం.443/1A1, ఇ.నం.5-10, అస్సెట్ నం.410, బండారుపల్లి, నల్లపాడు, గుంటూరు, బ్లాక్ నం.05, సచివాలయం రోడ్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522005 | రూ. 23,40,000 | రూ. 2,34,000 | 28.07.2025 | రూ. 10,000 | 18.07.2025 ఉ.10.00 గం. నుండి సా.5.00 గం. | 29.07.2025 మ.02.00 గం. నుండి మ.3.00 గం. | *లేవు / తెలియవు |

* దీనికి తదుపరి వడ్డీ, @ 18% P.A. వర్తించే తగు వ్యయములు, ఇన్సిడెంటల్ ఖర్చులు, ధర, ఛార్జీలు మొ॥నవి చెల్లింపు తేదీ వరకు మరియు/లేదా రియలైజేషన్ వరకు అయినవి. **PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి యొక్క ఎరుక మరియు సమాచారం మేరకు పైన తెలుపబడిన స్థిరాస్తి పై కాలమ్ నెం.K యందు తెలుపబడినవి తప్పించి మరెటువంటి ఇతర అభ్యంతరములు/క్లెయిమ్‌లు గానీ లేవు. తదుపరి అట్టి అభ్యంతరములు ఉన్నచో, అట్టి వానిని సఫలీకృతుడైన కొనుగోలుదారు/బిడ్డరు చెల్లించవలసి ఉంటుంది. ఆసక్తి గల కొనుగోలుదారు/బిడ్డర్లు తెలుపబడిన విధంగా ఏవైనా అభ్యంతరములు ఉన్నచో అట్టి వాని నిజాలను తామే స్వయంగా తెలుసుకోవలసి ఉంటుంది.

1) పైన తెలుపబడిన స్థిరాస్తులు/సెక్యూర్డ్ ఆస్తులపై ఈ తేదీ వరకు PNBHFL/PNBHFL యొక్క అధీకృత అధికారి సదరు ఆస్తి విక్రయించేందుకు, కేటాయించేందుకు, మరియు/లేదా అమ్మివేయుటకు ఎటువంటి ఆటంకపరిచే ఆర్డరుగానీ, మరియు కోర్టువారి ఇంజెక్షన్ గానీ లేదు. 2) కాలమ్ నెం.కెలో తెలిపిన విధంగా ఆసక్తి గల కొనుగోలుదారు/బిడ్డరు మరియు ఆసక్తిగల పార్టీలు స్వతంత్రంగా ఏవేని అభ్యర్థనలు వగైరాలు ఉన్నచో వానిని సర్వేక్షించుకొనగలరు. కానీ టైటిల్ యొక్క డాక్యుమెంట్ల పరిమితిలో కాదు ఇందుకు సంబంధించిన టైటిల్ PNBHFL కార్యాలయం యందు బిడ్డింగ్‌లో పాల్గొనే ముందు టెండరు/బిడ్ దరఖాస్తునకు ముందు లేదా ఆఫర్లు ఇచ్చేమునుపు అన్ని విధాలుగా పరిశీలించి సంతృప్తి చెందేందుకుగాను లభ్యంగా గలదు. బిడ్డర్లు బిడ్ ఫారముతోపాటుగా ఈ వేలానికి సంబంధించిన అన్ని నియమ నిబంధనలపై సంతకం చేయవలసి ఉంటుంది. 3) సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యందలి రూల్ 9(3) నిబంధనలను అనుసరించి, బిడ్డర్లు/కొనుగోలుదారు అమ్మకపు మొత్తం (బయానా ధరావత్తును ఒకవేళ డిపాజిట్ చేసినట్లయితే దానితోసహా) అమ్మకపు విలువలో 25% మొత్తాన్ని చట్టబద్ధంగా జమ చేయవలసి ఉంటుంది. అట్టి దానిని అదే రోజున లేదా తదుపరి పని దినాన జమ చేయవలెను. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నిబంధన 9(2) ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా నిర్ణయించిన విధంగా అమ్మకపు విలువలో 25% మొత్తాన్ని జమచేసిన మీదట మాత్రమే సేల్ బిడ్డరు(లు) యొక్క పేరిట నిర్ధారించబడుతుంది. విక్రయ పరిగణన మొత్తం యొక్క మిగతా 75% మొత్తం కొనుగోలుదారునిచే విక్రయ నిర్ధారణ పత్రం యొక్క ఎక్నాలెడ్జ్‌మెంట్ తేదీ నుండి 15 రోజులలోగా జమ చేయవలసి ఉంటుంది. విఫలమైతే ఆస్తి/సెక్యూర్డ్ చేయబడిన ఆస్తి సర్ఫేసీ చట్టం యొక్క ఏర్పాట్లు ప్రకారం పునర్ విక్రయించబడుతుంది. 4) ఇట్టి ఇ-వేలం ద్వారా అమ్మకం విషయంలో తన కార్పొరేట్ కార్యాలయం ప్లాట్ నం.68, 3వ అంతస్తు, సెక్టార్-44, గుర్‌గావ్, హర్యానా 122003 యందు గల M/s. C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధీకృత అధికారికి సహాయం చేస్తోంది. వెబ్‌సైట్ www.bankeauction.com ఆస్తి యొక్క పరిశీలనకు సంబంధించి ఎటువంటి సహాయం కోసమైనా లేదా బిడ్ డాక్యుమెంట్లను పొందేందుకైనా మరియు ఏదేని ఇతర సందేహ నివృత్తి లేదా రిజిస్ట్రేషన్ కొరకైనా, PNBHFL యొక్క అధీకృత అధికారి అయిన Mr. మాధవ్/వల్లూర్ ఉదయ్ భాస్కర్ / విజయ్ సుంద్రియాల్, మొబైల్: 9948562888/9703801419/7428193765, ఇ-మెయిల్: auction@pnbhousing.com లేదా www.pnbhousing.com సంప్రదించగలరు.

ప్రదేశము: గుంటూరు, తేది: 12.07.2025

సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

మన ప్రవర్తనలో ముందుగా మార్పువస్తే, సహజంగానే ప్రపంచంలోనూ మార్పు వస్తుంది.

-షేక్స్పియర్

# ఔచిత్య పరీక్ష!

బీహారు వంటి బీమారు రాష్ట్రాలకు సమయోచిత వాగ్దానాలు చేయాలంటే ఏలినవారికి ఎన్నికలప్పుడే దయ కలుగుతుందని కొన్ని కొన్ని సందర్భాలు ఎరుకపరుస్తున్నాయి. బీహారులో ఇరవై ఏళ్ల తర్వాత తాజాగా ఉన్నట్టుండి నవంబరు నెలలో అసెంబ్లీ ఎన్నికలు రానున్న తరుణంలో విస్తృత ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్నారంటే ఎన్నో రాజకీయ పార్టీలు, ఎన్నో వర్గాలు సందేహం వ్యక్తం చేశాయి. అనుమానాలు కలుగుతున్నాయి. కాగా ఈ వ్యవహారం యధావిధిగా రాజకీయ పార్టీల వారు సుప్రీంకోర్టుకు తీసుకెళ్లగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టేందుకు ఎన్నికల సంఘానికి రాజ్యాంగ బద్ధ అధికారులున్నాయని తీర్పు చెప్పింది. కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవన్నీ రాజకీయ పక్షాల అభ్యంతరాల్లో ఉన్నవే. ఎక్కడ ఎలాంటి పేచీ వచ్చినాకానీ మూడో పక్షంగా న్యాయస్థానాలే న్యాయం చేస్తాయని నమ్మే దేశం మనది. రాజ్యాంగ అంశాల్లో మీమాంసలు కలిగినప్పుడు ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పులు, పరిష్కారాలే శిరోధార్యం. ప్రత్యేక సవరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టే విషయంలో ఎన్నికల సంఘం దోషమేమీలేదని, అందుకే ఈ అంశంపై నిలుపుదల ఉత్తర్వుల (స్టే)ఇవ్వలేమని తీర్మానించింది. మరికొన్ని కీలక సూచనలూ ఇచ్చింది. ఓటరును నిర్ధారించే పత్రాలు సమగ్రంగా లేవనీ, ఆధార, రేషన్, ఓటరు గుర్తింపు కార్డులను సైతం పరిశీలనలోకి తీసుకురావాలని సూచించింది. కాగా ఓటరు జాబితాల సమగ్ర సవరణ అధికారం ఎన్నికల సంఘానికి ఉన్నప్పటికీ అందుకోసం ఎంచుకున్న సమయం సరైనదికాదని, సరిగ్గా ఎన్నికల తరుణంలో ఈ ప్రక్రియ చేపట్టడం సమర్థించలేమని జస్టిస్ సుధాంశుధూలియా, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ ధర్మాసనం అభిప్రాయపడింది. త్వరలో ఎన్నిలకు జరగనున్న తరుణంలో ఎన్నికల సంఘం 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' అని ప్రకటించగానే విపక్ష రాజకీయ పార్టీలన్నీ ఉలిక్కిపడ్డాయి. ఈ ప్రక్రియ ద్వారా దాదాపురెండు కోట్ల మందికిపైగా కీలక ప్రాంతాల్లో ఓటర్లను తొలగించేందుకేననే అపోహపడేందుకు ఆస్కారమిచ్చింది. ఆధార్ వంటి కార్డుల సంగతి పక్కనపెట్టి ఏవేవో 11 పత్రాలను పేర్కొని వాటి ద్వారా ఇంటెన్సివ్ జాబితాను తయారు చేయాలని చూడడంలో ఔచిత్యం లేదని భావించే పరిస్థితి తయారైంది. బీహారు ప్రజలంటేనే వలస జీవులు, పనిపాటలకు, శ్రమజీవనానికి, ఉపాధి కోసం దేశాంతరాలు విడిచి వెళ్లడం పరిపాటి. దేశం యావత్తు ఏ రాష్ట్రానికి వెళ్లినా, ప్రాంతానికి వెళ్లినా భవన నిర్మాణ రంగంలో బీహారు కార్మికులు కోకొల్లలుగా కనిపిస్తుంటారు. అలా వచ్చిపోయే వాళ్ల పేర్లు తొలగింపుతోపాటు కొత్తగా ఓటు హక్కు కలిగిన యువత పేర్లను చేర్చుకొని ఓటరు జాబితాలో కలుపుకోవచ్చని ఎన్నికల సంఘం నిర్దేశించింది. విదేశీ చట్ట విరుద్ధ వలసదారుల పేర్లను తొలగించడానికే ఈ 'ఇంటెన్సివ్' జాబితా సవరణ అవసరమైందని ఎన్నికల సంఘం పేర్కొనడాన్ని బట్టి రాజకీయ పక్షాల నుంచి అభ్యంతరం వెలువడింది. సమర్పించాల్సినపత్రాల జాబితా, సమయం తగినంత లేకపోవడంతో ఇ.సి ప్రతిపాదన ఆక్షేపణకు గురైంది. ఇదంతా ఓటర్లను తొలగించే ఎత్తుగడలాగే అనిపిస్తోంది. ఇదే మాట సర్వజనులదీ. ఎందుకంటే ఓటరు జాబితాలో చేర్పుకోసం సమర్పించాల్సిన పత్రాల్లో తల్లి, తండ్రి జనన తేదీలు, వారు పుట్టిన ప్రదేశాలు, అక్కడ నివాసం ఉన్నారన్న రుజువులు సమర్పించాలి. ఇలాంటి పత్రాల జారీ, సమర్పణ ఎంతో కష్టతరం. గతంలో బీహార్‌లో ఉండి వలసవెళ్లి ఉంటే అప్పట్లో బీహార్‌లోనే ఉన్నట్లు అదనపు ధృవీకరణ పత్రాలను సమర్పించాలని షరతు పెట్టింది. వలస కార్మికులకు ఇటువంటివి తీసుకురావడం జరిగే పనికాదు. ఏ రాష్ట్రంలోనూ ఇన్ని రకాల సంక్లిష్ట సమాచారాన్ని అడిగి ఉండరు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం కేవలం భారతీయుడై ఉంటే చాలు ఈ దేశంలో ఓటరుగా నమోదవుతారు. అంతెందుకు ఎవరి పుణ్యమోకానీ, వైఫల్యమోకానీ చాలా మంది ఓటర్లకు రెండు, మూడు పట్టణాల్లోనూ, రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల్లోనూ ఓటింగ్ హక్కు ఉన్నా అంశాలు మనకు తెలిసినవే. ఇన్ని అభ్యంతరాల మధ్య ఎన్నికలసంఘం తీసుకున్న యూటర్న్‌లను బట్టి ముందుగా సరైన యోచన చేయకుండా ప్రజలకు ఓటరు కార్డుల పేరిట వారి పౌరసత్వాన్ని అనుమానించే ప్రయత్నాలను ఆపేయాలని విపక్ష పార్టీలు సూచించాయి. ఇసి నిర్ణయం మంచిదే, కానీ సరైన తరుణం కాదు. సరైన ఆధారిత పత్రాల విషయమై రూపొందించిన జాబితా వివాదాస్పదమైందని సుప్రీంకోర్టు గమనించింది. ఎన్నికలకు ముందు ఇలాంటి సవరణల కార్యక్రమం దేనికని ధర్మాసనం ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించింది. పైగా పౌరసత్వాన్ని ధృవీకరించే అధికారం కేంద్ర హోమ్ శాకే తప్ప ఎన్నికల సంఘానికి లేదని జస్టిస్ సుధాంశుధూలియా తప్పుపట్టారు. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరిట ఒక వర్గానికి చెందిన ఓట్లను తొలగించేందుకే ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా ఆరోపిస్తూనే మరికొన్ని అనుమానాలు వ్యక్తం చేశారు. బీహార్‌లో మాదిరిగానే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో కూడా ఇదేతంతు జరిగే అవకాశం లేకపోదని, ఇదంతా బిజెపి పన్నాగమేనంటూ ఆందోళన వెలిబుచ్చారు. కాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఎన్నికల కమిషన్ ఇకపై ఇలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకుని ప్రజాస్వామ్యానికి తలవంపులు తీసుకురాబోదని అనుకోవచ్చు.

పైపై ఆకారాలు చూసి మంచి చెడ్డలు నిర్ణయించకండి. అలా చేసేవారు కేవలం సంకుచిత స్వభావులు.



ఆస్కార్‌వైల్డ్

బంగారం నాణ్యత అగ్నిలో తెలుస్తుంది. మనిషి మంచితనం కష్టంలో తెలుస్తుంది.



జార్జి ఇలియట్

# రాజకీయ అవినీతే అసలు సమస్య!

**ప్రైవేట్ ఏజెంట్లను నియమించుకొని కొన్ని ప్రాంతాల్లో వసూళ్లు చేసుకొంటుంటే మరికొన్ని చెక్‌పోస్టుల వద్ద దేవుని సన్నిధిలో 'హుండీ' పెట్టినట్లు ఏకంగా ఒక బాక్సు పెట్టి అందులో లారీ డ్రైవర్లు నేరుగా డబ్బులు వేసే ఏర్పాట్లు చేసిన వైనం ఏసిబి దాడుల్లో బయట పడింది. ఈ అవినీతి బాగోతం కేవలం కింది స్థాయిలో ఉద్యోగుల పరిధిలో జరుగుతుంటే నమ్మశక్యం కాదు. ఆ ఒక్క శాఖే కాదు, రెవెన్యూ, ఎక్సైజ్, నీటిపారుదల తదితర శాఖల్లో అవినీతి తాండవిస్తున్నదనేది ఏసిబికి పట్టుబడుతున్న అధికారుల వద్ద దొరుకుతున్న వందల కోట్ల రూపాయలు చెప్పకనే చెబుతున్నాయి. ఏదిఏమైనా అవినీతి శృతిమించిపోతున్నది. ఉన్నత స్థాయిలో ప్రధానంగా రాజకీయ అవినీతిని అరికట్టకుండా దేశం నుండి దాన్ని పారద్రోలడం అంతసులభం కాదు.**

దామెర్ల సాయిబాబ

ధర్మాధర్మాలు తెలియవని కాదు, మొదటిది ఒంట బట్టడం లేదు, రెండోది వదిలిపెట్టడం లేదు అన్నట్లుగా ఉంది అవినీతి విషయంలో కొందరు పెద్దలు వ్యవహరిస్తున్న తీరు. ఏ కోణంలో చూసినా అవినీతికి పాల్పడడం ధర్మంకాదని అందరికి తెలిసిందే. పైగా అది చట్టప్రకారం నేరం కూడా. కానీ దేశంలో అవినీతికి పాల్పడేవారి సంఖ్య కోట్లల్లో ఉన్నది. అవినీతి నిర్మూలనకు దశాబ్దాల తరబడి ప్రయత్నం జరుగుతున్నా ఏమాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా ఉన్నతస్థాయిలో జరుగుతున్న అవినీతికి అడ్డు లేకుండాపోతున్నది. ఆ స్థాయిలో అరికట్టేందుకు గతంలో కొన్ని ప్రయత్నాలు జరిగినా నిలువరించలేకపోతున్నారు. కిందిస్థాయిలో అవినీతిని అరికట్టేముందు ఉన్నతస్థాయిలో ముఖ్యంగా రాజకీయ అవినీతిని నియంత్రించే ప్రయత్నం చేస్తే బాగుంటుందనే అభిప్రాయంతో ఒక వ్యూహం ప్రకారం ఏకంగా లంచం ఇచ్చి ఒక మంత్రినే ఇంటికి పంపారు. అప్పట్లో అది రాజకీయంగా సంచలనం రేపింది. ఈ డబ్బు సంపాదనలో మంచి, చెడులు ఆలోచించడం లేదు. అందుకే ప్రభుత్వం చేపడుతున్న అనేక పథకాలు క్షేత్రస్థాయిలో పూర్తిగా అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదు. ప్రాజెక్టుల నిర్మాణాలలో వేలాది కోట్లరూపాయలు పక్కదారిపడుతున్నాయి. ప్రభుత్వాలు మారి కొత్త ప్రభుత్వాలు వచ్చినప్పుడు అంతకు ముందున్న ప్రభుత్వాల్లో కీలక బాధ్యతలు వహించినవారిపై విచారణలు చేయించడం సర్వసాధారమైపోయింది. వాటిల్లో కూడా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి తిరుగులేని రుజువులతో న్యాయస్థానాల ముందు దోషులుగా నిలబెట్ట లేకపోతున్నారు. నిరుపేదలకు ఇచ్చే ఇళ్ల కేటాయింపుల్లో కానీ, రేషన్ కార్డుల్లో కానీ, వృద్ధాప్యపింఛన్లు, సంక్షేమ కార్యక్రమాలు ఏమి తీసుకున్నా దేశవ్యాప్తంగా దళారులు ఈ అవినీతి అధికారులు చేయి కలిపి ప్రజాసొమ్మును ఎలా భోంచేస్తున్నారో తెలియని విషయాలు ఏమీ కాదు. ప్రాజెక్టుల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, ఏకంగాపర్సెంటేజీలు నిర్ణయించి తీసుకుంటున్న విషయం బహిరంగ రహస్యమే. అవినీతిని అడ్డుకొని ప్రజాధనాన్ని కాపాడేందుకు ఏనాటి నుంచో ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. రాష్ట్రాల స్థాయిలో అవినీతి నిరోధక శాఖ, కేంద్ర స్థాయిలో సిబిఐతోపాటు ఈడి, నిఘా విభాగాలు మరెన్నో పనిచేస్తున్నాయి. ఎన్నో చట్టాలు చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తూనే ఉన్నారు. వేలాది మంది అధికారులను వల పన్ని పట్టుకున్నారు. మరెందరినో ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టినందుకు కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైళ్లకు పంపారు, పంపుతున్నారు. ఎంత మందిపై చర్యలు తీసుకున్నా అవినీతిని నియంత్రించలేకపోతున్నారు. అధికారుల్లో ఉన్న అవినీతి ఒక ఎత్తైతే కీలక పదవులు నిర్వహిస్తున్న కొందరు పెద్దలు, ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న మరికొందరు రాజకీయ నాయకులు, దళారుల వల్లనే పరిస్థితి అదుపు తప్పుతున్నదేమోననిపిస్తున్నది. వారి రాజకీయ అధికారం ధాటికి నిజాయితీ, సమర్థులైన అధికారులు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అవినీతి మూలంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్ని లక్షల కోట్లు భారత్ కోల్పోయిందో అంచనాలకే అందదు. అవినీతికి ఆరోప్రాణమైన కొందరు నేతలే చట్టానికి చుట్టాలై చక్రం తిప్పుతున్న సంఘటనలు గతంలో ఎన్నో బయట పడ్డాయి. పశ్చిమబెంగాల్ మాజీ మంత్రి ఒకరు ఉపాధ్యాయ నియామకాల కుంభకోణంలో కోట్లరూపాయలను దిగమింగి తన ఆప్తమిత్రురాలి ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా దాచి

## ఒక్క మాట

పెట్టిన వైనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రట్టు చేసింది. కర్ణాటకలో బాధ్యత కలిగిన మంత్రే తన చావుకి కారణమని రాసి ఆ మధ్య ఒక యువ గుత్తేదారు ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో తప్పని పరిస్థితుల్లో ఆ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చింది. సబ్బుల తయారీకి అవసరమైన ముడి సరుకుల టెండర్ ఆమోదముద్ర పొందడానికి లంచం ముట్టచెప్పాల్సిందేనని గుత్తేదారుకు ఆ ప్రాంత శాసనసభ్యుడు తన కుమారుడికి అప్పగించడంతో ఏకంగా నలభై లక్షల రూపాయలు తీసుకుంటూ లోకాయుక్త పోలీసుల ఉచ్చులో చిక్కుకున్నాడు. ఆ శాసనసభ్యుని ఇంట్లో జరిపిన సోదాల్లో ఎనిమిది కోట్ల రూపాయలకుపైగా అధికారులు పట్టుకున్నారు. అంతే కాదు సాక్షాత్తు ఒక హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల నోట్లకట్టలు బయటపడ్డాయి. రాజ్యాంగం కల్పించిన రక్షణ వల్ల ఆయనపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేని పరిస్థితి. దీంతో ఆ డబ్బు ఎక్కడ నుండి వచ్చింది? ఎవరు, ఎందుకోసం ఇచ్చారు! తదితర ప్రశ్నలకు జవాబు దొరకదు. మొన్న ఒడిశాలో సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఒక ఐఎఎస్ అధికారి పదిలక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆయన ఇంట్లో సోదాలు చేస్తే నలభై లక్షలకుపైగా నగదు అధికారులు కనుగొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎంతో మంది ఉన్నతాధికారులపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసి చర్యలకు సిద్ధమైనా అనుమతిలేక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషనర్ రాంచంద్రసమాల్ బయటపెట్టిన విషయాలు అద్దంపడుతున్నాయి. ఇవేకాదు కొందరు సీనియర్ రాజకీయ నాయకులు కూడా ఈ అవినీతిలో మునిగి తేలుతున్నారు. ఉన్నత స్థాయిలోజరుగుతున్న అవినీతిలో పట్టుబడుతున్నది ఒక శాతం కూడా ఉండకపోవచ్చు. హర్యానా ముఖ్యమంత్రి ఓంప్రకాశ్ చౌతాలా కాలంలో ఉపాధ్యాయులనియామకంలో మెరిట్ లిస్టును మార్చి నకిలీ పత్రాలను సృష్టించి వాటి స్థానంలో మూడువేల మందికిపైగా టీచర్లను నియమించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో న్యాయప్రక్రియకు దాదాపు పదమూడేళ్లకుపైగా సమయం పట్టింది. 2013 జనవరిలో న్యాయస్థానం చౌతాలకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అప్పటికి ఆయనకు 78యేళ్లు వచ్చాయి. జైలులో ఎనిమిదేళ్లు శిక్ష అనుభవించి 2021లో విడుదలయ్యారు. అలాగే తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పద్దెనిమిదేళ్ల విచారణ తర్వాత దిగువ న్యాయస్థానం నాలుగేళ్ల జైలుశిక్ష, భారీగా జరిమానా విధించింది. 2015లో కర్ణాటక హైకోర్టు జయలలితను నిర్దోషిగా విడుదల చేసింది. నిర్దోషిగా విడుదల కావడంపై సుప్రీంకోర్టులో వాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టులో తీర్పు ఇవ్వడానికి ముందే జయలలిత మృతి చెందారు. దేశంలో తీవ్ర చర్చనీయాంశమైన దాణా కుంభకోణంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్‌పై 1996 నుంచి 2018 వరకు న్యాయస్థానాల్లో విచారణలు జరిగాయి. 2013లో ఐదేళ్ల శిక్షపడిన తొలి తీర్పు వచ్చే సమయానికి ఆయనకు 65యేళ్లు. ఆయన జైలులో గడిపింది మూడున్నరేళ్లే. అక్రమ మైనింగ్ ఒప్పందాలపై ఏళ్లపాటు సాగిన విచారణలో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడకు 2017లో మూడేళ్ల జైలు శిక్షపడింది. శిక్షలు పడుతున్నది అతికొద్ది శాతమే. ముంబాయిలోని బార్లు, పబ్‌ల నుండి తనకు నెలకు వంద కోట్ల రూపాయలు వసూలు చేసి ఇవ్వాలని హోంమంత్రి ఒకరు అప్పట్లో పోలీసులకు లక్ష్యం నిర్దేశించారని ఆ నగర మాజీ పోలీసు కమిషనర్ పరమ్‌వీర్‌సింగ్ స్వయంగా వెల్లడించారు. ఇక మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని పట్టుకోవడం కష్టమైనా వాటిని వలపన్ని పట్టుకుంటున్నారు. కనుక బాహాటంగా నిర్లజ్జగా జరుగుతున్న అవినీతిని పసికట్టకపోవడమనే ప్రశ్న ఉదయించదు. గతవారంలో తెలంగాణ రాష్ట్రంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఏసిబి అధికారులు జరిపిన ఆకస్మిక దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రైవేట్ ఏజెంట్లను నియమించుకొని కొన్ని ప్రాంతాల్లో వసూళ్లు చేసుకొంటుంటే మరికొన్ని చెక్‌పోస్టుల వద్ద దేవుని సన్నిధిలో 'హుండీ' పెట్టినట్లు ఏకంగా ఒక బాక్సు పెట్టి అందులో లారీ డ్రైవర్లు నేరుగా డబ్బులు వేసే ఏర్పాట్లు చేసిన వైనం ఏసిబి దాడుల్లో బయట పడింది. ఈ అవినీతి భాగోతం కేవలం కింది స్థాయిలో ఉద్యోగుల పరిధిలో జరుగుతుంటే నమ్మశక్యం కాదు. ఆ ఒక్క శాఖే కాదు, రెవెన్యూ, ఎక్సైజ్, నీటిపారుదల తదితర శాఖల్లో అవినీతి తాండవిస్తున్నదనేది ఏసిబికి పట్టుబడుతున్న అధికారుల వద్ద దొరుకుతున్న వందల కోట్ల రూపాయలు చెప్పకనే చెబుతున్నాయి. ఏదిఏమైనా అవినీతి శృతిమించిపోతున్నది. ఉన్నత స్థాయిలో ప్రధానంగా రాజకీయ అవినీతిని అరికట్టకుండా దేశం నుండి దాన్ని పారద్రోలడం అంతసులభం కాదు. •

# నైపుణ్యాల మెరుగుదలకు విద్యే ప్రధానం

తరిగోపుల నారాయణస్వామి

విద్య మన సమాజ అభివృద్ధికి నాంది పలుకుతుంది. మన దేశ భవిష్యత్తు నిర్మాణానికి విద్యావ్యవస్థ కీలకమైన పాత్ర పోషిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యారంగంలో గత దశాబ్దంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే ఈ మార్పులు సమగ్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయా? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కొత్త విద్యావిధానం (2020) అమలు పరంపరలో రాష్ట్రం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నా, వాటి అమలులో స్పష్టత కొరవడినట్టు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆంగ్ల మాధ్యమ పాఠశాలల స్థాపన, పదవ తరగతి వరకూ ఆంగ్ల మాధ్యమం తప్పనిసరి చేయడం వంటి చర్యలు నగరాల్లో ఉపయుక్తంగా కనిపించినా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం అవి విద్యా నాణ్యతపై ప్రభావం చూపుతున్నాయి. విద్యార్థులపై డిజిటల్ ఆధారిత బోధన పెరుగుతోంది. కానీ ఇంకా చాలా మందికి ఇంటర్నెట్ సౌకర్యం, ట్యాబ్లెట్‌లు, స్మార్ట్‌ఫోన్లు లభించకపోవడం వల్ల నూతన విధానాలు పూర్తిగా ఫలప్రదంగా మారలేకపోతున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో పురోగతి కనిపించినా, అధ్యాపకుల పోస్టుల భర్తీ విషయంలో మాత్రం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉన్నది. గ్రామీణ పాఠశాలల్లో బోధనా భాష, బోధనా నైపుణ్యాలు, పాఠశాలలో ఉపాధ్యాయుల లభ్యత వంటి అంశాలు ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి. ఒకవైపు విద్యా ప్రమాణాలు పెరిగినట్టుగా సూచనలు ఉన్నా, పరీక్షల ప్రాతిపదికన మాత్రమే విద్యను అంచనా వేయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, అభినవ ఆలోచనలు, అభ్యాస నైపుణ్యాలు వెనుకబడుతున్నాయి. ఇటీవల ప్రారంభించిన మానవ వనరుల అభివృద్ధి స్కూళ్లు, నాడునేడు కార్యక్రమం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర వంటి పథకాలు వంటి చర్యలు విద్యా రంగాన్ని పునర్నిర్మించడానికి వేసిన అడుగులు. అయినా, ఈ కార్యక్రమాల సమర్థవంతత ఉపాధ్యాయుల శిక్షణ, మానవ వనరుల అందుబాటుపై ఆధారపడి ఉంటుంది. విద్యార్థుల మధ్య పఠన ఆసక్తి తగ్గిపోవడం, పుస్తక రహిత విద్యావిధానం ఎక్కువగా విస్తరించడంవల్ల విద్యార్థుల నైపుణ్యం స్థిరంగా ఉండడం లేదు. ముఖ్యంగా గత కొద్ది సంవత్సరాలలో విద్యా ప్రైవేటీకరణ ఎక్కువవడంతో సామాన్య కుటుంబాలకు విద్య ఖర్చుగా మారింది. ఉన్నత విద్యా సంస్థలలో ఉపాధ్యాయుల రేషియో తగ్గిపోవడం, విజ్ఞాన కేంద్రాల కొరత, రిసెర్చ్ నిధుల లోపం వంటి అంశాలు కనిపిస్తున్నాయి. విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించే వోకేషనల్ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్స్, స్టార్టప్ ప్రోత్సాహం వంటి అంశాలపై మరింత దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. పాఠశాల స్థాయిలో పరీక్షల అట్టహాసం, గ్రేడులపైనే ఆధారపడే తీరు, విద్యార్థులపై ఒత్తిడి పెంచుతోంది. మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టేవిధంగా సైకాలజికల్ కౌన్సిలింగ్, లైఫ్ స్కిల్స్ బోధనను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. మరోవైపు, విద్యారంగంలో సాంకేతికత వినియోగం, ఎడుటెక్ సంస్థలద్వారా విద్య అందుబాటులోకి రావడం, గణాంకాల ఆధారంగా విద్యా విధానాలను రూపకల్పన చేయడం వంటి నూతన ప్రయోగాలు సాధించాల్సిన ముందడుగులుగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు వేసినప్పటికీ వాటి అమలు స్థాయిలో నిర్లక్ష్యం, నాణ్యత కంటే ప్రదర్శనకే ప్రాముఖ్యత ఇవ్వడం వల్ల విద్యావ్యవస్థ ఆవశ్యకమైన మార్పులను పొందలేకపోతోంది. విద్యను కేవలం ఉత్తీర్ణత లక్ష్యంగా కాకుండా, జీవిత నైపుణ్యాల అభివృద్ధి సాధించేందుకు ఉపయోగించాలి. •

# ప్రజావాక్కు



### కల్తీ కల్లు మీద ఉక్కు పాదం మోపాలి

**హైదరాబాద్‌లో** కల్తీ కల్లుతాగి ఆరుగురు మృత్యువాత పడడం, అనేకమంది ఆసుపత్రుల పాలుకావడం బాధాకరం. తాటి చెట్లు లేకున్నా కొంత మంది కల్లు కాంపౌండ్ యజమానులు నీళ్లలో క్లోరల్ హైడ్రేడ్ డిజీ ఫామ్ అల్ఫ్రోజోలం కలిపి కల్తీకల్లు విక్రయిస్తూ కోట్లకు పడగలెత్తి అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. చాలా మంది ఈ కల్లుతాగి ఊపిరి తిత్తులు, కిడ్నీ, గుండె నాడీ వ్యవస్థ దెబ్బతిని ప్రాణాలు కోల్పోవుతూ వున్నారు. హైదర్‌నగర్, ఇందిరా నగర్, షంషీ గూడ కల్లు కాంపౌండ్ లలో కల్తీ కల్లు తాగి ఆరుగురు చనిపోవడం అందరినీ కలచివేసింది. హైదరాబాద్ అన్ని జిల్లాల్లో కల్తీ కల్లు డిపోలను మూసివేయాలి. చనిపోయిన వారికిఎక్స్‌గ్రేషియాచెల్లించాలి. మృతుల కుటుంబాలని అన్ని విధాల ఆదుకోవాలి. కల్తీ కల్లు విక్రయదారుల మీద ఉక్కు పాదం మోపాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### రాజకీయ వైవిధ్యం

**బీహార్** అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషనుకు కల పడింది ఎన్నికల లిస్ట్ సవరణ చేపట్టాలి అని. మరి ఈ కొత్త ఆలోచన భారత దేశపు వైవిధ్యాన్ని రాజకీయా వైవిధ్యాన్ని దెబ్బ కొట్టదుగా. ఒకవేళ ఈ నిర్ణయం అమలు అయితే భారత దేశంలో నష్టపోయేది దళితులు, ముస్లిం, ఆదివాసులనే పరిస్థితిఉన్నది అంతకంటే ముఖ్యంగా ప్రజలు ఈ దేశ పౌరులు అని నిరూపించుకోవాల్సిన దుస్థితిలోకి నెట్టబడుతారు. అదే ఇప్పటి విడ్డురం మరి. ముఖ్యంగా ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టాల్సిన సందర్భం. ఇప్పుడు ఎందుకు వచ్చింది అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ నిర్ణయం వల్ల దేశ పౌరుల ఆయుధం ఆయిన ఓటును తొలగిస్తే దేశ ప్రజాస్వామిక దృక్పథాన్ని కాలరాసినట్టే.

-భారత అవినాష్, జనగామ

### బాధ్యతలు చేపట్టాలి

**తెలంగాణ** రాష్ట్రంలోని ఎస్సీఎస్టీ బీసీ మైనారిటీ గురుకులలోని హైస్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలో ప్రతి విద్యాసంస్థలలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లకు వేరు వేరు చేసి నియామకాలు చేయాలి. ఈ విధానం వలన పని విభజన జరుగుతుంది. ఎప్పటి కప్పుడు పనులు పూర్తి అవుతాయి.

-రాపాక రవీందర్, జనగాం

### పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం

**భారతదేశంలో** మత్తు పదార్థాల వినియోగం ప్రమాదకరంగా పెరుగుతోంది. పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా డ్రగ్స్ సులభంగా లభించడం, యువత వాటి వలలో చిక్కుకోవడం గమనార్హం. కుటుంబవ్యవస్థల బలహీనత, మానసిక ఒత్తిడులు, మిత్రుల ప్రభావంవంటి కారణాలు యువతను మత్తు పదార్థాల వైపు నడిపిస్తున్నాయి. అలాగే, భారత్ రెండు ప్రధాన మత్తు పదార్థాల ఉత్పత్తి ప్రాంతాల మధ్య ఉండటం వల్ల అక్రమంగా డ్రగ్స్ ప్రవేశించే అవకాశాలు పెరిగాయి. మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యపరంగా తీవ్ర సమస్యలకు దారితీస్తోంది. హృదయ సంబంధ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, కేన్సర్, మానసిక రుగ్మతలు, ఎయిడ్స్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయి. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి, యువత విద్యా ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కాలమే తీర్పు చెప్పాలి

**తెలంగాణా** రాష్ట్రానికి కొత్త అధ్యక్షునిగా ఎవరిని నియమించాలని అనేక తర్జన భర్జనలు చేసిన తదుపరి మాజీ ఎం.ఎల్.సి. ఎప్పటి నుండో రాష్ట్ర స్వయంసేవక్‌లో సేవలందించి, న్యాయవాది వృత్తి చేసిన అకుంఠిత దీక్షా దక్షతలు కలిగిన ఎన్. రాంచందర్ రావును ఏ పోటీ లేకుండా ఎన్నుకోవడం బిజెపి పార్టీ క్రమశిక్షణకు ప్రత్యక్ష నిదర్శనం. ఈయన బాధ్యతలు చేపట్టిన వెంటనే కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం పైనా బీఆర్ఎస్ పార్టీపైన ఆరోపణలు చేస్తూ విరుచుకుపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి అప్పుడే సమస్యలను ఎత్తి చూపుతూ ఒక బహిరంగ లేఖను రాయడం కూడా జరిగింది. రాబోయే 2029 ఎన్నికలలో తమ పార్టీకి వంద అసెంబ్లీ సీట్లు పదిహేను ఎం.పి. సీట్లు వస్తాయని చెప్పి వార్తల కెక్కారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పిల్లలపై డిజిటల్ దుష్ప్రభావం

**ఇప్పటి** డిజిటల్ యుగంలో మొబైల్స్, ట్యాబ్‌లు, టీవీలు వంటి గ్యాడ్జెట్ల వాడకం పిల్లల జీవితంలో భాగమైపోయింది. అయితే దీనివల్ల వారి ఆరోగ్యంపై, చదువుపై, ప్రవర్తనపై అనేక దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయి. ఎక్కువ సమయం స్క్రీన్ ముందు గడపడం ద్వారా కంటిచూపు సమస్యలు, శారీరక జడత్వం పెరుగుతోంది. ఆన్‌లైన్ గేమ్స్, యూట్యూబ్ వీడియోలు వంటి వినోదాల వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గుతోంది.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పునరుత్పాదక ఇంధనంతోనే ఆర్థిక స్వావలంబన

డి జె మోహన రావు

పునరుత్పాదక ఇంధనం అంటే ప్రకృతిలో నిరంతరం లభించే, తరగని వనరులైన సూర్యరశ్మి, గాలి, నీరు, జీవపదార్థాల నుంచి ఉత్పత్తి అయ్యే శక్తి. బొగ్గు, పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాల మాదిరిగా కాకుండా, ఇవి వాతావరణంలోకి తక్కువ కాలుష్య వాయువులను విడుదల చేస్తాయి. సౌరశక్తి, పవనశక్తి, జల విద్యుత్, బయోఎనర్జీ ఇవన్నీ పునరుత్పాదక వనరులే. పర్యావరణానికి తక్కువ హాని కలిగించడమే కాకుండా, ఇవి సుస్థిరమైన శక్తి పరిష్కారాలను అందిస్తాయి. భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద విద్యుత్ వినియోగ దేశంగా ఉంది. మన ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతున్నందున, శక్తి అవసరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం మనం ఎక్కువగా బొగ్గు, దిగుమతి చేసుకున్న ముడి చమురుపై ఆధారపడుతున్నాం. మన ముడి చమురులో దాదాపు 85శాతం విదేశాల నుంచే దిగుమతి అవుతుంది. ఇది మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం మోపడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్ ధరల హెచ్చుతగ్గులకు మనల్ని గురిచేస్తుంది. పునరుత్పాదక ఇంధనం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశానికి శక్తి స్వాతంత్ర్యాన్ని అందిస్తుంది. పర్యావరణ పరంగా, వాతావరణ మార్పుల వల్ల భారత్ తీవ్ర ప్రభావానికి గురవుతున్న దేశాల్లో ఒకటి. అకాల వర్షాలు, వరదలు, కరవులు, వేడిగాలులు మన వ్యవసాయం, నీటి వనరులు, ప్రజల ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. నగరాల్లోని వాయు కాలుష్యం శ్వాసకోశ, గుండె జబ్బులకు కారణమవుతోంది. పునరుత్పాదక ఇంధనానికి మారడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడమే కాకుండా, ప్రజల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరచవచ్చు. ఆర్థికంగా, పునరుత్పాదక ఇంధన రంగం అపారమైన అవకాశాలను సృష్టిస్తోంది. ఈ రంగం 2028 నాటికి 70లక్షలు, 2047 నాటికి 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తుంది. ఇది దేశీయ ఉత్పత్తిని పెంచుతుంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుంది. భారత్‌ను గ్లోబల్ గ్రీన్ టెక్నాలజీ లీడర్‌గా మారుస్తుంది. గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యాన్ని అందించడంలో కూడా సౌరశక్తి వంటివి ఎంతో ఉపయోగపడతాయి. 2025 మే నాటికి పెద్ద జల విద్యుత్ కేంద్రాలతో కలిపి మన దేశ మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 226.75 గిగావాట్లకు చేరుకుంది. ఇంటర్నేషనల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఏజెన్సీ నివేదికల ప్రకారం, మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో చైనా, అమెరికా, బ్రెజిల్ తర్వాత మనం ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉన్నాం. 2014-15లో కేవలం 81 గిగావాట్లు ఉన్న సామర్థ్యం ఇంతలా పెరగడం గమనించదగ్గ విషయం. సౌరశక్తి ఉత్పత్తిలో దేశం ప్రపంచంలోనే చైనా, అమెరికా తర్వాత మూడవ అతిపెద్ద దేశంగా అవతరించింది. 2025మే నాటికి మన మొత్తం సౌరశక్తి సామర్థ్యం 110 గిగావాట్లను దాటింది. పవనశక్తి (గాలి ద్వారావిద్యుత్)



సామర్థ్యంలోనూ భారతదేశం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద దేశంగా నిలిచింది. దీని సామర్థ్యం 2025 మే నాటికి 51 గిగావాట్లకు పైగా ఉంది. భారత్ 2030 నాటికి శిలాజ ఇంధనేతర వనరుల నుంచి 500 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని సాధిస్తామని, మొత్తం విద్యుత్ అవసరాల్లో 50 శాతం పునరుత్పాదక వనరుల నుంచే పొందుతామని ప్రకటించింది. 2070 నాటికి 'నెట్ జీరో' ఉద్గారాలను చేరుకోవాలనే సంకల్పం మన దీర్ఘకాలిక విజన్‌ను చూపుతుంది. దేశంలో పునరుత్పాదక ఇంధన విప్లవం రాష్ట్రాల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతోంది. సౌరశక్తి ఉత్పత్తిలో రాజస్థాన్ అగ్రస్థానంలో ఉంది. 2025 మే నాటికి దాని సామర్థ్యం 27.64 గిగావాట్లను దాటింది. భద్లా సోలార్ పార్కు వంటి ప్రపంచంలోనే అతిపెద్ద సౌర పార్కులు ఇక్కడే ఉన్నాయి. సౌర (18.13 గిగావాట్లకు పైగా) పవనశక్తి రెండింటిలోనూ గుజరాత్ అగ్రశ్రేణి రాష్ట్రాల్లో స్థిరంగా నిలుస్తోంది. పవనశక్తిలో తమిళనాడు మార్గదర్శిగా ఉంది. ప్రస్తుతం దాని సామర్థ్యం 10గిగావాట్లకు పైగా ఉంది. సౌరశక్తి సామర్థ్యం కూడా 9.77 గిగావాట్లకు పైగా పెరుగుతోంది. సౌరశక్తి (9.31 గిగావాట్లకు పైగా)పవనశక్తి రెండింటిలోనూ బలమైన స్థానంలో ఉంది. మహారాష్ట్ర ముఖ్యంగా సౌరశక్తిలో (9.88 గిగావాట్లకు పైగా) తన పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగంగా విస్తరిస్తోంది. చిన్న జల విద్యుత్ ప్రాజెక్టులు (5 గిగావాట్లకు పైగా), బయోమాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి (దాదాపు 10.74 గిగావాట్లు) కూడా దేశ శక్తి అవసరాలను తీర్చడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ వంటి సరికొత్త సాంకేతికతలపై భారీ పెట్టుబడులు పెడుతున్నాం. నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద 2030 నాటికి ఏటా 5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భారతదేశం పునరుత్పాదక ఇంధన రంగంలో సాధిస్తున్న ప్రగతి అద్భుతం. 2030 లక్ష్యాలు బలమైన విధానాలు, కొనసాగుతున్న ప్రాజెక్టుల (169 గిగావాట్లకు పైగా నిర్మాణంలో, 65 గిగావాట్ల ప్రాజెక్టులు టెండర్ దశలో) ద్వారా సాధ్యమయ్యేవే. దేశీయ తయారీని ప్రోత్సహించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం (ముఖ్యంగా చైనా నుంచి మే 2025లో 74.8 సౌర మాడ్యూల్స్ దిగుమతయ్యాయి) మన దీర్ఘకాలిక ఆర్థిక, శక్తి భద్రతకు కీలకం. ఈ ప్రయాణంలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. సౌర, పవనశక్తి వంటివి వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. కాబట్టి వాటిని పెద్ద మొత్తంలో జాతీయ విద్యుత్ గ్రిడ్‌లోకి అనుసంధానించడం సవాలుతో కూడుకున్నది. దీనికి స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీలు, భారీ ఎత్తున శక్తినిల్వ చేసే వ్యవస్థలు (బ్యాటరీలు, పంప్డ్ హైడ్రో) అవసరం. పెద్ద ప్రాజెక్టులకు భూసేకరణ ఒక క్లిష్టమైన సమస్య. ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక నిధులు లభించడం, పెట్టుబడిదారులకు నష్టభయం తగ్గించడం కూడాముఖ్యమే. అంతేకాదుఈ అధునాతన వ్యవస్థలను నిర్మించడానికి, నిర్వహించడానికి నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఈ సవాళ్లు ఉన్నప్పటికీ, భారతదేశ సంకల్పం, అపారమైన పునరుత్పాదక ఇంధన వనరులు మనకు భవిష్యత్తుపై నమ్మకాన్ని ఇస్తున్నాయి. ప్రపంచ స్థాయిలో మనం సాధిస్తున్న ప్రగతి, మన లక్ష్యాలు, సుస్థిర భవిష్యత్తుకోసం మన దేశం చూపుతున్న దార్శనికతను స్పష్టం చేస్తున్నాయి. పునరుత్పాదక ఇంధనానికి మారడం అనేది కేవలం శక్తి అవసరాలను తీర్చడమే కాదు. ఇది మరింత బలంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా పురోగమించే భారతదేశాన్ని నిర్మించడం. •

# గుంటూరు వార్త

# రైతులు వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి : ఎమ్మెల్యే జూలకంటి

**మాచర్ల, జులై 11 ప్రభాతవార్త:** రైతులు వ్యవసాయంలో నూతన సాంకేతిక విధానంలో మెళకువలు తెలుసుకుని సులభతరమైన పద్ధతిలో వ్యవసాయంవైపు అడుగులు వేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం వెల్దుర్తి మండలం బోదిలవీడు గ్రామంలో



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు 80 శాతం సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్లను, హైబ్రిడ్ రకం కంది విత్తనాలను రైతులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రోన్ల ఉపయోగించి వ్యవసాయం చేసే సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఏఓ టి.బాలాజీ గంగాధర్, వ్యవసాయశాఖ సిబ్బంది, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆశయానికి గండి కొడుతున్న అధికారులు

## పొగాకు కొనుగోళ్లు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తపరిచిన ప్రత్తిపాటి

**యడ్లపాడు, జులై 11, ప్రభాతవార్త :** మండలంలోని స్పైసెస్ పార్క్ నందు ఉన్న ఐటీసీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని, అధికారులు నిర్ణీత పరిమితికి మించి కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు సంతృప్తి చెందడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, అవసరమైతే కొనుగోలు కేంద్రాలను పెంచాలని,



ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేట మరియు యడ్లపాడు కొనుగోలు కేంద్రాలు తెరిచి 20రోజులు గడిచినా ఇప్పటి వరకు 5వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారని, పొగాకు కొనుగోళ్ల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అధికారుల తీరుతో నీరు గారి పోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. చిలకలూరిపేట నియోజకవర్గంలోనే రైతులకు 99వేల క్వింటాళ్ల పొగాకు నిల్వ ఉందని, ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని, రోజుకు 300క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తే మిగిలిన నిల్వ ఎప్పుడు పూర్తవుతుందని, రైతుల ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. నెల రోజుల క్రితం యాప్ లో బుక్ చేసుకున్న రైతులకు కూడా ఇప్పటివరకు కొనుగోలు షెడ్యూల్ రాలేదని ఆయన అన్నారు.

**ప్రభుత్వానికి విజ్ఞప్తి :** చంద్రబాబు నాయుడు రైతు పక్షపాతి అయినప్పటికీ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న గోడౌన్లను ఉపయోగించుకొని రైతుల వద్ద ఉన్న నిల్వలను తక్షణమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సకాలంలో కూలీలు దొరకక పొగాకు పండుటాకులు మారి 2వేలకు కూడా బయట అడిగే పరిస్థితి లేదని, దీనిపై ప్రభుత్వం స్పందించి 4వేల ధర నిర్ణయించి కొనుగోలు చేయకపోతే రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమస్యను మంత్రి అచ్చెన్నాయుడు, మార్క్ఫెడ్ ఇంచార్జ్ ఎండీ ఢిల్లీ రావు దృష్టికి తీసుకెళ్లానని, అవసరమైతే సీఎంను కూడా కలిసి రైతుల సమస్యలను వివరించి, యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరతానని అన్నారు. చంద్రబాబు నాయుడు ఆదేశించిన విధంగా చివరి ఆకు వరకు పొగాకు కొనుగోలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆర్థిక లోటులోకూడా 80శాతం హామీలు అమలు చేసిన కూటమి ప్రభుత్వం

## ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు క్రైమ్,జులై 11,ప్రభాతవార్త :** రాష్ట్రం ఆర్థికలోటు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 80శాతం హామీలను మొదటి ఏడాదిలోనే అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.



శుక్రవారం 34,38వ డివిజన్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించి,ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేసిన హామీలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని ప్రజలకు వివరించి ,వారి నుండి సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గుజ్జనగుండ్ల, ఫాతిమాపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అనేకమంది తల్లులు తమకు తల్లికి వందనం ద్వారా ఇంటిలోఉన్న పిల్లలందరికీ డబ్బులు అందాయని ఆనందం వ్యక్తం చేశారు.మరోవైపు యువత రాష్ట్రానికి పరిశ్రమలు రావడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ, అమరావతి నిర్మాణం పూర్తి చేసితమ భవిష్యత్తుకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా కల్పిస్తారన్న నమ్మకం తమకు



ఉందన్నారు .డివిజన్లో పేదలు తమకి ఇళ్ళకు బి-ఫారం పట్టాలు కావాలని అడుగుతున్నారని చర్చికూడా అడుగుతున్నారని వీటన్నటిని పరిశీలించి ప్రజలం దరికీ న్యాయం చేసేలా చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సింహాద్రి కనకాచారి, మల్లేశ్వరరావు,తాళ్ళ వెంకటేష్ యాదవ్,మానం పద్మశ్రీ,మానం శ్రీనివాస్,షేక్ అన్వర్,పఠాన్ అస్మా,మన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం,అభివృద్ధికి పి-4 : ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, జులై 11 ప్రభాతవార్త :** పేదల సంక్షేమం, అభివృద్ధి కొరకు పి-4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్బాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించిన పి-4 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపిడివో టి.వి.కృష్ణకుమారి సమావేశానికి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్బాబు మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంలో భాగంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ భాగస్వామ్యం చేసేందుకే పి-4ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గొప్ప విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అన్నారు. మెరుగైన సమాజాన్ని సాధించేందుకు, నిర్మించేందుకు ఈ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఆర్థికంగా దిగువున ఉన్న కుటుంబాలను పైకి తీసుకురావడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ : చీఫ్విప్ జీవీ

**వినుకొండ, జులై 11,ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు త్వరితగతిన అధికారులకు తెలియజేసి పరిష్కారం చేసేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏపీ ప్రభుత్వ చీఫ్విప్ జీ.వీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని చీఫ్విప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జీ.వీ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ ప్రజాదర్బార్కు వచ్చిన ప్రతి అర్జీని అధికారులకు వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగకుండా అధికారులు చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# పీహెచ్సీలో సిబ్బంది కొరతతో నామమాత్రపు వైద్యం

**కారంపూడి, జులై 11 ప్రభాతవార్త:** వైద్యో నారాయణో హరీగా కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మారింది. పీహెచ్సీలో సిబ్బంది లేకపోవడంతో పూర్తిస్థాయి వైద్యసేవలు ప్రజలకు అందడం లేదు. కారంపూడి వైద్యశాల 24 గంటల వైద్యశాల కావడంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు వైద్యశాలకు వస్తుంటారు. సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కరవైందని చెప్పవచ్చు. కారంపూడి పీహెచ్సీ సిబ్బంది ఏనాడూ అందుబాటులో లేకుండా నామమాత్రపు వైద్యం చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. శుక్రవారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పీహెచ్సీ వైద్యశాలకు తీసుకువచ్చారు. పూర్తిస్థాయి వైద్యం చేయకుండానే పీహెచ్సీకి సంబంధం లేని వ్యక్తులు అరకొర వైద్యసేవలు అందించి గురజాల వైద్యశాలకు తరలించారు. తమ పరిస్థితి ఏమిటని క్షతగాత్రుడు, బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది మాత్రం తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు.

**జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి రవికుమార్:** పీహెచ్సీలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమేనని అన్నారు. వైద్యసేవలకు చర్యలు తీసుకుంటామన్నారు. క్షతగాత్రుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



# గురజాల తహశీల్దార్ సస్పెండ్

**గురజాల, జులై 11 ప్రభాతవార్త:** గురజాల మండల తహసీల్దార్గా విధులు నిర్వహిస్తున్న వైవీవి కుటుంబరావును ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. దాచేపల్లి మండలంలో తహసీల్దార్గా పనిచేస్తున్న సమయంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడ్డాడు. దాచేపల్లి మండలంలోని కేసానుపల్లి, పెదగార్లపాడు, గామాలపాడు భూముల విషయమై ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ అరుణ్బాబు విచారించి తహసీల్దార్ కుటుంబరావును సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి.

# పల్నాడుజిల్లా కలెక్టర్ను కలిసిన నూతన జిల్లా అధికారులు

**నరసరావుపేట టౌన్, జులై 11 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ పి.అరుణ్బాబును శుక్రవారం వివిధశాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ రీజనల్ మేనేజర్గా అజితకుమారి



ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్లో వారిని కలిశారు. అదే విధంగా ఆర్అండ్బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్గా గీతారాణి ఉద్యోగ బాధ్యతలను తీసుకున్న అనంతరం కలెక్టర్ అరుణ్బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ అరుణ్బాబు మాట్లాడుతూ ఆర్టీసీ, ఆర్అండ్బి వంటి కీలకమైన శాఖలకు ఉన్నతాధికారులుగా మహిళా అధికారులు రావడం సంతోషమన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి పల్నాడు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ అరుణ్బాబు అధికారులకు సూచించారు.

# నాడు జగన్ విధ్వంసపు పాలన,నేడు చంద్రబాబు సుపరిపాలన

## - ప్రభుత్వ చీఫ్విప్ జీవీ,జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన

**వినుకొండ,జులై11,ప్రభాతవార్త:** జగన్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమం కుంటుపడటమే కాకుండా వ్యవస్థలన్నీ సర్వనాశనం అయ్యాయని ఏపీ ప్రభుత్వ చీఫ్విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెలుగుదేశం



కార్యక్రమం పట్టణంలోని 9వ వార్డులో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చీఫ్విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. పాలనపై ప్రజలను అభిప్రాయాలను ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ గత వైకాపా పాలనలో రాష్ట్రం గాడితప్పితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమాన్ని సమపాళల్లో నడిస్తున్నారన్నారు. గత వైకాపా ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం పూర్తిగా నాశనం అయిందని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది సమయంలో ఇచ్చిన హామీల మేరకు చాలా వరకు అమలు చేస్తున్నామన్నారు. ఏడాది పాలనలో పింఛన్లు పెంపు,తల్లికి వందనం,ఉచిత గ్యాస్ సిలిండరు పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ,ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇతరత్రా పథకాలన్నింటిని సీఎం చంద్రబాబు అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. కూటమి పాలనకు వస్తున్న ప్రజా మద్దతును ఓర్వలేని మాజీ సీఎం జగన్రెడ్డి తప్పుడు ప్రచారాలకు తెరతీస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరుకుపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు

**సత్తెనపల్లి, జులై 11 ప్రభాతవార్త :** మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామంలో రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన సి.సి.డ్రైన్స్ను ఎమ్మెల్యే కన్నా ప్రారంభించారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం పూర్తిగా నాశనమైందన్నారు. ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ అందిస్తామన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ, మండల, నియోజకవర్గ నాయకులు ఆయన వెంట ఉన్నారు.



# రాష్ట్రంలో రాజకీయాలు విచిత్రమైన పరిస్థితిలో ఉన్నాయి : అంబటి

**సత్తెనపల్లి, జులై 11 ప్రభాతవార్త :** రాష్ట్రంలో రాజకీయాలు విచిత్రమైన పరిస్థితిలో ఉన్నాయని మాజీమంత్రి అంబటి రాంబాబు అన్నారు. తెలుగుదేశంపార్టీ కార్యకర్తల్లా పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విలేకర్లతో శుక్రవారం ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటనలో పాల్గొంటే పోలీసులు కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. మొత్తం 1300 మందిపై కేసులు బనాయించడం రాజకీయ చరిత్రలో ఎప్పుడూ లేదన్నారు. పోలీసులు శాంతిభద్రతలను కాపాడే పద్ధతులు మాని ప్రజలను హింసించే మార్గంలో వెళ్తున్నారన్నారు. వై.ఎస్.జగన్ మామిడి రైతులను పరామర్శించేందుకు వెళ్తే జిల్లా ఎస్పీ రౌడీషీట్లు ఓపెన్ చేస్తానని బెదిరించడం దారుణంగా ఉందన్నారు. రాష్ట్ర డిజిపి హరీష్కుమార్గుప్తా, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి చంద్రబాబుకు చెంచాలుగా పని చేస్తున్నారని మాజీమంత్రి అంబటి రాంబాబు విమర్శించారు.



# సుపరిపాలనలో తొలి అడుగుకు ప్రజల నుండి విశేష స్పందన

**మంగళగిరి, జులై 11, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుసారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరవళ్ళు తొక్కుతున్నాయని టిడిపి సీనియర్ నాయకులు గోవాడ



దుర్గారావు పేర్కొన్నారు.సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంగళగిరి పట్టణం లోని 9వ క్లస్టర్ ఇంచార్జి గోవాడ దుర్గారావు పాల్గొని ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం నుండి లభిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా చేరుతున్నాయా లేదా అని ఆరా తీశారు.వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని, లక్షల కోట్ల మేర రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకుందని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే పింఛన్లను రూ.3 వేల నుండి రూ. 4వేలకు పెంచారని గుర్తు చేశారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ. 15,000 చొప్పున అందించామన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు సేవ అమల్లోకి వస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

# నేతన్నల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జులై11,ప్రభాతవార్త:** అనాదినుంచి చిలకలూరిపేట ప్రాంతం చేనేతపనికి పెట్టింది పేరుఅని, కేంద్రప్రభుత్వ సబ్సిడితో చేనేత కార్మికులు స్టాండ్ మగ్గాలతో తమ ఉత్పత్తుల తయారీ పెంచుకోవాలని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్నందు జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్లస్టర్స్థాయి చేనేత కార్మికుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి చేనేత కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర జౌళిశాఖ ఒక్కో నేత గ్రూపుకు రూ 85లక్షలు వరకు సబ్సిడి ఇస్తుందని అన్నారు. గ్రూప్ సభ్యులు కేవలం రూ 3లక్షలు కట్టుకుంటే చాలని తెలిపారు. ఆ సొమ్ముతో నూతన మగ్గాలు, సరికొత్త ఉత్పత్తులతో నేత పనివారు బాగా సంపాదించుకోవచ్చునని ప్రత్తిపాటి సూచించారు. ప్రభుత్వం సాధారణ మగ్గాలకు 200 యూనిట్లు, పవర్లూమ్లకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తుందని, కష్టపడి పనిచేసుకునే చేనేత వర్గం తమ సామాజిక వర్గంలో నెలకొన్న అనైక్యత, రాజకీయ కారణాలతో ఇబ్బంది పడకుండా ఇబ్బందులు



పడుతున్నారని అన్నారు. చేనేత వర్గం మంచి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నా కార్మికులు ఆర్థికంగా బలపడాలన్నా, రాజకీయ ఇబ్బందులు పక్కనపెట్టి , విభేదాలు మరిచి అందరూ ఐక్యంగా ఉండాలని ప్రత్తిపాటి సూచించారు.


## పత్రికా ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు : పొన్నూరు
ఓ.యస్.నెం. 131/2024
బిట్వీన్
మునిపల్లె హేమసుందర సాయిబాబు ( వాది)
ఎదిరి
షేక్ షిరీన్ ఖుద్దూస్ (ప్రతివాది)
టు: శ్రీమతి షేక్ షిరీన్ ఖుద్దూస్, భర్త షేక్ అబ్దుల్ ఖుద్దూస్, డోరు నెం. 3-11-15, డఫ్పేట, 5వ వార్డు, పొన్నూరు పట్టణము, గుంటూరు జిల్లా.
ఈ పై నెంబరు దావాలోని వాది తన 2 ప్రామిసరీ నోట్లు బాకీ వసూలు చేసుకునే నిమిత్తమై పై నెంబరు దావా మీపై దాఖలు చేయగా సదరు దావాలో ప్రతివాది అయిన మీకు అనేక మార్లు శ్రీ కోర్టు వారు దావా సమన్సు, నోటీసులు పంపినప్పటికిన్నీ మీరు వాటిని దురుద్దేశపూర్వకంగా తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేసినందున ఈ దావాలో మీ హాజరు నిమిత్తం ది. 11-08-2025న ఉదయం గం॥10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని హాజరు కావలసినది. అలా హాజరు కాని యెడల శ్రీ కోర్టు వారు సదరు దావాను మీ పరోక్షములో తీర్మానించెదరు.
//శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 11-08-2025
పొన్నూరు,
తేది : 12-07-2025
యం.పి.ఆర్. విఠల్ ప్రసాద్, వాది తరపు న్యాయవాది, పొన్నూరు,
సెల్ నెం. 9848012186.



## SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కొత్తపేట బ్రాంచ్-12920, చీరాల, బాపట్ల జిల్లా-523 157.

(రూల్-8(1)) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

NPA: EB-HOME LOAN A/c No: 41221705765, EB-SURAKSHA A/c No: 41354667748

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్ 2002 నందలి సెక్షన్ 13కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత:** శ్రీ షేక్ ఫరూక్ బాషా, తండ్రి: ఖాదర్ బాషా, డి.నెం.7-148/1, చెరువు జమ్ములపాలెం, బాపట్ల జిల్లా, పిన్ కోడ్: 522 113 మరియు మరొక చిరునామా: ప్లాట్ నెం.41, వైఎస్ఆర్ నగర్ దగ్గర, బాపట్ల, బాపట్ల జిల్లా, పిన్కోడ్: 522 312 మరియు మరొక చిరునామా: డి.నెం.4-6-18/1/ఎఫ్/1, వాసుదేవరెడ్డి నగర్, అత్తాపూర్, తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, పిన్ కోడ్: 500 048 వారిని నోటీసులో తెలిపిన మొత్తము **తేది 28.04.2025 నాటికి రూ.37,57,833/- (అక్షరాల ముప్పై ఏడు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల ముప్పై మూడు రూపాయలు మాత్రమే)** సదరు బకాయి మొత్తంపై అంగీకరించిన కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ & అనుషంగిక ఖర్చులు, వ్యయాలు మరియు ఛార్జీలు సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.28.04.2025** న డిమాండ్ నోటీసు జారీచేయబడినది మరియు సదరు నోటీసును ది.04-05-2025 తేదీన ప్రజాశక్తి, మనతెలంగాణ తెలుగు దినపత్రికలలో మరియు ఫైనాన్షియల్ ఎక్స్ప్రెస్ ఇంగ్లీష్ దినపత్రికలలో ప్రచురించబడినది.

ఋణగ్రహీతలు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు నోటీసు ఇచ్చి, ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారము **7 జూలై 2025వ తేదీన** దిగువ పేర్కొన్న ఆస్తిని **లాంఛనముగా స్వాధీనత** తీసుకోవడమైనదని ఇందుమూలముగాతెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయిసొమ్ము **తేది.28.04.2025 నాటికి రూ.37,57,833/- (అక్షరాల ముప్పై ఏడు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల ముప్పై మూడు రూపాయలు మాత్రమే)** సదరు బకాయి మొత్తంపై అంగీకరించిన కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ & అనుషంగిక ఖర్చులు, వ్యయాలు మరియు ఛార్జీలు మరియు ఖర్చులు మొ॥నవి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొత్తపేట బ్రాంచి, చీరాల, బాపట్ల జిల్లా వారి** ఛార్జికి లోబడి ఉండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

సదరు చట్టం 13వ విభాగం యొక్క ఉప విభాగం (8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు తగిన సమయం లభిస్తుందని ఋణగ్రహీతలకు, హామీదారులకు విన్నవించటమైనది.

**షెడ్యూలు ఆస్తి**
**స్థిరాస్తి వివరములు**

**తేది: 26.08.2022 నాటి దస్తావేజు నెం. 7100/2022** ప్రకారం శ్రీ షేక్ ఫరూక్ బాషా, తండ్రి: షేక్ ఖాదర్ బాషా గారికి చెందినది. బాపట్ల రిజిస్ట్రేషన్ జిల్లా, బాపట్ల జిల్లా, బాపట్ల సబ్-జిల్లా, బాపట్ల మునిసిపాలిటీ, వెస్ట్ బాపట్ల డి.నెం.212/7 విస్తీర్ణం ఎ.0-52 సెంట్లు, డి.నెం. 212/8 విస్తీర్ణం ఎ. 0-18 సెంట్లు, డి.నెం.212/10 విస్తీర్ణం ఎ.0-32 సెంట్లు మొత్తం విస్తీర్ణం ఎ.1-02 సెంట్లు దీనిలో ప్లాట్ నెం.41, విస్తీర్ణం 194.33 చ.గ.ల ఇంటి స్థలం మరియు ఆర్సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్. **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.54 - 33 అ॥, **దక్షిణం:** ప్లాట్ నెం. 40 - 53 అ॥, **పడమర:** 33 అ॥వెడల్పు రోడ్డు-33 అ॥, **ఉత్తరం:** ప్లాట్ నెం. 42 - 53 అ॥. పై హద్దుల మధ్య విస్తీర్ణం **194.33 చ॥గ॥ల** ఇంటి స్థలం మరియు ఆర్సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ మాత్రమే.

తేది: 07-07-2025, ప్రదేశం: చీరాల | సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# ఏ ప్రభుత్వం చేయని సంక్షేమం,అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసింది

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జులై11,ప్రభాతవార్త:** తల్లికి వందనం, ఫించన్ల పంపిణీ చెల్లింపులో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని, త్వరలోనే అన్నదాత సుఖీభవ కింద అర్హత కలిగిన ప్రతి రైతుకు రూ 20వేలు ఆర్థిక సహాయం అందించనున్నారని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని మానుకొండవారిపాలెం, వేలూరు, కుక్కపల్లివారిపాలెం



గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాల్గొని మాట్లాడారు. తొలుత వేలూరు గ్రామంలో ఆర్‌డబ్యుఎస్ వారు రూ 38లక్షల నిధులతో మరమ్మత్తులు చేపట్టిన నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రత్తిపాటి పున:ప్రారంభించారు. తరువాత రూ 10లక్షల వ్యయంతో కుక్కపల్లివారిపాలెం గ్రామంలో నిర్మిస్తున్న సిసి రోడ్లకు శంఖుస్థాపన చేశారు. అనంతరం మానుకొండవారిపాలెం గ్రామంలో రూ32లక్షల వ్యయంతో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులకు ప్రత్తిపాటి శంఖుస్థాపన చేశారు. సంగం డెయిరీ ఉత్పత్తిదారులకు స్వయంగా బోనస్‌ను పంపిణీ చేశారు.

**అర్హులకు పథకాలు అందరకపోతే సచివాలయ సిబ్బంది, అధికారులదే భాధ్యత**

ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన మంచి, అభివృద్ధి దేశంలో మరే ప్రభుత్వం చేయలేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపధకాలు అందించాల్సిన భాద్యత సచివాలయ సిబ్బంది, అధికారులదేనని మాజీమంత్రి, స్ధానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం మరో 15 సంవత్సరాలు అధికారంలో ఉంటే ప్రజలతో పాటు రాష్ట్రానికి కూడా ఎంతోమేలు జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్ధితి దృష్ట్యా, ఉన్నంతలో ప్రజలకు మంచి చేయడానికి ముఖ్యమంత్రి ఎంతగానో తపన పడుతున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వంపై, చంద్రబాబు నాయకత్వంపై అసంతృప్తి లేకుండా అందరూ ఓర్పు, సంయమనంతో ఆలోచించాలని అన్నారు. మానుకొండవారిపాలెం నాయకులు గట్టిగా వెంటపడి ప్రజల సమస్యలను తీర్చాలని పట్టుబట్టినందుకే వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు కేటాయించామని, గ్రామంలోని మిగితా అభివృద్ది పనులను కూడా ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేస్తామని ప్రత్తిపాటి తెలిపారు.

**గతంలో చేసిన మంచి చెప్పుకోలేక ఓడిపోయాం**

చేసిన మంచిని చెప్పుకోవడంలో విఫలమయ్యే గతంలో టిడిపి ఓడిపోయిందని, ఇప్పుడు ప్రజలు వాస్తవాలు గ్రహించి ప్రభుత్వ పనితీరుపై తమ అభిప్రాయాలు చెప్పాల్సిందేనని ప్రత్తిపాటి తెలిపారు. తాను మంత్రిగా ఉన్నాకూడా నియోజకవర్గ అభివృద్ధి కోసం కాళ్లు అరిగేలా తిరిగానని ప్రత్తిపాటి అన్నారు. ఐదేళ్లలో రూ 4,200 కోట్లు ఖర్చుపెట్టి ప్రజలకు మంచి చేశానన్నారు. గత పాలకులు, గత ప్రభుత్వం మరలా రాకూడదనేధృడచిత్తంతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. గ్రామాలలోని ఎన్ఆర్ఐలు, వ్యాపారులు పి4లో భాగస్వామ్యులై పేదలను ఆదుకోవాలని ప్రత్తిపాటి కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కందుల రమణ, అంబటి సోంబాబు, కొండ్రగుంట్ల శ్రీను, బొంతా దాసు, కట్టా వెంకటేశ్వర్లు, కందిమళ్ల రాజేశ్వరి, కల్లి వీరారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఆయా గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు

**పొన్నూరు, జూలై 11,ప్రభాతవార్త:** స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగంలో ఏపిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత ఘనంగా జరిగాయి. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఏపి బేగ్ మాట్లాడుతూ నిజాం స్టేట్ రైల్వేలో భాగంగా ఉన్న రోడ్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ పేరుతో ఉన్న రోడ్డు రవాణా 1950వ



సంవత్సరంలో రైల్వేల నుండి విడిపోవడం జరిగిందన్నారు. ఆ తర్వాత రోడ్డు రవాణా సంస్థగా ఏర్పడిందన్నారు. 11జూలై 1952 సంవత్సరంలో ఎంపా్లయీస్ యూనియన్‌ను ట్రేడ్ యూనియన్ యాక్టు ప్రకారంగా రిజిస్టర్ చేయడం జరిగిందన్నారు. అప్పటి నుండి నేటి వరకు ఎంప్లాయీస్ ఎన్నో పోరాటాలు చేసి కార్మికులకు హక్కులు సాధించి పెట్టిందన్నారు. వాటిలో ముఖ్యంగా కార్మికులకు ఎనిమిది గంటలు పని దినం, యూనిఫాం, బస్సు పాస్, చనిపోయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించడం, యాక్సిడెంట్ అయిన సందర్భంలో డ్రైవర్ కోర్టులో వాదించుకొనుటకు ఆర్థిక పరిస్థితులు యాజమాన్యం నుండి కల్పించడం జరిగిందన్నారు. ఏపిఎస్ ఆర్టీసి కార్మికులకు కుటుంబంతో కూడి ప్రయాణించడానికి బస్సు పాస్ ఎంప్లాయీస్ యూనియన్ సాధించి పెట్టిందన్నారు. అదేవిధంగా సంస్థను కాపాడటంలో, కార్మికుల హక్కుల పరిరక్షణలో ఎంప్లాయీస్ యూనియన్ అనేక పోరాటాలు చేసి సాధించిందన్నారు. 1952లో సీసీఎస్ ఏర్పాటు చేసి ఆర్టీసి కార్మికుల ఆర్థిక స్థితిగతులను మార్చివేసిందన్నారు. సమావేశానికి పొన్నూరు ఆర్టీసి డిపో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఆజీజ్ రాజు అధ్యక్షత వహించారు. ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ సీనియర్ నాయకుడు వేణుగోపాల్ పతాకవిష్కరణ చేశారు. సమావేశంలో ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు మాట్లాడుతూ ఆర్జీ కార్మికుల రక్షణ, కార్మికుల హక్కులు పరిరక్షణకు, ఆర్టీసి కార్మికులు 2001లో జరిగిన 24రోజుల సమ్మె చారిత్రాత్మకమైందన్నారు.ప్రభుత్వ కంబంధ హస్తాల నుంచి ఆర్టీసిని కాపాడుకోగలిగామన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటిగా స్థాపించిన సయ్యద్ ఖాసిం ముగ్ధం మొహిద్దీన్ రాజ బహద్దర్ గౌడ్, ఆర్పి రంగారావు నాయకులకు ఘనంగా నివాళులర్పించారు. సమావేశంలో సీసీఎస్ డెలిగేట్‌లు కరిముల్లా, వివిఎస్ రావు, కోశాధికారి కాసింబుడ, జాయింట్ కార్యదర్శి షేక్ కరీముల్లా, రామయ్య, టీవి రామయ్య, జి.రాణి, శివ, బుజ్జి, అమిరుల్లా గ్యారేజి నాయకులు ఎంపి రావు, లెనిన్, ఆర్ బాబు, ఎల్ వెంకటేశ్వర్లు, మెకానిక్ నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఆర్టీసి ఆర్ఎం

**చిలకలూరిపేట, జులై 11, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా ఆర్టీసి ఆర్‌యంగా అజిత కుమారి నియమితులయ్యారు. శుక్రవారం ఆమె మాజీమంత్రి, స్ధానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును ఆయన నివాసంలో మర్యాద పూర్వంగా కలిశారు. ఈ



సందర్బంగా ఆమెను ప్రత్తిపాటి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, కంచర్ల శ్రీనివాసరావు, ఆర్‌టిసి ఉద్యోగులు కరణం వెంకటశివ, వెంకటేశ్వర్లు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గణపవరం గ్రామ తెదేపా అధ్యక్షునిగా ఎన్నికైన కెల్లంపల్లి అచ్చయ్యను అభినందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల, జులై11,ప్రభాతవార్త:** మండలంలోని గణపవరం గ్రామ టిడిపి అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కెల్లంపల్లి అచ్చయ్య ఎన్నికయ్యారు. కాగా శుక్రవారం కెల్లంపల్లి అచ్చయ్య



మాజీమంత్రి, స్ధానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్బంగా అచ్చయ్యను ప్రత్తిపాటి సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, నాదెండ్ల మండల టిడిపి అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్‌మోహన్, గంగా శ్రీనివాసరావు, కంచర్ల శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొని అచ్చయ్యకు అభినందనలు తెలిపారు.

## తెదేపా నాయకుడు వడ్డాని మార్క్‌బాబు భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జులై 11, ప్రభాతవార్త:** పట్టణం లోని 12వ వార్డు తూర్పుమాలపల్లె ప్రాంతానికి చెందిన టిడిపి నాయకుడు వడ్డాని మార్క్‌బాబు మరణించారు. విషయం తెలుసు కున్న మాజీమంత్రి, స్ధానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం తూర్పుమాల పల్లెలోని మార్క్‌బాబు నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి



నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు పాల్గొని మార్క్‌బాబు భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

## మాజీ కౌన్సిలర్ చింతకాయల చినసుబ్బారావు భౌతిక కాయానికి నివాళులు అర్పించిన మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేట, జులై 11, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చింతకాయల చిన సుబ్బారావు మరణించారు. విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ శుక్రవారం పాటిమీద గల వారి నివాసానికి వెళ్లి సుబ్బారావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు



అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కొండెబోయిన ఆంజనేయులు, గేరా లింకన్, ఇమ్మడి జానకీపతి, అంబటి వెంకట శివ, గ్రంధి ఆంజనేయులు, చుక్కా డేవిడ్, కొండెబోయిన వినాయకరావు, చింతకాయల కోటేశ్వరరావు, షేక్ వెంకట సాయిబాబు, లింగాల విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిషేదిత గుట్కా, పొగాకు అమ్మితే కఠిన చర్యలు : అర్బన్ సిఐ పి రమేష్ హెచ్చరిక

**చిలకలూరిపేట, జులై11,ప్రభాతవార్త:** పట్టణంలో నిషేదిత గుట్కా, పొగాకు తదితరాలు అమ్మితే అమ్మినవారు, కొన్నవారిపై కఠినచర్యలు తీసుకుంటామని అర్బన్ సిఐ పి రమేష్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వద్ద నిషేదిత గుట్కా,పొగాకు ఉత్పత్తులను అమ్మినట్లయితే సంబందిత షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సియం చంద్రబాబు ప్రవేశపెట్టిన "ఆపరేషన్ సేఫ్ క్యాంపస్" కార్యక్రమంలో బాగంగా ప్రతి స్కూలు, కాలేజీలకు 100 మీటర్ల సమీప దూరంలో ఉన్న దుకాణాలలో తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. పొగాకు సంబందిత చుట్ట,బీడి,పొగాకు సంబందిత ఉత్పత్తులు వలన విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసగా మార్చే అవకాశం కలుగుతుందని, విద్యార్థులు మంచి మార్గంలో నడవాలంటే చుట్టప్రక్కల మంచి వాతావరణం ఉండాలని ఆయన సూచించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి యువత వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. నిషేదిత డ్రగ్స్ సేవించినా, విక్రయించినా, వారి వద్ద కలిగిఉన్నా, రవాణా



చేస్తున్నా చట్టరీత్యా నేరమని ఆయన తెలియచేశారు. పట్టణంలో ఎవరైనా ఇటువంటివి కలిగిఉంటే తమకు వెంటనే సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని సిఐ రమేష్ తెలిపారు

## 29వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు

**చిలకలూరిపేట, జులై11,ప్రభాతవార్త:** పట్టణంలోని 29వ వార్డు పురుషోత్తమపట్నంలోని 136వ బూత్‌లో టిడిపి నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. మాజీమంత్రి, స్ధానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి ఆదేశాల మేరకు వార్డులో కూటమి ప్రభుత్వం



చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఏడాది కాలంలో చేసిన మంచిని,అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తోట బ్రహ్మాస్వాములు, 10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, 29వ వార్డు ప్రెసిడెంట్ కరిముల్లా, దరియా హుస్సేన్, నందం చంద్రశేఖర్, జున్నుబుడే, మౌలాబుడే, 29వ వార్డు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## తెదేపా నాయకుడు వడ్డాని మార్క్‌బాబు భౌతికకాయానికి నివాళి

**చిలకలూరిపేట, జులై11,ప్రభాతవార్త:** పట్టణంలోని 12వ వార్డు తూర్పుమాలపల్లె ప్రాంతానికి చెందిన టిడిపి



నాయకుడు వడ్డాని మార్క్‌బాబు మరణించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని శుక్రవారం తూర్పుమాల పల్లెలోని వారి నివాసానికి వెళ్లి మార్క్‌బాబు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించిన తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొని నివాళులు అర్పించారు.

## బోరు ఏర్పాటుకు భూమిపూజ

**విజయపురిసౌత్, జులై 11 ప్రభాతవార్త:** మాచర్ల మండలం ఏకోనాంపేటలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాలతో తాగునీరు నిమిత్తం బోరు



ఏర్పాటుకు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. మాజీ మాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు గుండా శ్రీను కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా గుండాల శ్రీను మాట్లాడుతూ గత కొంతకాలంగా గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే చొరవతో బోరు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు తెలిఎపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## భారతీయుల తొలిగురువు వ్యాసమహర్షి

**గుంటూరు కల్చరల్, జూలై 11,ప్రభాతవార్త :** జ్ఞానభాండాగారంగా పంచమ వేదంగా ప్రసిద్ధిగాంచిన మహాభారతాన్ని ప్రపంచానికి అందించిన వ్యాసమహర్షి భారతీయుల తొలి గురువని, ఆయన జన్మదినాన్ని గురు పౌర్ణమిగా అనాదినుండి భారతీయ సమాజం జరుపుకుంటుందని అవగాహన మనమూ పాడుదాం రండి బృందం ఆధ్వర్యంలో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో రంగస్థల నటుడు పి.ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ ఒక్కటిగా ఉన్న వేదజ్ఞానాన్ని ఋగ్,యజుర్,సామ,ఆధర్వణ వేదాలుగా విభజించారు.కావున వ్యాసుడు వేదవ్యాసుడయ్యారన్నారు. ప్రముఖగాయని యార్లగడ్డ లక్ష్మీ మాట్లాడుతూ భారతదేశంలో గురువుకు విశేషమైన స్థానం ఉందని,సమాజ క్షేమాన్ని ఒక ఉత్తమ గురువు తాను శ్రమపడి సంపాదించిన జ్ఞానాన్ని అర్హత గలవారికి అందిస్తూ తనతో సమానమైన ఎందరో శిష్యులను తీరి ్చదిద్ది సమాజానికి ఉపకారం చేస్తారన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా గాయనీ గాయకులు సిహెచ్ రాజ్యలక్ష్మీ,పోతురాజు, రవీంద్రబాబు,రాజారావులు భక్తి గీతాలు పాడి ఆలరించారు.

## ప్రత్తిపాడు నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

### -ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే రామాంజనేయులు

**గుంటూరు క్రైమ్, జూలై 11,ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,కూటమి ప్రభుత్వం,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్



మీటింగ్ ప్రత్తిపాడు నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు అడవి తక్కెళ్ళ పాడులోని గురుకుల పాఠశాల కార్యక్ర మంలో పాల్గొని పేరెంట్స్‌కు ధన్య వాదాలు, విద్యార్థులకు శుభాశీస్సులు అందజేశారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,కూటమి ప్రభుత్వ ధ్యేయం రాష్ట్రంలో అక్షరాస్యతలో నూటికి నూరుశాతం మంచి ఫలితాలతో విజయం సాధించాలని విద్యార్థుల మేధస్సుకు పేదరికం అడ్డు రాకూడదని భావితరాలు భవిష్యత్తులో అందరూ ఉన్నత శిఖరాలకు కులమతాలకు అతీతంగా భావి భవిష్య పౌరులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత తమపై ఉందని అందుకే ప్రభుత్వం నాణ్యమైన స్కూల్ బ్యాగులు,బట్టలు,షూస్,తల్లికి వందనం కింద చదువుకునే ప్రతి విద్యార్థికి సహాయం అందజేయడం,నాణ్యమైన సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం,పాఠశాల్లో డిజిటల్ టెక్నాలజీ క్లాస్ రూమ్‌లతో కార్పొరేట్ విద్యకు దీటుగా అందజేస్తుందన్నారు.నేను కూడా క్రమశిక్షణగా ఎంతో సామాన్య సౌకర్యా




ల్లేని పాఠశాల నుండి అకుంఠిత దీక్షతో ఐఏఎస్ అధికారిగా,ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానన్నారు.కార్యక్రమంలో జనసేన కోఆర్డినేటర్ కొ్రపాటి నాగేశ్వరరావు,కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మిత పద్మజ,రాష్ట్ర తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు,జిల్లా అధికార ప్రతినిధి కల్లూరుశ్రీనివాసరావు,డివిజన్ అధ్యక్షులు బుర్రి సురేష్,పంచుమర్తి శేషు,దావులూరి శ్రీనివాసరావు,బేతం శౌరీలు,్నాగరాజు, చిరుగురు సుశీల, పసుపులేటి గంగాధర్, మస్తాన్,కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జెడ్పి హైస్కూల్లో గురు పూజోత్సవం

**గుంటూరు విద్య,జూలై 11,ప్రభాతవార్త :** యనమదల జెడ్పి హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన మెగా పేరెంట్ -టీచర్స్ మీట్ కార్యక్రమంలో ప్రత్తిపాడు గ్రామంలో ఉన్న అక్షయ పబ్లిక్ స్కూల్లో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ ప్రత్తిపాడు మండల అధ్యక్షులు కఠారి దత్తప్రసాద్ సాగర్ అతిథిగా పాల్గొన్నారు.ఈ క్రమంలో దత్త ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్దిని,విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక,సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా ఉండాలన్నారు .ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు పిఎం పోషణ అభియాన్ మరియు మ్యూటేషన్ పథకం,సర్వశిక్ష మరియు సమగ్ర శిక్ష అభియాన్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అందించేటువంటి స్కూల్ బ్యాగ్,షూస్ వగైరా పిల్లలందర్ని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులతో మాట్లాడుతూ పూర్వకాలంలో గురుకులాల్లో విద్యాబోదన జరిగే విధానం గురుశిష్ యుల మద్య ఉండేటువంటి సంబంధ బాంధవ్యాలు,గురువులను ఏ విధంగా గౌరవించాలనే విషయాలను విద్యార్థులకు తెలియజేశారు.ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు పొంది,దేశ విదేశాల్లో గొప్పపేరును గడించిన అక్షయ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వెలగా శ్రీవల్లిని అభినందించి వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెదనందిపాడు మండల బిజెపి అధ్యక్షులు వెలగా గంగాధర్,పొనకల బాలసుబ్రహ్మణ్యం,గద్దె బ్రహ్మయ్య,చెన్నుపాటి నాగేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమేధాలో ఘనంగా మెగా పిటిఎం కార్యక్రమం

**గుంటూరు విద్య,జూలై 11,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శ్రీమేధా కామర్స్ జూనియన్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు.శ్రీమేధా విద్యాసంస్థల డైరెక్టర్ అన్నా నందకిషోర్ ముఖ్యఅతిధిగా విచ్చేయగా పూర్వ విద్యార్థులే సిప భరద్వాజ్,సిప కె.అయ్యప్ప లు పర్యవేక్షకులుగా వ్యవహరించగా, ప్రిన్సిపాల్ రామిశెట్టి వెంకట రమణదాస్ అధ్యక్షత వహించారు.ఈ మెగా తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశ కార్యక్రమంలో ముఖ్యఅతిధి అన్నా నందకిషోర్ మాట్లాడుతూ విద్యాప్రమాణాల పెరుగుదలకు ఉపాధ్యాయుల భోదనా పఠిమను పెంపొ ్దఇంచుకోవడానికి ఈ ఆత్మీయ సమావేశం దోహదపడుతుం దన్నారు. ప్రిన్సిపాల్ రామిశెట్టి వెంకట రమణదాస్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు




శ్రద్ధ వహించాలన్నారు.సమావేశానంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.కార్యక్రమంలో శ్రీమేధా కామర్స్ జూనియర్ కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దక్షిణ దేశాల స్వరాన్ని బలంగా వినిపించిన బ్రిక్స్ 17వ శిఖరాగ్ర సదస్సు

**గుంటూరు కల్చరల్,జూలై 11,ప్రభాతవార్త :** బ్రిక్స్ 17వ శిఖరాగ్ర సదస్సు దక్షిణ దేశాల స్వరాన్ని బలంగా వినిపించడం ముదావహమని ఈ సదస్సు ఆమోదించిన తాజా డిక్లరేషన్ ట్రంప్ కి ఒక హెచ్చరికను చేసిందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న మేధావులు,విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.సంస్థ కార్యాలయంలో బ్రిక్ ్స 17వ శిఖరాగ్ర సదస్సు - ఒక ఆశాకిరణం అన్న అంశంపై చర్చ జరిగింది.ఈ చర్చలో విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ బ్రెజిల్‌లోని రియో డి జనారో లో రెండు రోజుల పాటు నిర్వహించబడిన బ్రిక్స్ సదస్సు ఇచ్చిన డిక్లరేషన్ అగ్రరాజ్యం అమెరికాను కలవర పరిచిందన్నారు.తాజా డిక్లరేషన్ అమెరికా ఫస్ట్ అంటూనే సుంకాలపేరుతో ప్రపంచం పై పెత్తనం చేసేందుకు ట్రంప్ చేస్తున్న యత్నాలు ఇక సాగబోవన్న హెచ్చరిక కూడా చేసినట్లయిందన్నారు.ఆసియా,లాటిన్ అమెరికా, ఆఫ్రికా,పశ్చిమాసియా తదితర ప్రాంతాల్లోని 11దేశాలతో ప్రపంచంలో దాదాపు సగం జనాభాకు ప్రాతినిధ్యం వహించే బ్రిక్స్‌బలం దాని వైవిధ్యంలోనే ఉందన్నారు. విద్యావేత్త ఎస్.రవిబాబు మాటా్లడుతూ అమెరికా నేతృత్వంలోని జి-7దేశాల జిడిపి తగ్గుతుండగా బ్రిక్స్ కూటమిలోని దేశాల జిడిపి పెరుగుతుండడంతో అగ్రరాజ్యం మరింతగ ఆందోళన పడుతుందన్నారు.చర్చలో విశ్లేషకులు పి.భావన్నారాయణ,అధ్యాపకులు సుబ్బారెడ్డి, ఎ.వి.రామారావు తదితరులు ప్రసంగించారు.

## నేడు వైకాపా నియోజకవర్గ కార్యకర్తల సమావేశం

**పొన్నూరు, జూలై 11,ప్రభాతవార్త:** పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశంలో శనివారం సాయంత్రం చేబ్రోలు పరిమి సత్యనారాయణ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. సాయంత్రం



4గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని వైకాపా ఎంపిటీసిలు, పొన్నూరు, పెదకాకాని, చేబ్రోలు మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ కమిటి నాయకులు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపిటిసి సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, అభిమానులు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## నేడు విద్యుత్తు నిలిపివేత

**పొన్నూరు, జూలై 11,ప్రభాతవార్త:** పట్టణ, మండల పరిధిలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు పలు విద్యుత్ లైన్లకు మరమ్మత్తులు చేయాల్సి ఉందని ఎలక్ట్రికల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు. అందులో భాగంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ అంతరాయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

## ఇంటి స్థలాలకు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలి

**నూజెండ్ల, జులై10,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అందరికీ గృహాలు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో ఇంటి స్థలం లేని పేదలు సంబంధిత గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని మండల తహశీల్దార్ శుక్రవారం తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు పేదలకు అందించేందుకు



ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన చెప్పారు.

## నూజెండ్ల పిహెచ్‌సి నందు ఫ్లోరోసిస్‌పై శిక్షణ

**నూజెండ్ల, జులై10,ప్రభాతవార్త:** మండలకేంద్రమైన నూజెండ్ల ప్రాధమిక ఆరోగ్యం నందు ఫ్లోరోసిస్ వ్యాధి పట్ల అవగాహన శిక్షణ



కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌వోలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

## అధికారులకు శిక్షణ

**గురజాల, జూలై 11 ప్రభాతవార్త:** గురజాల పట్టణంలో శుక్రవారం బూత్ స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమంను



ఆర్డీవో మురళీకృష్ణ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కుటుంబరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదులు, పోలీసు అధికారులకు అభినందనలు తెలిపిన సీనియర్ సివిల్ జడ్జీ

**గురజాల, జూలై 11 ప్రభాతవార్త:** పట్టణంలోని కోర్టులో ఈనెల 5వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో అధికంగా రాజీ కేసులు పరిష్కారం కావడంతో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు శుక్రవారం కోర్టులో న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. అధికంగా కేసులు రాజీ చేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు. అలాగే సెప్టెంబరు 13వ తేదీన జరిగే జాతీయ



లోక్ అదాలత్‌కు కూడా సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, మందపాటి శ్రీనివాసరెడ్డి, షేక్ జానీబాషా, కలివెల ప్రభుదాసు, పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, కనకం ఆదినారాయణ, సుందర జ్ఞానమ్మ, జక్కా చెన్నకేశవరావు, ప్రసాదరావు, లింగరాజు, కర్రా చిన కోటేశ్వరరావు, నరసింహారెడ్డి, సుబ్బమ్మ, చల్లా తిరుమలేశ్వర రావు, అనిల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# సహోద్యోగి కుటుంబానికి అండగా నిలిచిన 2009 బ్యాచ్ కానిస్టేబుళ్లు

**బాపట్ల, జూలై11,ప్రభాతవార్త:** ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 2009 బ్యాచ్ కానిస్టేబుల్ బిల్లా రమేష్ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని నిశ్చయించుకున్న తోటి బ్యాచ్ పోలీస్ సిబ్బంది అందరూ కలిసి



రూ.1,58,500/ నగదు సమకూర్చారు. ఆ మొత్తాన్ని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మొయిన్ శుక్రవారం స్వయంగా వేటపాలెంలోని బిల్లా రమేష్ ఇంటి దగ్గరకు వెళ్లి వృద్ధాప్యంలో ఉన్న వాళ్ల అమ్మమ్మ గారిని పరామర్శించి నగదును అందజేసినారు. ఈసందర్భంగా డీఎస్పీ మొయిన్ మాట్లాడుతూ రమేష్ చిన్నతనంలోనే తల్లిని కోల్పోవడంతో క్లిష్ట సమయంలో ఆయన అమ్మమ్మ దాసరి సుబ్బులు తల్లి స్థానంలో ఉండి అన్ని బాధ్యతలను భుజాన వేసుకొని రమేష్ ను పెంచి పోషించిందన్నారు. రమేష్ అకాల మరణంతో కుటుంబం తీవ్ర శోకంలో మునిగిపోయింది. పరిస్థితిని గమనించి కష్టకాలంలో 2009 కానిస్టేబుల్ బ్యాచ్కు చెందిన రమేష్ మిత్రులు, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలన్న సంకల్పంతో స్వచ్ఛందంగా రూ.1,58,500/ నగదు సేకరించారు. ఆ మొత్తాన్ని జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు వేటపాలెం లోని బిల్లా రమేష్ ఇంటి దగ్గరకు వెళ్లి, ఆ మొత్తాన్ని వృద్ధాప్యంలో ఉన్న రమేష్ అమ్మమ్మ దాసరి సుబ్బులు కి అందజేసామన్నారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ సహోద్యోగుల మధ్య ఉన్న మానవతా విలువలు, సానుభూతి, అండగా నిలబడే భావన స్పష్టంగా వెల్లడైందని , ఇది ఇతర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ తుషార్ దూడి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 2009 బ్యాచ్ కు చెందిన కానిస్టేబుల్ లు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, జూలై 11 ప్రభాతవార్త :** పట్టణంలో శుక్రవారం శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు నాయకత్వంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని స్థానిక 31,32 వార్డులలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, పార్టీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి రవి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మన్నాన్‌షరీఫ్, గుదూరు శేఖర్, కూటమి నాయకులు రంగిశెట్టి రామకృష్ణ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వెంట ఉన్నారు. బరంపేటలో వేంచేసియున్న శ్రీ వినాయకస్వామి దేవాలయంలోనూ, జెండాచెట్టు వద్ద ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వానికి అండగా నిలవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విజ్ఞప్తి చేశారు.



**ప్రజావేదికలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే చదలవాడ...**

తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి, పట్టణంలోని వివిధ వార్డుల నుండి తమ సమస్యల పరిష్కారంకొరకు 62 వినతిపత్రాలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు ప్రజలు అందించారు. అధికారులు సకాలంలో ఆ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులకు ఆదేశాలిచ్చారు.

# ఆది ఆంధ్ర కోపరేటివ్ సొసైటీ నూతన కమిటీ అధ్యక్షునిగా గుండాల విజయ్ డేవిడ్ ఏకగ్రీవం

**బాపట్ల, జూలై11,ప్రభాతవార్త:** దగ్గుమల్లివారి పాలెం ఆదిఆంధ్ర కో ఆపరేటివ్ ఫార్మింగ్ సొసైటీ నూతన కమిటీ అధ్యక్షుడిగా గుండాల విజయ్ డేవిడ్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాపట్ల పట్టణంలోని ఎపిఐ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సొసైటీ నూతన కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసాయి.ఎన్నికల అధికారిగా లలిత కుమారి బాధ్యతలు నిర్వహించారు. గత మూడు సార్లు ప్రెసిడెంట్ గా గెలిచిన గుండాల విజయ్ డేవిడ్ రాజు తిరిగి మరళా నాల్గవ సారి ఏకగ్రీవంగా ప్రెసిడెంట్ గా గెలుపొందటం పై సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు పర్యాలు కూడా ఇదే ప్యానల్ కమిటీ సభ్యులు కొనసాగడం విశేషం. 2025 సంవత్సరానికి ఆదిఆంధ్ర సొసైటీ నూతన కమిటీ ఎన్నికలను కే లలిత కుమారి ఎన్నికల అధికారిగా ఎన్నికలను నిర్వహించారు.సొసైటీలో మొత్తం 177 మంది సభ్యులు ఉండగా ఎన్నికలో 160 మంది సభ్యులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొన్నారు. ఆది ఆంధ్ర సొసైటీ నూతన కమిటి చైర్మన్ విజయ్ డేవిడ్ రాజ్, వైస్ ప్రెసిడెంట్ బైనీడు వెంకటస్వామి, డైరెక్టర్లు బిల్లా ఎడ్విన్ రాజు, కూచిపూడి పరిశుద్ధం, సలగల ఏసుమ్మ, మేకల సత్యానందం లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి లలిత కుమారి చేతుల మీదుగా నూతన ప్రెసిడెంట్ గుండాల



విజయ్ డేవిడ్ రాజ్ కమిటీ సభ్యులు గెలుపు పత్రాన్ని అందుకున్నారు.

**న్యాయం గెలిచింది నూతన కమిటీ అధ్యక్షులు విజయ్ డేవిడ్‌రాజు:** ఆది ఆంధ్ర సొసైటీ ఎన్నికల్లో న్యాయం గెలిచిందని నూతన కమిటీ అధ్యక్షులు విజయ్ డేవిడ్ రాజు అన్నారు.సొసైటీ లో అర్హులైన,కమిటీ సభ్యులకు స్థలాల పట్టాలను కేటాయించే విధంగా అన్ని సిద్ధం చేయడం జరిగిందన్నారు.అదే విధంగా ప్రభుత్వం బైపాస్ వేయడానికి తీసుకున్న సొసైటీ భూమికి అందించిన నష్ట పరిహారం కూడా అందరికి సమానంగా అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. కాని సొసైటీలోని కొందరు స్వార్ధ పరులు,కుంతంత్రాలు పన్ని కమిటి సభ్యులకు లబ్ది చేరకుండా చేయాలనే ఉద్దేశ్యంతో పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేశారన్నారు. అయినప్పటికి నూతన కమిటి ఎన్నికల్లో న్యాయం గెలిచిందని, సభ్యులందరికి సమ న్యాయం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# జగన్ పాలనలో రూ.3500కోట్లు మద్యం కుంభకోణం

**-అసలు గజదొంగ బయటపడే రోజు దగ్గర్లోనే ఉంది**

**-ఏపిఐడిసి చైర్మన్ దేగల ప్రభాకర్**

**గుంటూరు క్రైమ్, జూలై 11,ప్రభాతవార్త :** జగన్‌రెడ్డి పాలనలో జరిగిన మద్యం కుంభకోణం విషయంలో పుట్టలోనుంచి పాములు బయటకు వచ్చినట్లు రోజుకో కొత్త అంశం బయటపడుతోందని ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు.శుక్రవారం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఏపిఐడిసి చైర్మన్ ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. మద్యం కుంభకోణంలో జరిగిన సంఘట నలను చూసి ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారన్నారు.



మద్యంలో జరిగిన అవినీతి కి సంబంధించి నాడు టిడిపి చేసిన వ్యాఖ్యలకు సాక్ష్యాలు నేడు ఒక్కొక్క టిగ వెలుగులోకి వస్తున్నాయన్నారు.తలపండిపోయిన వైకాపా ముఠా,మద్యంలో అంతర్జాతీయ కుంభకోణానికి పాల ్పడ్డారన్నారు.దశలవారీగా మద్యపాన నిషేదమంటూ 2019లో అధికారం లోనికి వచ్చిన జగన్‌రెడ్డి దశలవారీగా అవినీతికి పాల్పడ్డారన్నారు.జగన్ నాసిరకం మద్యం ద్వారా రాష్ట్రంలో లక్షల మంది అనారోగ్యం పాలయ్యారని,వేలమంది ప్రాణాలను తీసి మహిళల మాంగల్యాలను తెంచారని మండిపడ్డారు.మనీ లాండరింగ్ చేయడంలో వైసీపీ దొంగల ముఠా మాస్టర్స్ చేశారన్నారు.మద్యం సరఫరా తయారు కంపెనీల నుంచి రూ.3500కోట్లను ముడుపుల రూపంలో వైసీపీ దొంగల ముఠా దోచుకున్నారని ఆరోపించారు.

# గ్రామాభివృద్ధి,ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**-గుంటూరు..కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్**

**కొల్లిపర, జూలై 11 ప్రభాతవార్త:** గ్రామాభివృద్ధి..ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని గుంటూరు..కృష్ణా



జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని జెముడుబాడు గ్రామంలో సుపరిపాలన తొలిఅడగు కార్యక్రమం నాయకులతో కలసి నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ పేద ప్రజలు జీవన విధానం మెరుగుపర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు.పేద ప్రజలను అన్ని విధాల ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.నాడు సూపర్‌సిక్స్ లో ఏమైతే చెప్పాయో వాటిని అన్నింటినీ ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.దానిలో భాగంగా ఆగష్టు 15 వతేదీ నుండి ప్రతి మహిళకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించటానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీను నెరవేరుస్తామన్నారు.పెన్షన్‌ను రూ.4 వేలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి,టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు,ఆళ్ల వీరారెడ్డి,బొల్లు యోగా నందచటర్జీ,కొండూరు బాబూరావు,గోవతోటి పౌలేష్,పసుపులేటి కృష్ణబాబు,సిద్దెల రత్న బాబు,గళ్ళే గంగాధరరావు,సిద్దెల పోతయ్య, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కారంపూడి పంచాయతీ నీటి సరఫరా ఉద్యోగి ఖాసిం మృతికి సంతాపం

**కారంపూడి, జులై 11 ప్రభాతవార్త:** కారంపూడి పంచాయతీ నీటి సరఫరా కాంట్రాక్టు ఉద్యోగి షేక్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం



తెలుసుకున్న సర్పంచ్ బాలునాయక్ సరస్వతిబాయి, పంచాయతీ సెక్రటరీ కసిన్యానాయక్ తోటి సిబ్బంది మృతుని నివాసానికి వెళ్లి ఖాసిం మృతి పట్ల సంతాపం ప్రకటించి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుని కుటుంబానికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు బొమ్మిన శేషగిరి, మాజీ పట్టణ అధ్యక్షులు కటికల బాలకృష్ణ, టీడీపీ నాయకులు తండా మస్తాన్‌జానీ, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వర్సిటీలో ఏబివిపి సదస్సు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై11, ప్రభాతవార్త:** వర్సిటీలో శుక్రవారం ఏబివిపి ఆధ్వర్యంలో ఎమర్జెన్సీకి 50ఏళ్ళు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఏబివిపి జాతీయ కార్యదర్శి శ్రవణ్ బి. రాజ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హక్కుల విలువలను గుర్తుచేసే ఘట్టంగా 1975లు విధించిన ఎమర్జెన్సీ నిలుస్తుందన్నారు. భారతరా జ్యాంగంలోని ఆర్టికల్ 360తో ఆర్థిక వ్యవస్థ, న్యాయ వ్యవస్థపై ఆంక్షలు విధించారన్నారు. నేటితరం విద్యార్థులు వాటిని అవగాహన చేసుకోవాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్‌కుమార్ మాట్లాడు తూ ఎమర్జెన్సీ చరిత్ర కాదని అది ఒక బోధ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతీ పౌరుడులో చైతన్యం రావాలని పేర్కొన్నారు ఏబివిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట్ గోపి మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛను అణచివేత కు ఎమర్జెన్సీ ఒక కారణంఅన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన దాసరి రమాకాంత్, ఏబివిపి వర్సిటీ నాయకులు హేమంత్‌రామ్, వంశీ, రాష్ట్ర నాయకులు గంగాధర్, మోహన్, శివగణేష్, తదితరులు పాల్గొన్నారు.



# ఫ్లోరోసిస్ వ్యాధి సర్వేపై శిక్షణ

**రాజుపాలెం, జూలై 11 ప్రభాతవార్త :** రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు శుక్రవారం ఫ్లోరోసిస్ వ్యాధి సర్వే శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గిరిధర్‌కుమార్ ఆధ్వర్యంలో రాజుపాలెం, చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శిక్షణలో పాల్గొన్నారు. ఫ్లోరోసిస్ వ్యాధి, భూగర్భ



జలాలు, ఆహార పదార్థాలు, టీ, కాఫీ, టూత్ పేస్ట్‌లలో ఎక్కువగా ఉంటుందన్నారు. పిల్లల దంతాలు పసుపు రంగంలో మారుతాయన్నారు. కీళ్ళ వ్యాధులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రవితేజ నాయక్, వసంతరావు, అలేఖ్య, లక్ష్మిదుర్గ, శివమాధవి, జోత్స్న పాల్గొన్నారు.

# చంద్రన్న పాలనలో అభివృద్ధి శరవేగంగా ముందుకు : గన్నమనేని శ్రీనివాసరావు

**సత్తెనపల్లి, జూలై 11 ప్రభాతవార్త :** చంద్రన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం శరవేగంగా ముందుకు వెళ్తుందని పల్నాడు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గన్నమనేని



శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 13వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే పెన్షన్‌ను పెంచి అందిస్తున్నట్లు తెలిపారు. అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారన్నారు. చెత్తపై పన్ను రద్దు చేశారన్నారు. నిరుద్యోగులను ఉద్యోగాలు ఇచ్చారన్నారు. తల్లికి వందనం ప్రతి ఒక్కరికీ అందించామన్నారు. ఉచిత గ్యాస్ సిలెండర్లు ప్రతి ఒక్క ఇంటికి చేరాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చుక్కపల్లి శ్రీనివాసరావు, గన్నమనేని భారతీ, పి.స్రవంతి, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**మాచర్ల, జులై 11 ప్రభాతవార్త:** ప్రతి నెలా రెండో శనివారం విద్యుత్తు శాఖ మరమ్మతులు చేపడుతుంది. అందులో భాగంగా శనివారం పట్టణంలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు ఏఈ తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 11 కేవీ లైన్లు మెయింటినెన్స్ పనుల నిమిత్తం మాచర్ల పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించవలసిందిగా విద్యుత్తు శాఖ అధికారులు కోరారు.

# మాతాశ్రీ హాస్పటల్‌లో అత్యాధునిక 3-డి ల్యాప్రోస్కోపి యూనిట్ ప్రారంభం

**నరసరావుపేట, జూలై 11 ప్రభాతవార్త :** మాతాశ్రీ హాస్పటల్‌లో శుక్రవారం ఛైర్మన్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అత్యాధునిక 3డి/4డి ల్యాప్రోస్కోపి యూనిట్‌ను ఏర్పాటు చేశారు. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆధునిక యూనిట్‌ను ప్రారంభించారు. డాక్టర్ రామచంద్రారెడ్డితో ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్సకు ఆధునిక ల్యాప్రోస్కోపిక్ యూనిట్ ద్వారా ఏ విధంగా నాణ్యమైన వైద్యసేవలు రోగులకు అందుతాయో ప్రత్యక్షంగా ఎమ్మెల్యే అరవింద్‌బాబు తెలుసుకున్నారు. పల్నాడు జిల్లాకు అత్యాధునిక వైద్యసేవలను మాతాశ్రీ హాస్పటల్ ద్వారా అందజేస్తున్న డాక్టర్ రామచంద్రారెడ్డిని అభినందించారు. తక్కువ ఖర్చుతో పేద ప్రజలకు వైద్యసేవలను అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు రామచంద్రారెడ్డికి సూచించారు. తొలుత శాసనసభ్యులు డాక్టర్ అరవింద్‌బాబుకు డైరెక్టర్ యేలూరి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికి సత్కరించారు.

# ఇంటి నివేశన స్థలాలకై అర్జీల స్వీకరణ : తహశీల్దార్

**నరసరావుపేట టౌన్, జూలై 11 ప్రభాతవార్త :** మండలంలో ఇంటి నివేశన స్థలాలకై అర్జీలను స్వీకరిస్తున్నామని తహశీల్దార్ వేణుగోపాల్ శుక్రవారం తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని గ్రామాలలో, పట్టణంలో నివాసితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ వేణుగోపాల్ కోరారు. అదే విధంగా ఇంటి నివేశన స్థలం లేనివారు, అర్హులు సంబంధిత వార్డు, గ్రామ సచివాలయాలలో అర్జీలను అందించాలని తహశీల్దార్ వేణుగోపాల్ సూచించారు.

# ప్రభుత్వ హాస్టల్‌లో ఆయుష్ వైద్య శిబిరం

**రాజుపాలెం, జూలై 11 ప్రభాతవార్త :** మండలంలోని బిసి హాస్టల్ నందు ఆయుష్ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై, ఆరోగ్యంపై అవగాహన సదస్సు జరిగింది. వర్షాకాలంలో కాచి



చల్లార్చిన నీటిని త్రాగాలన్నారు. అలాగే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమకాటు వలన వచ్చే మలేరియా, పైలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ తదితర వ్యాధులపై అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, బుల్లిబాబు, రమేష్, వీరాంజనేయులు, వెంకటరమణ, నరసింహారావు, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

# ఏఎంరెడ్డి కళాశాలలో క్వాంటమ్ కంప్యూటేషన్

**నరసరావుపేట, జూలై 11 ప్రభాతవార్త :** ఏఎంరెడ్డి కళాశాలలో క్వాంటమ్ కంప్యూటేషన్ అనే అంశంపై శుక్రవారం రెండు వారాల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభించారు. కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి -శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ సి.హెచ్. మల్లికార్జున్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖులు లక్ష్మికుమార్‌రెడ్డి మాట్లాడుతూ కృత్రిమ మేదస్సుతో (ఏఐ), యంత్ర అభ్యాసం ప్రాముఖ్యతను తెలియజేశారు. భవిష్యత్తు తరం పరిశోధనలకు క్వాంటమ్ కంప్యూటేషన్ కీలక మార్గంగా నిలుస్తుందన్నారు. ఫ్యాకల్టీ తమ విద్యా సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కృత్రిమ మేదస్సుతో భవిష్యత్తు విద్యా రంగానికి ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మల్లికార్జున, కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# బసివిరెడ్డి సేవలు మరువలేనివి

**-రిటైర్డు ప్రిన్సిపాల్ వింతా మోహనరెడ్డి**

**తూములూరు (కొల్లిపర) జూలై 11 ప్రభాతవార్త:** మండలంలో పలు పదవులలో పనిచేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన బసివిరెడ్డిని మరువలేవని రిటైర్డు ప్రిన్సిపాల్ వింతా మండలం ప్రధమ అధ్యక్షుడిగా, తూములూరు గ్రామ సర్పంచ్ గా,తెనాలి మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడుగా పనిచేసి పలువురు మన్ననలు పొందారని కొనియాడారు. మండలంలో



మోహనరెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం మండల పరిధిలోని తూములూరు గ్రంథాలయం సెంటరులో గుడిశా చిన బసివిరెడ్డి 27 వర్ధంతి ఘనంగా జరిపారు.ముందుగా బసివిరెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బసివిరెడ్డి పార్టీలకతీతంగా అభివృద్ధి చేసారని ఈ సందర్భంగా గుర్తు చేసారు.యువత ఆయన ఆశయాలలో ముందకు నడవాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో వింతా రాఘవరెడ్డి,అడపా నారాయణరెడ్డి,బద్దిగం శ్రీనివాసరెడ్డి,ఆరుమళ్ళ శివారెడ్డి,కొల్లి రాఘవరెడ్డి,చాగంటి రాఘవరెడ్డి,బేతాళ భూషణం తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**నరసరావుపేట టౌన్, జూలై 11 ప్రభాతవార్త :** పట్టణంలోని వివిధ ప్రాంతాలలో, మండల పరిధిలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ఎల్.వి.ప్రసాదరావు శుక్రవారం తెలియజేశారు. రెండవ శనివారాన్ని పురస్కరించుకొని విద్యుత్‌శాఖ ద్వారా మెరుగైన సేవలను వినియోగదారులకు అందించేందుకు మరమ్మత్తులు నిర్వహించడం జరుగుతుందన్నారు. నరసరావుపేటలో 220 కె.వి.సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మత్తు పనులు చేపడతామన్నారు. ఇదే సమయంలో డి-1, డి-2, డి-3 సెక్షన్ల పరిధిలో 33 కె.వి., 11 కె.వి.లైన్లు, ట్రీ కటింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాదరావు తెలియజేశారు.

# హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో హెపటైటిస్ నిర్ధారణ పరీక్షలు

**నరసరావుపేట, జూలై 11 ప్రభాతవార్త :** హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో హైరిస్క్ వ్యక్తులకు హెపటైటిస్ -బి, సి నిర్ధారణ పరీక్షలను



శుక్రవారం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెపటైటిస్ పరీక్షల్లో ఇబ్బందులు ఉన్న వారికి వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్ మాట్లాడుతూ హెచ్‌ఐవితో పాటు ఇతర వైరల్ ఇనెఫెక్షన్‌లను అరికట్టడంలో ఈ కార్యక్రమం ముందడుగు అని తెలిపారు. దీనికి ఏ విధంగా భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్ఎన్ కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమావేశం

**నరసరావుపేట, జూలై 11 ప్రభాతవార్త :** పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో తల్లిదండ్రులు, అధ్యాపకులతో ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల సెక్రటరీ నాగసరపు సుబ్బరాయగుప్తా మాట్లాడారు.



ఇంటర్మీడియట్ క్యాంపస్‌కు సంబంధించి కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్నటువంటి వసతులను తెలియజేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదిగేందుకు ఎస్ఎస్ఎన్ కళాశాలలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలియజేశారు. ఎందరో విద్యార్థులు కళాశాలలో చదువుకొని ఉన్నత స్థానాలలో నిలిచారన్నారు. రాజకీయాలు, వ్యాపార, విద్యా రంగాలలో అద్భుతమైన విజయాలు సాధించిన గొప్పవాళ్ళను అందించిన చరిత్ర ఎస్ఎస్ఎన్‌కళాశాలకు ఉందని ఈ సందర్భంగా నాగసరపు సుబ్బరాయగుప్తా తెలియజేశారు. కళాశాల కమిటీ సభ్యులు బత్తుల మురళీ, ప్రిన్సిపాల్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాససాయి తదితరులు పాల్గొన్నారు.

# రాజుపాలెం పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం

**రాజుపాలెం, జూలై 11 ప్రభాతవార్త :** కేదారి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, జనసేన నాయకులు కేదారి రమేష్ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామ టిడిపి అధ్యక్షులు పి.అంకమ్మరావు కార్యక్రమంలో పాల్గొని



మాట్లాడుతూ కేదారి చారిటబుల్ ట్రస్ట్ ప్రతి ఏటా పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు ఇస్తున్నామన్నారు. పూర్వ విద్యార్థిగా పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలియజేశారు. విద్యాశాఖామంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయని కేదారి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిబండ్ల అశోక్, పగడాల శ్రీనివాసరావు, సకినాల వలరాజు, చొక్కా శ్రీనివాసరావు, వాసా వెంకటేశ్వర్లు, జంగం రాజేశ్వరరావు, బి.రామారావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# 13న అవగాహనలో ఆరోగ్యసభ

**గుంటూరు కల్చరల్,జూలై 11,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ గత 15సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈవారం ఫిజియోథెరఫీ నేత్ర వ్యాధులపై సమగ్ర అవగాహన సభ ఏర్పాటు చేసింది.జూలై 13ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో జరిగే ఆరోగ్యసభలో సీనియర్ ఫిజియోథెరఫిస్టు డాక్టర్ లక్ష్మిలావణ్య,నేత్రవైద్య నిపుణులు డాక్టర్ టి.పావని ప్రధానవక్తలుగా పాల్గొంటారన్నారు.

# వరదల సమయంలో లంకవాసులు జాగత్రలు పాటించాలి

**-ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బబ్లూ బిశ్వాస్**

**కొల్లిపర,జూలై 11 ప్రభాతవార్త:** లంక గ్రామాల ప్రజలు వరదలు వచ్చినప్పుడు తగిన జాగ్రత్తగా ఉండాలని ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బబ్లూ బిశ్వాస్ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని అన్నవరపు లంకలో ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు వరదలు



వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్రలపై అవిగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా బబ్లూ బిశ్వాస్ మాట్లాడుతూ వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలు అధికారులకు తప్పనిసరిగా సహకరించాల న్నారు.తహశీల్ధార్ గుమ్మడి సిద్దార్ధ మాట్లాడుతూ వరదల సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళటం మంచిదన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ తోడేటి రాజేశ్వరి,ఆర్ఐ వంశీకృష్ణ,వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ సాయం లక్షలాది పేద కుటుంబాలలో వెలుగులు నింపుతుంది

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,జులై11,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి సాయం లక్షలాది పేద కుటుంబాలలో వెలుగులు నింపుతుందని, ప్రాణాంతక వ్యాధులతో బాధపడేవారికి నాణ్యమైన వైద్యసేవలు అందిస్తుందని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం ప్రత్తిపాటి నివాసంలో 54మంది లబ్దిదారులకు రూ 35.17లక్షల విలువైన చెక్కులను అందించారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండేవారు అనారోగ్య సమస్యలతో మంచం పడితే, ఆకుటుంబాలు దిక్కుతోచని స్థితిలో చేరుకుంటాయని అన్నారు. పేదల కన్నీళ్లు, కష్టాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిసిన వ్యక్తి కనుకే సిఎంఆర్ఎఫ్ ద్వారా పేదలను ఆదుకుంటున్నారని అన్నారు. జగన్ తాను ముఖ్యమంత్రి కాగానే సిఎంఆర్ఎఫ్ పంపిణీని నిలిపేసి, పేదల ఉసురుపోసుకున్నాడని ప్రత్తిపాటి చెప్పారు. ముఖ్యమంత్రి సహాయనిధి సొమ్మునుకూడా పేదలకు ఇవ్వడానికి జగన్‌కు మనసు రాకపోవడం నిజంగా దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి



నాయకులు షేక్ కరిముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, జవ్వాజి మదన్‌మోహన్, మద్దుమాల రవి, మద్దిబోయిన శివ, వివిధ హోదాలలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గుండె గుండెకు ఆరోగ్య భద్రత

**-సీఎం రిలీఫ్ ఫండ్ తో పేదలకు ఆపన్నహస్తం**
**-గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్**
**-30 మందికి రూ.33 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**గుంటూరుతూర్పు,జులై11,ప్రభాతవార్త:** గుండె గుండెకు ఆరోగ్య భరోసా దొరికింది. అనారోగ్యంతో ఆస్పత్రి పాలైన అభాగ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపన్న హస్తం తోడై నిలిచింది. అనుకోని ఆపద చుట్టుముడితే సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ రూపంలో తమ కష్టం తీరిందనే ఓదార్పు ప్రతి గుమ్మాన్ని తాకింది. గుంటూరు తూర్పు



నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ నిధి పేదలకు పెన్నిధిగా మారింది. నియోజకవర్గంలో గురువారం స్థానిక శాసనసభ్యుల వారి కార్యాలయంలో 30 మందికి రూ.32,45,601 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని ప్రాణదీపమై సీఎం రిలీఫ్ ఫండ్ కాపాడుతోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తోందని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నిరుపేదల ఆరోగ్యాన్ని కాపాడుతున్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు. జూలై నెలలో ఎల్ ఓసీల ద్వారా పేద ప్రజల ఆరోగ్యానికి రూ.70,84,174 మంజూరు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ తమ కుటుంబాలు సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ కు రుణపడి ఉంటాయని అన్నారు. అడిగిన వెంటనే దేవుడిలా తమకు సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు ఇప్పించారని ఈ సందర్భంగా ఉద్వేగంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాసరావు, మహంకాళి నరసింహారావు, వేల్చూరి కిరణ్, ఫటాన్ జమీర్, పఠాన్ మోహమ్మదా, గుడిపల్లి వాణి, ఐలా శ్రీనివాసరావు, కోటా పిచ్చిరెడ్డి, నాయుడు మధు, గంట మోళిక,మోహమ్మద్ హఫీజ్, నాగేశ్వరరావు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## పెదనందిపాడు వరగాని విద్యుత్తు సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు నేడు విద్యుత్ బంద్

**పెదనందిపాడు జూలై 11 (ప్రభాతవార్త)** పెదనందిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.11 కె.వి. విద్యుత్ లైన్ ల మరమ్మత్తులు మరియు ట్రీ కటింగ్ పనుల నిమిత్తం విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని.విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ వీరాంజనేయులు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించవలసినదిగా వారు విజ్ఞప్తి చేశారు.

## పెదనందిపాడు నూతన మండల విద్యాశాఖ అధికారిగా కెనడి

**పెదనందిపాడు జూలై 11 (ప్రభాతవార్త)** పెదనందిపాడు మండల నూతన విద్యాశాఖ అధికారి గా శుక్రవారం కె ఎఫ్ కెనడి పదవి బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా విద్య వనరుల కేంద్రం సిబ్బంది వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసిన ముద్దన శ్రీనివాసరావు. తాను ప్రధానోపాధ్యాయులుగా గతంలో పనిచేసిన పాలపర్రు శ్రీ నరసింహున్నత జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా మళ్లీ నేడు బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు కమిటీ సభ్యులు నేటి విద్యార్థులు వారికి ఘనంగా స్వాగతం పలికారు.

## మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలి

**-ఎంఈవో సాల్మన్‌రాజు**

**కొల్లిపర,జూలై 11 ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంఈవో సాల్మన్‌రాజు పేర్కొన్నారు.శుక్రవారం మండల పరిధిలోని తూములూరు,కొల్లిపర ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ నిర్వహించి రికార్డులు..హాజరు పట్టీలు పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన



సూచనలు. సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూ..విద్యార్థుల యొక్క పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

## అత్తలూరులో ఫ్రైడే డ్రైడే

**అమరావతి, జూలై 11 ప్రభాతవార్త :** మండలంలోని అత్తలూరు గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం ఉదయం వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి పరిసరాలు పరిశీలించారు. దోమలు



వ్యాప్తిచెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీహెచ్ఓ మనోహర్ తెలిపారు. రోజుకు ఒక గ్రామాన్ని పరిశీలించి ప్రజలకు సూచనలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ స్వర్ణలత, ఎంపిహెచ్ఎ రామారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎదకూరపాడులో సుపరిపాలనలో తొలి అడుగు

**పెదకూరపాడు, జూలై 11 ప్రభాతవార్త :** మండలంలోని పెదకూరపాడు గ్రామంలో శుక్రవారం 167వ బూత్‌లో, అబ్బరాజుపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.



ఈ సందర్భంగా బ్రహ్మయ్య ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపూజ ఉత్సవాలు

**గుంటూరు కల్చరల్,జూలై 10,ప్రభాతవార్త :** స్థానిక లక్ష్మీపురంలోని శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం, శ్రీ త్యాగరాజ కళావేదికపై సుభగాత్రి ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు బీరక సురేష్‌బాబు ఆధ్వర్యంలో గురుపూజోత్సవాలు జరిగాయి.కార్యక్రమానికి సభాధ్యక్షులుగా సలహాదారు శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం నేతి విశ్వేశ్వరరావు,ముఖ్యఅతిథిగా అసోసియేట్ ప్రొఫెసర్,డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజియోలజీ,జిఎంసీ,డాక్టర్ ముమ్మలనేని నీరజ,వల్లూరి కృష్ణకిషోర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు.తొలుత గురుపూజోత్సవంలో భాగంగా మహాదేవు లక్ష్మీనారాయణ రాజు ప్రశిష్య బృందంచే మృదంగ లయ విన్యాసం జరిగింది.సుభగాత్రి అకాడమీ విద్యార్థినులచే జరిగిన నృత్యప్రదర్శన కళాభిమానులను ఆకట్టుకుంది.అనంతరం లెక్చరర్ జి.వి.ఆర్ గవర్నమెర్ కాలేజీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్,విజయవాడ పారుపల్లి సుబ్బరాయ ఫాల్గుణచే పంచతత్వం,కోనకోల్, మృదంగం ,కంజీర,ఘటం, మోర్సింగ్,లయవిన్యాసం సంగీతాభిమానులను అలరించింది.

## అన్నవరం,వల్లభాపురం ఫీడర్ పరిధిలో విద్యుత్తు మరమ్మత్తులు నిమిత్తం విద్యుత్తు నిలిపివేత

**కొల్లిపర,జూలై 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అన్నవరం, వల్లభాపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు నిమిత్తం విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వల్లభాపురం ఫీడర్ పరిధిలో అత్తలూరివారిపాలెం,వల్లభాపురం గ్రామాల్లో అన్నవరం ఫీడర్ పరిధిలో తూములూరు,బొమ్మువానిపాలెం,హనుమాన్‌పాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.విద్యుత్ వినియోగదారులు సహకరించకాలని కోరారు.

## రేషన్‌కార్డులకోసం వచ్చిన ప్రతి ధరఖాస్తును పరిశీలించాలి

**-తహాశీల్దార్ సిద్ధార్థ**


**కొల్లిపర,జూలై 11 ప్రభాతవార్త:** కొత్త రేషన్‌కార్డుల కొరకు పెట్టుకున్న ప్రతి ధరఖాస్తును పరిశీలించాలని తహాశీల్ధార్ గుమ్మడి సిద్దార్థ అన్నారు.శుక్రవారం



స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో విఆర్వోలు,విలేజ్ సర్వేయర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిద్దార్థ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూచుకోవాలన్నారు.సమావేశంలో డిప్యూటి తహాశీల్దార్ రాజేష్,మండల సర్వేయర్ శ్రీనివాసరావు,ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ మౌలిక సదుపాయాల రూపకల్పన కోసం సిపిఐ ప్రజా పోరాటం

**పెదకూరపాడు, జూలై 11 ప్రభాతవార్త :** గ్రామీణ మౌలిక సదుపాయాల రూపకల్పన కోసం సిపిఐ ప్రజా పోరాటం చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతి అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా



ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు తదితరులతో కలిసి ఆయన సిపిఐ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. నాయకులు చెన్నకేశరావు సమావేశానికి అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాపాడటంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతుగంటి నాగేశ్వరరావు, వెంకట్రావు, సైదా, మస్తాన్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# 16 గ్రామాల పొగాకు రైతులకు మేలు గలిగేలా పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి : రైతు సంఘం డిమాండ్

**పెదనందిపాడు జూలై 11 (ప్రభాతవార్త)** పెదనందిపాడు లో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాకుమాను లో ఏర్పాటుచేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నాయకులు నల్లమోతు రాజేంద్ర,



పసుపులేటి శేషగిరిరావు, మదమంచి అప్పారావు లతో కలిసి సందర్శించారు. పెదనందిపాడు మండల గ్రామాల లో పొగాకు మండేలను సందర్శించిన అనంతరం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అజయ్ కుమార్ మాట్లాడుతూ.కాకుమాను మండలంలో పొగాకు సాగుచేసిన ఐదు గ్రామాల రైతులవి మాత్రమే కాకుమాను కొనుగోలు కేంద్రంలో కొంటున్నారని మార్క్ ఫెడ్ అధికారులు తెలియజేశారు. పెదనందిపాడు మండలంలో 16 గ్రామాలలో పొగాకు సాగు చేశారని కానీ, మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం




సమంజసం కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, రైతులు పెదనందిపాడులో రాస్తారోకో సందర్భంగా కూడా అదే మాట చెప్పారని తెలిపారు. ప్రత్యేకించి అబ్బినేనిగుంటపాలెం గ్రామంలో 4 వేలు క్వింటాళ్ల పొగాకు స్టాకు ఉందని, గ్రామంలో పొగాకు అమ్ముడుపోక రైతు ఆత్మహత్యాయత్నం చేసుకోవడం వంటి దుర్భల పరిస్థితులు ఎదురయ్యాయని ఏబీ పాలెం రైతులు అజయ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. పెదనందిపాడు లో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోతే ఆందోళనకు సిద్ధపడతామని అజయ్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొగాకు రైతులు మదమంచి నాగేశ్వరరావు, మాకినేని శ్రీకాంత్, మదమంచి రంగయ్య, మదమంచి మధుసూదన్ రావు, మాకినేని వెంకటేశ్వర్లు, మదమంచి శ్రీనివాసరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, జాగర్లమూడి కోటేశ్వరరావు, మాకినేని సాంబశివరావు, వేజెండ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని రైతులకు న్యాయం జరిగే వరకూ దీక్షలు

## ఏఎస్ఆర్‌పార్టీ అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు

**మంగళగిరి, జులై 11, ప్రభాతవార్త:** అమరావతి రాజధాని పరిధిలోని గ్రామంలో నిడుముక్కల గ్రామంలో రాజధాని రైతులకు అండగా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని రైతుల కోసం చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి రెండు అంకెల సంఖ్యకు చేరుకున్నాయని, మూడంకెలకు చేరుకుంటే రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయని అన్నారు.2014 టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టి అమరావతి రాజధాని పేరుతో 33,000 ఎకరాలు రైతుల నుండి సహకరించి ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. అనంతరం వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజధానిని నిర్వీర్యం చేసిందని అన్నారు. అమరావతి లోనే రాజధాని నిర్మాణం జరగాలని రైతులు ఐదు సంవత్సరాలు నిరంతరాయంగా పోరాటం చేసినా జగన్మోహన్ రెడ్డి పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి అమరావతి రాజధానిని అభివృద్ధి చేయకుండా రెండో ల్యాండ్ పోలింగ్ అంటూ రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదని అయితే రైతులకు ఎకరానికి కోటి రూపాయలు చెల్లించి 1250 గజాలు భూమి ఇవ్వాలని వారు



ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ప్రతినెల పదివేల రూపాయలు చెల్లించే విధంగా ప్రభుత్వ అమలు చేయాలని వారు కోరారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించేంతవరకు పార్టీలకు అతీతంగా రైతులతో కలిసి రిలే నిరాహార దీక్షను కొనసాగిస్తామని చెప్పారు.రెండో దశ ల్యాండ్ పూలింగ్ నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వం రైతులకు ఎకరానికి కోటి రూపాయలు లేదా గవర్నమెంట్ విలువ ప్రకారం నాలుగు శాతం మరియు 1250 గజాల భూమి ఇవ్వాలని జంజనం కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ల్యాండ్ పూలింగ్ వల్ల నష్టపోయిన రియల్ ప్రమోటర్స్ కు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# జీవవైద్యంగా రాజధాని అమరావతి

## పర్యావరణకార్యశాలలో ఏడీసీ సీఎండీ శ్రీమతి లక్ష్మీపార్థసారథి

**విజయవాడ,జులై11,ప్రభాతవార్త:** జీవవైద్యంతో అలరారే విధంగా ప్రజా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్పర్సన్/మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి డి.లక్ష్మీపార్థసారథి వారు పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో పచ్చదనం అభివృద్ధిపై విజయవాడలోని ఓ హోటల్లో ఏడీసీ, ఏపీ సీఆర్డీఏ, వీఎంసీ, ఏపీ జీబీసీ, తాడేపల్లి,మంగళగిరి మున్సిపాలిటీలోని ఉద్యానవన అధికారులు, సిబ్బందికి ఒకరోజు కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఎండీ మాట్లాడుతూ రాజధాని అమరావతిని జీవవైద్యంతో కూడిన అతిసుందరంగా నిర్మించడమే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు



నాయుడి గారి సంకల్పం అన్నారు. ముఖ్యమంత్రి వారి ఆలోచనలను సాకారం చేసేందుకు దేశంలోని ప్రముఖులైన ఉద్యానవన ప్రముఖులతో సిబ్బందికి వర్క్‌షాపును ఏర్పాటు చేశామన్నారు. రాజధాని అమరావతిలో 320 కిలోమీటర్ల రోడ్డు వ్యవస్థను పచ్చదనంతో హోయలొలికించే విధంగా తీర్చిదిద్దుతు న్నామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భవనాలు, వివిధ నిర్మాణ సముదాయాలు చెంత పచ్చదన తొడుగుతో గ్రీనరీ చేపడుతున్నామని వెల్లడించారు. అదేవిధంగా రైతులకు తిరిగి ఇచ్చే 18 ఎల్పీఎస్ జోన్లలో సైతం పచ్చదనం, ఉద్యావనవనాల ఏర్పాటుకు సన్నాహాలు చేపడుతున్నామన్నారు. సహజ సిద్ధంగా ఏర్పడిన కొండవీటివాగు పాలవాగులకు ఇరువైపులా 100 నుంచి 150 మీటర్లతో బఫర్జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబుల్ వారి మార్గదర్శకాలను పాటిస్తూ కృష్ణానది పరివాహక ప్రాంతంలో 22 కిలోమీటర్ల మేర బ్లూ గ్రీన్ ఆలోచనలతో ముస్తాబు చేస్తామని అందుకు తగ్గట్టుగా సిబ్బందిని తయారుచేస్తున్నా మన్నారు. బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో రీసర్చ్ అండ్ డెవెలప్మెంట్ టీంలో సభ్యురాలు, సెంటర్ ఫర్ లెర్నింగ్, బయోడైవర్శటి ట్రీ మ్యాపింగ్ నిపుణురాలు డాక్టర్ స్మితా హెడ్గే మంగుళూరు నగరంలో అధిక ఉష్ణోగ్రతలను తగ్గించడానికి




ఆమె చేసిన సంస్కరణలను కార్యశాలలో వివరించారు. తాను 1200 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి మూడు నెలల వ్యవధిలో 68 వేల చెట్లను మ్యాపింగ్ చేసినట్లు వివరించారు. మంగుళూరు నగరంలో చక్కటి ఆక్సిజన్ను అందించే కల్పవృక్షం, నక్షత్ర, వేప చెట్లను సంరక్షించటం ద్వారా 4 డిగ్రీల ఉడుకు వాతావరణాన్ని తగ్గించడానికి కృషిచేశామన్నారు. ప్రపంచంలోని 178 దేశాలు ఆర్థికాభివృద్ధి చెందటానికి జీవవైవిద్యం దోహదపడుతున్నారు. బెంగుళూరు ఇంటర్నేషనల్ ఎయిర్పోర్టులో సెన్సార్ వెదర్ బేస్డ్ సిస్టమ్తో పచ్చదన అభివృద్ధిపై ఎయిర్పోర్టు ల్యాండ్ స్కేప్ డివిజన్ డీజీఎం శ్రీనివాస్ కూలంకుషంగా తేటపరిచారు.బయోలాజికల్ కంట్రోల్ ఆఫ్ పెస్ట్స్ నిపుణులు డాక్టర్ పి.శ్రీరామ్, పర్యావరణ నిపుణులు శరన్ గౌడా, ఎ.ఎస్.సుబ్బా రావు, ఏడీసీ ఉద్యావన అధికారులు వి.ఎస్.ధర్మజ, పి.విశ్వప్రసాద్లు పాల్గొని ఆటో మెషిన్, స్మార్ట్ ఇరిగేషన్ అండ్ డ్రిప్ ఇరిగేషన్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీసీ ఎండీ కె.వి.శ్రీనివాసులు, ఏపీ సీఆర్డీఏ హార్టికల్చర్ డైరెక్టర్ ఎం.హరిప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇంగ్లాండ్ క్రికెట్ టోర్నీకి జగ్గయ్యపేట యువకులు వరుణ్‌సాత్విక్, రాజేష్ ఎంపిక

**జగ్గయ్యపేట, జూలై 11, ప్రభాతవార్త :** వెంగ్‌సర్కార్ ఫౌండేషన్ ద్వారా ఇంగ్లాండ్‌లో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్స్‌కు దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుండి



యువక్రీడాకారులు వరుణ్‌సాత్విక్, రాజేష్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా స్థానిక ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర యువకులను శుక్రవారం అభినందించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ కోచ్ నిమ్మల రాజేంద్రప్రసాద్ ద్వారా శిక్షణ పొందిన ఈయువకులకు నేతలు రాజగోపాల్, రాఘవేంద్ర అభినందిస్తూ వారికి ఇంగ్లాండ్ వీసా స్టాంపింగ్ పాస్పోర్ట్‌లను స్వయంగా అందించారు. ఈ ఏడాదిజరిగిన అండర్-19 క్రికెట్ టోర్నమెంట్స్‌లో అద్భుత ప్రతిభ కనపర్చి ఈఇరువురు యువకులు ఎంపికైనట్లు కోచ్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. జగ్గయ్యపేట యువకులు అంతర్జాతీయస్థాయికి అడుగులు వేయటం గర్వకారణమని, వీరి విజయాలు యువతకు స్ఫూర్తినందిస్తాయని నేతలు రాజగోపాల్, రాఘవేంద్ర ప్రశంసించారు. కాగా కార్యక్రమంలో డాక్టర్ శ్రీరాం సంజయ్‌కృష్ణ, స్థానిక నేతలు మైనేని రాధాకృష్ణ, పేరం సైదేశ్వరరావు, నోముల రఘు, పిఎంఎస్ఆర్ బాబ్జి, యామర్తి బోస్‌యాదవ్, ఏసిఏ కోచ్ నిమ్మల రాజేంద్రప్రసాద్, బివి సుధీర్, బాషా తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక అన్నక్యాంటీన్ ఆవరణలో శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే శుక్రవారం పొడి దినం కార్యక్రమాన్ని ఎంఎల్ఏ ఆదేశాలతో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు, పదవ వార్డు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల నుండి ముఖ్యంగా దోమల ద్వారా సంక్రమించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వాటిని నిరోధించేందుకు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని రామలక్ష్మి అన్నారు. సీజనల్ వ్యధుల గురించి, నివారణ పద్ధతుల గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో శానిటరీ కార్యదర్శి పవిత్ర, ఆరోగ్య కార్యదర్శి రుతమ్మ, ఆశా కార్యకర్తలు సుధా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్‌లో గంజాయి కలకలం

**-గంజా చాక్లెట్లను పట్టుకున్న పోలీసులు -పలు రైళ్ళల్లో విస్తృతంగా తనిఖీలు**

**విజయవాడ క్రైం,జులై 11,ప్రభాతవార్త :** బెజవాడ రైల్వేస్టేషన్‌లో గంజాయి చాక్లెట్లను పట్టుకోవడం నగరవ్యాప్తంగా సంచలనమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి రత్నంరాజు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం రైల్వే పోలీసు అధికారులు,సత్యన్నారాయణపురం పోలీసులు వివిధ ప్లాట్‌ఫారంలపై ఆకస్మికంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో గంజాయి చాక్లెట్లను తాము పట్టుకున్నట్లు వెల్లడించారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామని,సత్యన్నారాయణపురం సిఐ లక్ష్మీనారాయణ తదితరులు ఈ ఆకస్మిక తనిఖీలో పాల్గొన్నారని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.రైళ్ళల్లో ఇక నుండి కూడ విస్తృతంగా తనిఖీలు చేపడతామని, గంజాయిపై రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఆయన వెల్లడించారు.

12-7Pg5.qxd:12-7Pg5.qxd 01/01/01 7:37 AM Page 1



# రూ.40వేలకు పెరిగిన వీసా ఫీజులు

## ట్రంప్ 'బ్యూటిఫుల్ బిల్' భారతీయులకు పెంచిన భారం



**న్యూఢిల్లీ, జూలై 12:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అధికారంలోకి వచ్చాక అమలుకు తెచ్చిన వన్ బిగ్ బ్యూటిఫుల్‌బిల్ తో ఇపుడు వీసా సమీకృత ఫీజు 250 డాలర్లుగా ఖర్చవుతున్నది. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా కేటగిరీలకు ఈ ఫీజులు వర్తిస్తాయి. భారత్ నుంచి ఎక్కువగా పర్యాటక వీసాలకే దరఖాస్తులు వస్తున్నాయి. టూరిస్టు, ఉన్నత విద్య, ఉద్యోగం వంటి వాటికి వచ్చే దరఖాస్తులకు 2026నుంచి మరింత భారం అవుతున్నాయి. 16వేల ఫీజు కట్టే వీసా ఇపుడు 40 వేల రూపాయలకు పెరిగింది. ప్రస్తుత వీసా ఫీజులకు అదనంగా 21,400 రీఫండ్‌కు వీలుకాని సర్‌ఛార్జిగా ఉంటుంది. ఇక ప్రతి వీసా జారీ సమయంలో ఈమొత్తం చెల్లించాల్సిందే. 2026నుంచి అమలులోకి వస్తుంది. ఈ ఫీజును ద్రవ్యోల్బణం ఆధారంగా నిర్ణయిస్తారు. వినియోగరంగ ధరలసూచీ ఆధారంగా ఈ ఫీజు నిర్ణయం అవుతుంది. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాలు అంటే బి-1/బి-2 అంటే టూరిస్టు, బిజినెస్ వీసాలు, ఎఫ్ అండ్‌ఎం స్టూడెంట్ వీసాలు, హెచ్1బి వర్క్ వీసాలు, జె అంటే ఎక్స్చేంజి విజిటర్ వీసాలకు ఈ మొత్తం అన్వయిస్తారు. కేవలం దౌత్యపరమైన వీసా హోల్డర్లు మాత్రమే అంటే కేటగిరి ఎ, కేటగిరి జిలకు మినహాయింపు ఉంది. టెక్ నిపుణులు, విద్యార్థులు, పర్యాటకులు, బిజినెస్ ట్రావెలర్లకు ఈ అదనపు మొత్తం విధిగా చెల్లించాల్సిన పరిస్థితులు వచ్చాయి. ప్రస్తుతం యుఎస్ బి-1/బి వీసాకు 185 డాలర్లు అంటే 15,800 ఖర్చువుతోంది. వీసా ఇంటిగ్రిటీ ఫీజుకింద ఇతర మైనర్‌ఫీజులు అంటే -94 ఫీజు 24 డాలర్లు, ఇఎస్‌టిఎ ఫీజు 13 డాలర్లు మొత్తం వ్యయం 472 డాలర్లు అంటే భారత కరెన్సీలో 40,502 రూపాయలు చెల్లించుకోవాలి. ప్రస్తుత వీసా వ్యయంకంటే రెండున్నర రెట్లు ఎక్కువ భరించాల్సి వస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు వీఈసాలు ఎఫ్ లేదా హెచ్1బి వ్యయాలు కూడా భారీగాపెరుగుతున్నాయి. కొన్ని ప్రత్యేకపరిస్థితుల్లో మినహా ఈ ఫీజు రద్దుకాదు, తగ్గింపు ఉండదు. అన్ని వీసా నిబంధనలు భర్తీచేయాలి. వీసా గడువుకు ఐదురోజులుముందే అమెరికాను విడిచి వెళుతున్నట్లు ప్రకటించాలి. లేదా చట్టపరంగా వారి బసను పొడిగించుకున్నట్లు స్పష్టం చేయాలి. అప్పుడే రీఫండ్‌కు అర్హులవుతారు. యుఎస్ డిపార్టుమెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ ఈ విధానాలను పర్యవేక్షిస్తుంది. అంతేకాకుండా ఈ కొత్తబిల్లులు విదేశీ జమలు అంటే అమెరికాలో ఉన్న విదేశీయులు వారి సొంతదేశాలకు పంపించే జమలపై ఒకటిశాతం సుంకం చెల్లించాలన్న నిబంధనను కూడా అమలుకు వచ్చింది.



# కొత్త పార్టీ పెట్టిన లాలూ పెద్దకుమారుడు తేజ్‌ప్రతాప్

**పాట్నా,జూలై 11:** బీహార్ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. సొంత పార్టీ ఆర్జేడీ నుంచి బహిష్కరణకు గురైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తేజ్‌ప్రతాప్ యాదవ్ తండ్రి లాలు ప్రసాద్ యాదవ్‌కు షాకిచ్చారు. కొత్త పార్టీ బ్యానర్‌పై మహువాలో ర్యాలీ నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయబోతున్నట్టు సంకేతాలిచ్చారు. పార్టీతో విభేదాల అనంతరం తొలిసారి నిర్వహించిన ఈ ర్యాలీలో తేజ్ ప్రతాప్ మద్దతుదారులు ఆకుపచ్చ, తెలుపు రంగుల్లో ఉన్న జెండాను పట్టుకున్నారు. దానిపై 'టీమ్ తేజ్ ప్రతాప్' అని రాసి ఉంది. తన మాజీ నియోజకవర్గమైన మహువాలో రోడ్‌షోకు నాయకత్వం వహించిన తేజ్ ప్రతాప్ తన సిగ్నేచర్ గ్రీన్ క్యాప్ ధరించారు. అక్కడ మద్దతుదారుల నుంచి ఆయనకు హృదయపూర్వక స్వాగతం లభించింది. తాను ఒకరి నియంత్రణ కింద పనిచేయబోనని చెప్పిన తేజ్ ప్రతాప్ ప్రజల నిర్ణయానికి అనుగుణంగా తన తర్వాతి నిర్ణయం ఉంటుందని చెప్పారు. ప్రజలు ఏది కోరితే అదే చేస్తానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలని ప్రజలు కోరితే అక్కడి నుంచి పోటీ చేస్తానని వివరించారు. తేజ్ ప్రతాప్ 2015 అసెంబ్లీ ఎన్నికలతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తాజాగా ఆయనను ఆరేళ్లపాటు పార్టీనుంచి బహిష్కరిస్తూ ఆయన తండ్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. కాగా, అనుష్క యాదవ్ అనే మహిళతో ఉన్న ఫొటోలను షేర్ చేసిన తేజ్‌ప్రతాప్ ఆమెతో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు తెలిపారు. అయితే ఆ తర్వాత ఆ ఫొటోలను డిలీట్ చేశారు. తన ఫేస్‌బుక్ హ్యాక్ అయిందని పేర్కొన్నారు. అయితే, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీనిని తీవ్రంగా పరిగణించిన లాలుప్రసాద్ తన పెద్దకొడుకుతో ఉన్న అన్ని సంబంధాలను తెంచుకున్నట్టు ప్రకటించారు.



## 9 నెలలుగా ఇంట్లోనే శవంగా..


# నటి మృతి కేసులో సంచలనం!

**ఇస్లామాబాద్, జూలై 11:** దయనీయస్థితిలో శవమై కనిపించిన పాకిస్థాన్ నటి కేసులో కీలక విషయం వెల్లడైంది. ఆమె తొమ్మిది నెలల క్రితమే ఇంట్లో చనిపోయి ఉండొచ్చని తెలుస్తోంది. గుర్తుపట్టలేని విధంగా కుళ్లిపోయిన ఆమె మృతదేహాన్ని కరాచీలోని అపార్ట్‌మెంట్‌లో మంగళవారం పోలీసులు గుర్తించారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం పాక్‌కు చెందిన ఆ నటి పేరు హుమైరా అస్గర్ అలీ. లాహోర్‌కు చెందిన ఆమె ఏడేళ్ల క్రితం కరాచీకి వచ్చి, ఒక ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. చాలా అరుదుగా మాత్రమే ఆమె కుటుంబసభ్యుల వద్దకు వెళ్లేవారు. కొన్ని నెలలుగా ఆమె అద్దె కట్టడం లేదని ఆ ఇంటి యజమాని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు అపార్ట్‌మెంట్‌కు వెళ్లి చూడగా ఆమె మృతి చెందిన విషయం బయటపడింది. పూర్తిగా కుళ్లిపోయి,ఎముకలు బయటపడిన స్థితిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. పోస్టు మార్టం నివేదిక ఆధారంగా ఆమె తొమ్మిది నెలల క్రితమే ప్రాణాలు కోల్పోయి ఉంటారని ప్రాథమికంగా అంచాన వేస్తున్నారు. 'ఆమె గతేడాది అక్టోబరులో చివరి ఫోన్ కాల్ చేసింది. అద్దె ఇంటికి దగ్గర్లోని వారు ఆ సమయంలోనే ఆమెను చూశామని చెప్పారు' అని పోలీసు అధికారులు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో ఆమె ఫ్లాట్‌కు ఆ నెలలోనే ఎలక్ట్రిసిటీ నిలిపేసి ఉండొచ్చన్నారు. ఆ ఇంట్లో ఆహారమంతా పాడైపోయింది. కొన్ని వస్తువులు తుప్పుపట్టాయి. నటి ఉంటున్న అంతస్తులో ఉన్న మరో ఫ్లాట్ కూడా ఖాళీగా ఉండటంతో మృతదేహం నుంచి వచ్చిన దుర్వాసనను ఎవరూ గుర్తించలేకపోయారు. కొంతమంది ఫిబ్రవరిలో ఆ అంతస్తుకు వచ్చినా.. అప్పటికే కొన్ని నెలలు కావడంతో ఎవరికీ దుర్వాసన రాలేదు. మూడు రోజు క్రితం ఆమె మృతదేహాన్ని గుర్తిస్తే దానిని తీసుకెళ్లడానికి కుటుంబసభ్యులు నిరాకరించడం గమనార్హం. చివరకు ఆమె సోదరుడు అందుకు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. ఒక యేడాదిన్నరగా ఆమె తమ వద్దకు రాలేదని నటి సోదరుడు చెప్పారు. కాగా.. మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లాహోర్ చెందిన హుమైరా 2015లో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. పలు టెలివిజన్ షోల్లో కనిపించారు. జలేబి (2015), లవ్ వ్యాక్సిన్ (2021)చిత్రాలు చేశారు. 2022లో వచ్చిన తమాషా రియాల్టీ షోతో పాపులరయ్యారు.

# కుమార్తెపై దీపక్ ఎందుకు కాల్పులు జరిపినట్లు?

## టెన్నిస్ అకాడమీయే కాల్పులకు మూలకారణమా?

## నేరం అంగీకరించిన టెన్నిస్‌స్టార్ తండ్రి దీపక్‌యాదవ్



**గురుగ్రామ్, జూలై 12:** లగ్జరీ ఫామ్‌హౌస్, నెలకు 17లక్షలకుపైగా ఆదాయం ఉన్న వ్యక్తి తన కుమార్తెను తానే స్వయంగా ఎందుకు కాల్చి చంపారన్న వార్తలు ఇపుడు నగరంలో చక్కర్లు కొడుతున్నాయి. 25 ఏళ్ల టెన్నిస్‌ప్లేయర్ రాధికా యాదవ్‌ను కన్నతండ్రే కాల్చిచంపేసిన ఉదంతం అందరినీ కలవరపరిచింది. గురుగ్రామ్‌లోని సుశాంత్‌లోక్ ప్రాంతంలో అత్యంత లగ్జరీ ఇంటిలో రాధికా కుటుంబం నివసిస్తోంది. దీపక యాదవ్(49) తానే హత్యచేసినట్లు అంగీకరించాడు. ఐదు రౌండ్లు కాల్చాడు. కిందిఅంతస్తులో ఉన్న రాధిక మేనమామ వెంటనే పైకి చేరుకునే సరికి కిచెన్‌లో రక్తపుమడుగులో ఉన్న రాధికాను తన కారులో పక్కనే ఉన్న ఆసియా మారింగో ఆసుపత్రికి తరలించారు. కాని వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయిందని ధృవీకరించడంతో వర్ధమాన టెన్నిస్ తార ఒకటి రాలిపోయి నట్లయింది. దీనికంతటికి సొంతవూరు వజీరా బాద్‌లో ఆయనకు లెక్కకుమించిన ఆస్తులున్నాయి. లగ్జరీ ఫామ్‌హౌస్‌కూడా ఉంది. నెలకు 18 లక్షల వరకూ ఆదాయం వస్తున్నా తాను కూతురు సంపాదనపైనే ఆధారపడి బతుకుతున్నట్లు చెడు ప్రచారం జరగడంతో భరించలేకపోయినట్లు పోలీసులకు తెలిపాడు. అయితే ఇది నిజం కాదని ఆయనకు అంతకుమించిన ఆస్తులే ఉన్నాయని గ్రామస్తులు చెపుతున్నారు. అలాగే తాను సొంతంగా ఉంచుకున్న తుపాకి సంపన్నులు మాత్రమే వినియోగించగలరని దాని లైసెన్స్ కూడా ఆషామాషీగా ఏమీ రాదని చెపుతున్నారు. రాధికా సెక్టార్ 57లో ఒక టెన్నిస్ అకడామీని కూడా నిర్వహిస్తోంది. ఈ అకాడమినీ, టెన్నిస్‌కు వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలని దీపక్ రాధికపై ఒత్తిడి తెచ్చినా పట్టించుకోలేదు. ఇదేక్రమంలో ఇద్దరిమధ్య జరిగిన వాగ్వాదంలో కోపం పట్టలేక కాల్పులు జరిపినట్లు ఒప్పుకున్నాడు. అయితే కూతురు అంటే అమితమైన ప్రేమ. రెండులక్షల విలువైన టెన్నిస్ రాకెట్లు కూడా కొనితెచ్చాడు. ఆమె కోసం ఏదైనా చేసేందుకు వెనుకాడని దీపక్ స్వయంగా ఈపనికి ఎలా పాల్పడ్డారన్నది అంతుబట్టకుండా ఉంది. ఈ పరిణామాల క్రమంలోనే దీపక్ కూతురిపై కాల్పులు జరిపినట్లు తేలింది. ప్రస్తుతం 14రోజుల జ్యుడిషియల్ కస్టడీలో కొనసాగుతున్నాడు.

# పాకిస్థాన్ దాడుల్లో భారత్‌కు ఎలాంటి నష్టం జరగలేదు

## అందుకు ఒక్క ఆధారమైనా చూపాలి


## విదేశీ మీడియాకు సవాల్ విసిరిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్



**న్యూఢిల్లీ, జులై 11:** ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాల్ విసిరారు. చెన్నైలోని ఓ కార్యక్రమానికి హాజరైన దోవల్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించి దాయాదికి ముచ్చెమటలు పట్టించామని అన్నారు. సోషల్ మీడియాలో విదేశీ వార్తా సంస్థలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను దోవల్ కొట్టిపడేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ అది చేసింది, ఇది చేసిందంటూ విదేశీ మీడియా అసత్య కథనాలు ప్రసారం చేసిందని మండిపడ్డారు. ఆ దేశంలో ఉగ్రస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయో అత్యంత ఖచ్చితమైన సమాచారంతోనే భారత సైన్యం దాడులు నిర్వహించిందన్నారు. పాకిస్థాన్‌లోని 13 వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు మాత్రమే బయటకు వచ్చాయి కానీ భారత్‌కు నష్టం జరి గినట్లు ఒక్క ఫొటో కూడా లేదని వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన ఆయుధ స్థావరాలపై దేశ సైన్యం చిన్న గీతకూడా పడనివ్వలేదని అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను, యుద్ధ పరిస్థితులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన సాధన సంపత్తిని దేశీయంగానే రూపొందిస్తోందని దోవల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సుఖోయ్ -30 ఎంకెఐ యుద్ధవిమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయన్నారు.

పాకిస్థాన్ సైన్యం ఢిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్-11 బాలి స్టిక్ క్షిపణులను భారత బలగాలు గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400తో మధ్యలోనే సమర్థవంతంగా పేల్చివేశాయని తెలిపారు.

# కిట్టీపార్టీలతో కోట్లు కొల్లగొట్టిన మహిళ



**బెంగళూరు, జూలై 11:** బెంగళూరులో కిట్టీ పార్టీల పేరుతో ఓ మహిళ తన సోషల్ మీడియా స్నేహితులను రూ. 5 కోట్లు మోసం చేసింది. 49 ఏళ్ల సవిత అనే మహిళ బంగారు దిగుమతులు, అధిక రాబడి పెట్టుబడుల పేరుతో ఆకర్షణీయమైన వల విసిరి తన స్నేహితుల నుండి రూ. 5 కోట్లకు పైగా మోసం చేసిందని ఆరోపణలు రావడంతో ఆమెను అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, నగరంలోని బసవేశ్వరనగర్ ప్రాంతంలోని కిర్లోస్కర్ కాలనీకి చెందిన సవిత అనే ఈ మహిళ తన స్నేహి తురాళ్లతో తరచూ కిట్టీ పార్టీలు నిర్వహించేది. ఈ పార్టీలలో ఆమె తాను విదేశాల నుంచి తక్కువ ధరకు బంగారం దిగుమతి చేసుకుంటా నని చెప్పేది. అంతేకాకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే వారి డబ్బును రెట్టింపు చేస్తానని ఆకర్షణీయమైన పథకాలను వారికి వివరించేది. ఆమె మాటలను నమ్మిన చాలామంది మహిళలు పెద్ద మొత్తంలో డబ్బును సవితకు ఇచ్చారు. మొదట్లో కొందరికి కొద్ది మొత్తంలో లాభాలు కూడా చూపించడంతో ఆమె మాటలను అందరూ గుడ్డిగా నమ్మారు. అయితే, కొంతకాలం తర్వాత సవిత ఎవరికీ డబ్బు తిరిగి ఇవ్వకుండా దాటవేస్తూ వచ్చింది. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల నుండి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో సవిత చాలా మందిని ఇదే తరహాలో మోసం చేసిందని తేలింది. ఆమె కేవలం కిట్టీ పార్టీలలో పాల్గొనే మహిళలనే కాకుండా, తన ఇతర స్నేహితులు మరియు బంధువులను కూడా నమ్మించి మోసగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో, పోలీసులు సవితను మరియు ఈ మోసంలో ఆమెకు సహకరించిన మరొక వ్యక్తిని అరెస్టు చేశారు. వారిని స్థానిక కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారికి ఐదు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. పోలీసులు ప్రస్తుతం వారి నుండి మరింత సమాచారం రాబట్టే ప్రయత్నంలో ఉన్నారు. మోసపోయిన వారి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

## ప్రైవేట్‌రూమ్‌లో ఎమ్మెల్యే.. పక్కనే క్యాష్‌తో బ్యాగ్

# శివసేన వైరల్ చేసిన వీడియో



**ముంబయి,జూలై 12:** మహారాష్ట్ర మంత్రి సంజయ్ శిర్సత్ వివాదంలో చిక్కుకున్నారు. ఒక ప్రైవేటురూమ్‌లో ధూమపానంచేస్తూ హాఫ్ డ్రెస్‌లో ఉన్న ఆతడి వీడియో బైటకివచ్చింది. అంతేకాకుండా అదే ప్రైవేటు రూమ్‌లో ఒక బ్యాగ్ నిండా క్యాష్ కూడా ఉందన్న ప్రచారం హోరెత్తింది. అంతకు ఒకరోజుముందే ఆయనకు ఆదాయపు పన్ను శాఖనోటీసులు జారీచేసారని చెప్పారు. తన ఆస్తులు ఒక్కసారిగా పెరగడంలో ఉన్న మూలాలు చెప్పాలని, 2019నుంచి 2024 అసెంబ్లీ ఎన్నికలనాటికి ఆస్తులు భారీగా కూడబెట్టారని రాబడులకు మూలం చెప్పాలని ఐటిశాఖ నోటీసులు పంపించింది. థాకరే శివసేన నేత సంజయ్‌రౌత్ ఈ వీడియోను పోస్టు చేసారు. అసహాయతకు చిరునామా ఫడ్నవిస్ అని ఆపోస్టుకు ట్యాగ్‌లైన్‌జోడించారు. ఇంకెలా ఎంతమంది కూటమిలో ఉన్నారో పాపం ఫడ్నవిస్ అని సానుభూతిని ప్రకటించారు. సామా జిక న్యాయశాఖమంత్రి సంజయ్ శిర్సత్ తన బెడ్‌కు పక్కనే ఉన్న బ్యాగ్‌నిండా దస్తులే ఉన్నాయని, రౌత్ చెపుతున్నట్లు క్యాష్‌లేదని అన్నారు. ఔరంగాబాద్ వెస్ట్‌స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శిర్సత్ డిప్యూటిసిఎం ఏక్‌నాథ్‌షిండే వర్గానికి ఎందినవారు. ఈ సోషల్‌మీడియా వైరల్‌కావడానికి ఒకరోజు ముందే ఆయనకు ఆదాయపుపన్నుశాఖ నోటీసులు జారీచేసిందని ఆయనే స్వయంగా ప్రకటించారు. తన వ్యక్తిగత ఆస్తులు గడచిన ఐదేళ్లలో ఒక్కసారిగా భారీ వృద్ధిని ఎలాసాధించాయో చెప్పాలంటే ఐటి నోటీసులు జారీ చేసారు. కొందరు వ్యక్తులు ఆదాయపు పన్ను శాఖకు తనపై ఫిర్యాదులు చేసారని అందువల్లనే తనకు నోటీసు వచ్చిందని ఆయన అన్నారు. తానేమీ భయపడనని నోటీసులకు స్పందిస్తానని, అయితే కొంత గడువు కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు. తానేమీ తప్పులు చేయలేదని, సరైన స్పందనే ఇస్తానని శిర్సత్ చెప్పుకొచ్చారు.

# బీహార్ ఎన్నికలు హైజాక్‌కు బిజెపి కుట్ర

## ఒడిశాలో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపి రాహుల్‌గాంధీ



**భువనేశ్వర్,జూలై 11:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పుల చెరిగారు. మహారాష్ట్రలో చేసినట్లుగానే త్వరలో జరిగే బిహార్ ఎన్నికలను హైజాక్ చేసేందుకు బిజెపి యత్నిస్తోందని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు ఈ చర్యను అడ్డుకుంటాయని చెప్పారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ఎన్నికల సంఘం తమ విధులను నిర్వర్తించడం లేదని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పుల చెరిగారు. మహారాష్ట్రలో చేసినట్లుగానే త్వరలో జరిగే బిహార్ ఎన్నికలను హైజాక్ చేసేందుకు బిజెపి యత్నిస్తోందని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు ఈ చర్యను అడ్డుకుంటాయని చెప్పారు. ఒడిశాలోని భువనేశ్వంలో జరిగిన సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ఎన్నికల సంఘం తమ విధులను నిర్వర్తించడం లేదని, బిజెపికి ప్రయోజనాలు చేకూర్చేందుకు పని చేస్తుందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఐదుగురు పెట్టుబడిదారుల కోసం పనిచేస్తుందేకానీ నిరుపేద ప్రజల కోసం పనిచేయట్లేదు. జల్, జమీన్, జంగల్ (నీరు, భూమి, అడవి) ఎప్పటికీ గిరిజనులకు సొంతం. అటవీ హక్కు పట్టాలను గిరిజనులకు ఒడిశా ప్రభుత్వం ఇవ్వడం లేదు. పెసా, ట్రైబల్ బిల్లులను గిరిజనుల కోసం కాంగ్రెస్ తీసుకువచ్చింది. వాటిని అమలు చేసి గిరిజనుల భూమి వారికే దక్కేలా చేస్తాం. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం, గత పాలకులైన బిజెడి వారిలాగే ఒడిశాను దోచుకుంటున్నదని రాహుల్ గాంధీ, ఆరోపించారు. మేం ప్రభుత్వ సంస్థల్ని స్థాపిస్తే బిజెపి ప్రైవేటు పరం చేస్తోందని ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు.

## యువ ప్రేమజంటపై గ్రామస్తుల కర్కశం

# నాగలికట్టి కొడుతూ పొలం దున్నించిన వైనం



**రాయగడ,(ఒడిశా), జూలై 11:** ప్రేమ వివాహం చేసుకున్న ఒక యువ జంటపై ఆగ్రామ పెద్దలు అమానుషంగా ప్రవర్తించారు. నాగలికి ఎద్దుల్లాగా కట్టి కర్రలతో కొడుతూ వాళ్లతో పొలం దున్నిస్తూ వారిని చితక బాదారు. ఆపై పాప పరిహారం అంటూ గుడిలోను చిత్రహింసలకు గురిచేసారు. ఇందుకు సంబంధించిన విడియో వైరల్ కావడంతో పోలీసులు రంగప్రవేశం చేసారు. రాయగడజిల్లాలోని కంజమజ్జిరా గ్రామంలో జరిగిన ఈసంఘటనలో గ్రామానికి చెందిన యువకుడు యువతి చాలాకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలను ఒప్పించి ఇటీవలే వివాహం చేసుకున్నారు. అయితే ఈ వివాహానికి ఊరిపెద్దలు కొందరు అభ్యంతరం వ్యక్తం చేసారు. అయితే ఈ ఇద్దరూ వరుసకు బంధువులే అయినప్పటికీ గ్రామ ఆచారం ప్రకారం ఈ తరహా వివాహం అపచారమని చెపుతూ ఈ శిక్షను విధించారు. తొలుత వీళ్లతో పొలం దున్నడం పేరిట హింసించిన కొందరు ఆపై గుడికి తీసుకెళ్లి పాపపరిహారంపేరిట ప్రత్యేక పూజలు చేయించారు. ఈమొత్తం ఉదం తాన్ని గ్రామయువకులు విడియోతీసి సోషల్ మీడియాలో పోస్టుచేసారు. పోలీస్ సూపరిం టెండెంట్ ఎస్.స్వాతికుమార్ మాట్లాడుతూ శుక్రవారం ఒక బృందం గ్రామానికి వెళ్లిందని, కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## సంక్షిప్తంగా..

### వంతెన ప్రమాదంలో 20కి పెరిగిన మృతులు



**అహ్మదాబాద్, జూలై 11:** ఆనంద్‌జిల్లాలోని పద్రా తాలూకాలో మహిసాగర్‌నదిపై ఉన్న గంభీర వంతెన కూలిన సంఘటనలోమ ృతుల సంఖ్య 20కి పెరిగింది. ఈ ప్రమాదంలో ఐదునుంచి ఏడు వాహనాలు నదిలోకి పడిపోవడంతో నదిలో కొట్టుకునిపోయారు. ఇప్పటికీ ఇద్దరి ఆచూకీ తెలియడంలేదని సహాయక బృందాలు తెలిపాయి. ఇప్పటికే చనిపోయిన వారిగ్రామాల్లో విషాదఛాయలు కొనసాగుతున్నాయి. పార్టీల వారీగా ఈ సంఘటన రాజకీయ రంగుపులుముకుంది. అయితే పురజనులు మాత్రం పార్టీల వైఖరిని తూర్పారబడుతున్నారు. ప్రజాపనుల శాఖకు చెందిననలుగురు ఇంజినీర్లను ప్రాథమిక నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసారు. ముఖ్యమంత్రి భూపేంద్రపటేల్ స్వయంగా ప్రజాపనుల శాఖను నిర్వహిస్తున్నారు. ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. 30రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీచేసారు.

### కోయంబత్తూరు పేలుళ్ల ఉగ్రవాది 27యేళ్ల తరువాత పట్టివేత




**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** తమిళనాడులోని కోయంబత్తూరులో 1998లో జరిగిన పేలుళ్ల ఘటనలో నిందితుడుగా వున్న ఐఎస్ఐ ఉగ్రవాది 27ఏళ్ల తరువాత పోలీసులకు చిక్కాడు. నాటి ఘటనలో 58 మంది మరణించగా 250 మందికి పైగా ప్రజలు గాయపడ్డారు. బిజెపి అగ్రనే తలు పాల్గొన్న ఈ సభను ఐఎస్ఐ ఉగ్రవాదులు టార్గెట్ చేయడంతో జరిగిన పేలుళ్ల దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ పేలుళ్ల కేసులో దాదా పు అందరు నిందితులు పట్టుబడగా సీరియల్ కిల్లర్‌గా పేరుగాంచిన సాదిక్ రాజా అలియాస్ టైలర్ రాజా (48)ను బెంగళూరులోని విజయపురలో తమిళనాడు ఉగ్రవాద వ్యతిరేక బృందం, కోయంబత్తూరు పోలీసులు, కర్ణాటక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి శుక్రవారం అరెస్టు చేశారు.

### హిందూస్థాన్ యూనిలీవర్‌కు తొలిసారి మహిళా సిఇఒగా ప్రియా నాయర్

**ముంబయి,జూలై 11:** హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్‌కు తొలిసారి మహిళ నాయకత్వం వహించబోతున్నారు. ప్రస్తుతం కంపెనీ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రియా నాయర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి, మేనేజింగ్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన విషయం తెలి సిందే. ఈ నియామకం ఆగస్టు 1 నుంచి అమ ల్లోకి రానున్నది. ప్రస్తుతం సీఈఓగా ఉన్న రోహిత్ జావా వ్యక్తిగత కారణాలరీత్యా జులై 31తో తనబాధ్యతల నుంచితప్పుకొంటున్నారు. ఆపై ప్రియా నాయర్ సంస్థను నడిపించనున్నారు. ఈ పదవిలో ఐదేళ్లపాటు కొనసాగుతారు. ఒక మహిళను ఎండీ, సీఈఓ పదవిలో నియమించడం హెచ్‌యూఎల్ చరిత్రలో ఇదే మొదటిసారి.

### హోటల్ సిబ్బందిని కొట్టిన ఎమ్మెల్యేపై కేసు నమోదు



**ముంబయి, జూలై 11:** మహారాష్ట్రలో శివసేన షిండేవర్గం ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌పై కేసు నమోదైంది. ఓ హోటల్ కార్మికుడిపై దాడి కేసులో ముంబై పోలీసులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ముంబై చర్చిగేట్‌లోని ఎమ్మెల్యేల క్యాంటీన్‌లో తనకు వడ్డించిన ఆహారం రుచిగా లేదని, కుళ్లిపోయిందని ఆరోపిస్తూ క్యాంటిన్ కార్మికుడు, మేనేజర్, ఇతర సిబ్బందిపై పిడిగుద్దులు కురిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి ఇటీవలే సోషల్ మీడియాలో వైరల్ కాగా ఎమ్మెల్యే తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. మహారాష్ట్ర అసెంబ్లీ, విధాన సభలో ఈ అంశాన్నిప్రతిపక్షాలు, శివసేన (ఉద్ధవ్) వర్గం లేవనెత్తాయి. ఇక ఈ ఘటనపై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ ఈ విషయంపై విచారణ జరిపి పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత ఎమ్మెల్యేపై పోలీసులు చర్యలు చేపట్టారు.

### పాక్‌లో పంజా విసిరిన బలోచ్ తిరుగుబాటుదారులు!

**ఇస్లామాబాద్, జూలై 11:** పాకిస్థాన్‌లో బలోచ్ రెబల్స్ చెలరేగిపోతున్నారు. తాజాగా దక్షిణ బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో పలు వాహనాలపై దాడి చేసి తొమ్మిదిమందిని కాల్చి చంపారు. ముందుగా గురువారం సాయంత్రం పలు బస్సులను ఆపి వీరిని కిడ్నాప్‌చేశారు. తర్వాత సమీపంలోని పర్వతాల్లోకి వారిని తీసుకెళ్లి హత్య చేసినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ వెల్లడించింది. అర్ధరాత్రి వారి మృతదేహాలు బయటపడినట్లు గవర్నమెంట్ అధికారి ఒకరు తెలిపారు.

12-7Pg6exHMNWJQE.qxd:12-7Pg6exHMNWJQE.qxd 01/01/01 9:42 AM Page 1



# అంతర్జాతీయ ప్రమాణాలతో 'తుడ' ప్రత్యేక కార్యాచరణ

- స్కూల్ఆఫ్‌ప్లానింగ్ ఆర్కిటెక్చర్ అధ్యాపకులతో ప్రణాళికలు



**తిరుపతి,జూలై 11ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న ఐదేళ్ళలో స్మార్ట్‌సిటీ తిరుపతి నగర పరిధిని మరింత విస్తరింపజేయాలన్న లక్ష్యంతో జాతీయ అంతర్జాతీయ ప్రమాణాలతో తుడ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతోందని తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం అధ్యాపకులతో కలసి తుడ పరిధిలోని శెట్టిపల్లి భూములను పరిశీలించారు. తుడ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులను, అభివృద్ధి పనులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. తుడ అభివృద్ధిలో తాము భాగస్వామ్యమై, అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. తిరుపతి జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రాలు, చారిత్రక కట్టడాలు, పర్యాటక కేంద్రాలు ఉన్నందున నిత్యం లక్షలాదిమంది భక్తులు, పర్యాటకులు జిల్లాకు విచ్చే స్తున్నారన్నారు. వారికి అన్ని రకాల వసతులు కల్పించడానికి తుడ కృషి చేస్తుందన్నారు. టిటిడితో కలసి తుడ తిరుపతి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందని, అదే స్థాయిలో శ్రీకాళహస్తి దేవస్థానంతో కలసి శ్రీకాళహస్తి ప్రాంత సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అవసరమైన మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మిస్తున్నామని ఛైర్మన్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

## నేడు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

**బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహణ**

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 12 శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విజయవాడ ప్రెస్ క్లబ్ లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిబిరంలో దాదాపు 8 వేల రూపాయల విలువైన... మెమోగ్రఫీ ,గర్భాశయా స్కానింగ్ ,పాప్స్ మియర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారు .వెంటనే రిపోర్టులు కూడా అందజేస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు హాజరై శిబిరాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా వ్యవస్థాపకులు ఏపీయుడబ్ల్యుజె రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చందు జనార్థన్ పాల్గొంటారు ఎంతో ఉపయోగకరమైన ఈ శిబిరంలో విజయవాడ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పనచేసే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరుతున్నట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు జయరాజు,దాసరి నాగరాజు,ఎపీడబ్ల్యుయుజె నగర అధ్యక్ష, కార్యదర్శులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసారు.

## కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో పోలీసుల తనిఖీలు

**గంజాయి చాక్లెట్లు స్వాధీనం**

**విజయవాడ జులై 11 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రైల్వేస్టేషన్‌లో కోరమాండల్ రైలు లో శుక్రవారం రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గంజాయితో ప్యాక్ చేసిన చాక్లెట్లను తీసుకెళ్తుండగా యువకుడిని అదుపు లోకి తీసుకున్నారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నట్టు రైల్వే డీఎస్పీ రత్నరాజు తెలిపారు. గంజాయిని చాక్లెట్ ఉండలుగా మార్చి రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని రైల్వే డీఎస్పీ రత్నరాజు తెలిపారు.

## ఉదయగిరిలో యువకుడు దారుణ హత్య

**ఉదయగిరి (నెల్లూరు), జూలై 11, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఆల్కైర్ ఫంక్షన్ హాల్‌లో హమీద్ హత్య అతనిపై ఇద్దరు యువకులు ఇనపరాడులతో కత్తులతో దాడి చేయడంతో సంఘటన స్థలంలోనే హమీద్ అనే యువకుడు మృతి అనంతరం ఆల్కైర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహణ ఆర్థిక వ్యవహారంలో వివాదాలు. విచారిస్తున్న పోలీసులు.

## కన్యాకుమారి ట్రైన్ లో విస్తృత తనిఖీలు

**రేణిగుంట జూలై 11 ప్రభాతవార్త** కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషకు చేరుకుంది. అకస్మాత్తుగా పెద్ద సంఖ్యలో పోలీసులు రైలు బోగీలోకి ప్రవేశించారు. ఏం జరుగుతుందో అర్థం కాక ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. ఎవరు భయపడాల్సిన అవసరం లేదని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారి పర్యవేక్షణ నందు ఆర్పిఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్ రెడ్డి నేతృత్వంలో ఆర్పిఎఫ్, జి ఆర్ పి, లీగల్ టీం రైల్లో నిషేధిత వస్తువుల అక్రమ రవాణా పై తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో ప్రయాణికులు కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. రైలు అన్ని భోగీలను నిశితంగా పరిశీలించారు. రేణిగుంటలో ప్రారంభమైన తనిఖీలు పాకాల వరకు రైల్లోనే ప్రయాణిస్తూ చేశారు. ఒక్క బ్యాగును కూడా వదిలిపెట్టకుండా క్షుణ్ణంగా వెతికారు. అనుమానితులను ప్రశ్నించారు. అంతకుముందు రేణిగుంట రైల్వే స్టేషన్ ఉన్న ప్రయాణికుల బ్యాగులను చెక్ చేశారు. తనిఖీల్లో భాగంగా డాగ్ స్క్వాడ్ ను వినియోగించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ రైళ్లలో గంజాయి తదితర మత్తు పదార్థాలు, గ్యాస్ సిలిండర్లు, పేలుడు పదార్థాలు, పెట్రోలు, కిరోసిన్, డీజిల్ లాంటి మండే పదార్థాలు, రవాణా చేయకూడదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆర్ జి టి 4. కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు.

## ర్యాపిడో డ్రైవర్లుగా మహిళలు అండగా నిలిచిన మెప్మా

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** స్వయం ఉపాధి రంగంలో మహిళలు నిలదొక్కునేందుకు ఏపీ ప్రభుత్వ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుంటుంది.మోటారు వెహికల్ రంగంలోను వారికి అండగా నిలుస్తోంది,మోటారు వాహనాలపై ప్రయాణికులను తీసుకుని వెళ్ళేందుకు వీలుగా వారికి రాయితీపై విద్యుత్తు బైక్‌లు,స్కూటీలుఅందిస్తోంది. ఆటో రిక్షాలను అందిస్తోంది. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు ఏర్పడినవే స్వయం సహాయక సంఘాలు వడ్డీ లేని రుణాలు ఇస్తూ స్వయం సమృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వాటిని మరింత బలోపేతం చేసి మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సీఎం చంద్రబాబు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రధాన నగరాల్లో ఇప్పటికే మహిళలు ఈ ర్యాపిడో సేవల్లో ఉన్నారు. విజయవాడ, విశాఖలో 400 మంది చొప్పున లబ్ధిదారులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించి 4 వేల 800 మందిని ర్యాపిడో నెట్‌వర్క్‌లో చేర్చడమే లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. విజన్2047కు అనుగుణంగా మహిళలు అభ్యున్నతి సాధించేందుకు ఇది ఎంతగానో ఉపకరిస్తుందంటున్నారు. మెప్మాతో ర్యాపిడోను అనుసంధానం చేసి మహిళలకు 12 వేల వరకు సబ్సిడీ కింద విద్యుత్ వాహనాలు అందిస్తూ ఉపాధికి బాటలు వేశారు.సాధారణంగా ర్యాపిడో అంటేనే పురుష డ్రైవర్లు కనిపిస్తారు. కానీ ఇక్కడ మహిళా ర్యాపిడో డ్రైవర్లను చూడొచ్చు. రు. మెప్మాలో ఉన్న మహిళలకు మరింత అండగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అతివలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చేందుకు సబ్సిడీ కింద విద్యుత్ వాహనాలు అందించింది. కొందరికి స్కూటీలు, మరికొందరికి ఆటోలు పంపిణీ చేసింది. అంతేకాకుండా మెప్మాతో ర్యాపిడోను అనుసంధానం చేసింది. ర్యాపిడో యాప్‌ను ఉపయోగించడంపైనా శిక్షణ ఇచ్చారు. ర్యాపిడో సర్వీసులను మహిళలు నిర్వహించే విధంగా ఏపీ ప్రభుత్వం మెప్మా ద్వారా సహకారం అందిస్తోంది. వారికి డ్వాక్రా గ్రూప్ ద్వారా వాహనాలు తీసుకుంటే ద్విచక్రవాహనానికి రూ.12 వేలు, ఆటో తీసుకుని ర్యాపిడోకి వాడుతుంటే రూ.30 వేల సబ్సిడీ పొందవచ్చు.

## లోకాయుక్త జోక్యంతో లైబ్రరీ సెస్ వసూలు

**తూ.గో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రూ.366.88 లక్షల చెల్లింపు**

**కర్నూలు, జూలై 11, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల నుండి లైబ్రరీలకు రావలసిన సెస్ బకాయిలను లోకాయుక్త తీర్పు మేరకు చెల్లించారు. గత పది సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సెస్ మొత్తం చెల్లించకపోవడంతో గ్రంథాలయాల అభివృద్ధికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. కె.సాంబశివరావు దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణ చేపట్టింది. అవిభక్త తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ స్థానిక సంస్థల నుండి రూ.366.88 లక్షల లైబ్రరీ సెస్ బకాయిలను గ్రంథాలయ సంస్థ తిరిగి పొందడంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త సంస్థ కీలక పాత్ర పోషించింది. 20072008 మరియు 2016 2017 మధ్య అనేక మున్సిపాలిటీలు, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం, కాకినాడ, పిఠాపురం, తుని మరియు అన్ని గ్రామ పంచాయితీలు సేకరించిన లైబ్రరీసెస్ ను జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించటంలో విఫలమయ్యాయని ఫిర్యాదిదారుడు ఫిర్యాదు చేయటం జరిగింది. లోకాయుక్త సంస్థ జారీ చేసిన ఆదేశాలకు ప్రతిస్పందిస్తూ, జిల్లా కలెక్టరు విచారణలు నిర్వహించి బకాయిలు ఉన్నమాట వాస్తవమని అంగీకరిస్తూ అనేక నివేదికలను సమర్పించారు. లోకాయుక్త నిరంతర జోక్యం మరియు పర్యవేక్షణ కారణంగా, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం, కాకినాడ, పిఠాపురం, తుని మున్సిపాలిటీలు మరియు పంచాయితీలతో సహా అన్ని స్థానిక సంస్థలు తన బకాయిల మొత్తం రూ.366.88 లక్షలు చెల్లించాయి. సంస్థగతంగా ఏర్పడిన అవకతవకలు నివారించడం, స్థానిక సంస్థల మధ్య జవాబుదారీతనాన్ని పెంపొందిచడంలో మరియు లైబ్రరీ సెస్ వంటి చట్టబద్ధమైన బాధ్యతలను నెరవేర్చటంలో లోకాయుక్త సంస్థ తన పాత్రను సమర్ధవంతగా సోషిస్తుంది. ప్రజాసేవలు అందించటంలో పారదర్శకత మరియు సమస్యలు పరిష్కరించడానికి ఈ సంస్థ తన నిబద్ధతను పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసింది.

## ప్రజల సమస్యలు తీర్చడానికే ఇంటింటి పర్యటన

**ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు**



గ్రామాల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, జూలై 11 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ప్రజలను నేరుగా కలుసుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు తెలిపారు. శుక్రవారం కళ్యాణదుర్గం రూరల్ మండలం ఎర్రంపల్లి, నారాయణపురం గ్రామంలో సుపరి పాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందిన తీరు, గ్రామంలో నెలకొన్న సమస్యలు అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజలు నేరుగా కలుసుకొని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేంద్ర బాబుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మంగళ హారతులు ఇచ్చి గజమాలలతో సత్కరించి తెలుగుదేశం పార్టీ పాలనలో తాము ఎంతో సౌకర్యంగా ఉన్నామని ప్రజలు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు మంజూరు చేయిస్తామని, కాలనీలో సీసీ రోడ్లు లేని చోట త్వరలోనే సీసీ రోడ్లు, డ్రైనేజిలు వేయించి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.. ఒక్కో ఇంట్లో నలుగురు, ఐదుగురు చదువుతున్న కుటుంబాలకు కూడా తల్లికి వందనం వంద శాతం వచ్చిందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వారి ఖాతాల్లోకి నగదు జమచేయడం జరుగుతుందన్నారు.. సుపరి పాలనలో తొలి అడుగులో భాగంగా సమస్యలు తెలుసుకునేందుకు ఇంటింటికి వెళుతుంటే ఎమ్మెల్యే, అధికారులతో కలసి తమ ఇంటి దగ్గరికే వచ్చి సమస్యలు తెలుసుకుంటుండడం చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.. ప్రతి గ్రామంలోనూ పర్యటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున మండల కన్వీనర్ గోళ్ళ వెంకటేశులు ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. తలారి రంగయ్య పై మండిపడిన ఎమ్మెల్యే : సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో గ్రామాల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే సురేంద్రబాబు విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య విమర్శలపై ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. తనపై గాని తన సంస్థపై ఎలాంటి ఆధారాలు లేకుండా విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## ఎస్వీయూలో రూసా స్ట్రాటజిక్ సమీక్షా సమావేశం

**తిరుపతి విద్య, జూలై 11 ప్రభాతవార్త:** రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ పథకం కింద జరుగుతున్న ప్రాజెక్టుల పురోగతిని అంచనా వేయడానికి ఒక వ్యూహాత్మక సమీక్షా సమావేశం శుక్రవారం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఛాంబర్‌లో జరిగింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్ ఆచార్య కె.రామ మోహనరావు ఈ సమావేశానికి హాజరై విశ్వవిద్యాలయ అధికారులతో మాట్లాడారు.రూసా పనుల అమలును వేగవంతం చేయాలని విశ్వవిద్యాలయాన్ని కోరుతూ,రూసాను సంస్థ ప్రయోజనం కోసం పూర్తిగా ఉపయోగించాల్సిన అవసరాన్ని చెబుతూ ఆయన అనేక విలువైన సూచనలు మరియు అంతర్దృష్టులను అందించారు.యస్వీయూ దాని మౌలిక సదుపాయాలు,

విద్యా పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇది ఒక గొప్ప అవకాశం అని ఆయన పేర్కొన్నారు.ఉపకులపతి ఆచార్య అప్పారావు ప్రస్తుత రూసా సంబంధిత కార్యకలాపాలు,క్యాంపస్‌లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి సమావేశానికి వివరించారు.

# అన్యాయంపై రోడ్డెక్కేవారంతా అసాంఘిక శక్తులేనా?

**- సిఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా జగన్ విమర్శలు**



**విజయవాడ, జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:**అన్యాయంపై రోడ్డెక్కే వారంతా అసాంఘిక శక్తులేనా?అని వైకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి(జగన్) ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రెండు నెలలుగా పంట కొనేవారు లేక రైతులు మామాడికాయలను ఎక్కడికక్కడ పారబోస్తున్నారు.వారంతా మీ కంటికి రౌడీలు,దొంగలు,అసాంఘిక శక్తుల్లా కనిపిస్తున్నారా?' అని ముఖ్యమంత్రి చంద్రబాబును 'ఎక్స్' వేదికగా జగన్ ప్రశ్నించారు. 'మీ సిద్ధాంతం ప్రకారం చూస్తే ...రాష్ట్రంలో తమకు అన్యాయం జరిగిందని రోడ్డెక్కే ప్రతి రైతు,యువకుడు,నిరుద్యోగి,మహిళ ...వారికి అండగా నిలిచే వారంతా రౌడీలు తమకు అన్యాయం జరిగిందని రోడ్డెక్కే ప్రతి రైతు,యువకుడు, నిరుద్యోగి, మహిళ...వారికి అండగా నిలిచే వారంతా రౌడీలు,అసాంఘిక శక్తులేనా? మామిడి రైతులు కష్టాల్లో లేకపోతే...కిలోకి రూ.4 చొప్పున ప్రభుత్వం నుంచి ఇస్తామన్న ప్రకటన ఎందుకు చేశారు? బంగారుపాళ్యానికి నా పర్యటన ఖరారు కాగానే మీ వ్యవసాయ శాఖ మంత్రిని ఢిల్లీకి ఎందుకు పంపారు?ఏటా మే నెలలో పల్ప్ ఫ్యాక్టరీలను తెరుస్తుండగా,ఈ సారి నెల ఆలస్యంగా...అందులోనూ కొన్నింటినే ఎందుకు తెరిచారు? సరుకంతా ఒకేసారి వచ్చేలా చేయడం దోపిడీకి ఆస్కారం కలిగించినట్లు కాదా? మీరు ఇస్తానన్న రూ.4 ఎంతమంది రైతులకిచ్చారు?ఎంతమందికి రూ.8 చొప్పున ఫ్యాక్టరీలు చెల్లించాయి' అని ప్రశ్నించారు.రాష్ట్రంలో ప్రభుత్వం అణచివేత వైఖరిని వదులుకోవాలన్నారు.

## నర్సింగ్, బిఎస్సీ చదివిన ఎస్సీ యువతకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ

**మంత్రి డాక్టర్ డోలాబాల వీరాంజనేయస్వామి**

**విజయవాడ,జూలై11,ప్రభాతవార్తప్రతినిధి:** నర్సింగ్, బీఎస్సీ(ఎన్) చదివిన ఎస్సి నిరుద్యోగ యువతకు జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఈ మేరకు శుక్రవారంఆయన కార్యాలయం నుంచి ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఎస్సి యువతకు ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది మంత్రి తెలిపారు.నర్సింగ్, బివిలీ చదివిన ఎస్సి యువతకు రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు.. మొదటి విడతలో 150 మందికి శిక్షణ ఇచ్చి అనంతరం వారికి జర్మనీలో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఎస్సిల్లో చదువుకున్న ఏ ఒక్కరూ ఉద్యోగ,

ఉపాధి లేమితో ఉండకూడదన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం.ఎస్సిలను ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా మరింత బలోపేతం చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు పాటుపడుతు న్నారని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ అవకాశాన్ని నర్సింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కానిస్టేబుల్ రాత పరీక్షా ఫలితాలు విడుదల

**ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా**

**విజయవాడ,జూలై 11,ప్రభాతవార్తప్రతినిధి:** పోలీసు కానిస్టేబుల్స్ నియామ కాల కోసం రాత పరీక్షలో 33,921 మంది ఎంపికైనట్లు పోలీసు రిక్రూ ట్మెంట్ బోర్డు రాజీవ్ కుమార్ మీనా తెలిపారు. గత నెల 1వ తేదీన నిర్వ హించిన ఈ పరీక్షకు మొత్తం 37,600 మంది హాజరవగా, వీరిలో పురుషులు 32,364 మంది, మహిళలు 5,236 మంది ఉండగా, ఎంపికైన వారిలో పురుషులు 29,211 మంది, మహిళలు 4,710 మంది ఉన్నారని గురువారం విడు దల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించగా విశాఖపట్నం కేంద్రంలో 10,354, కాకినాడ కేంద్రంలో 5,502, గుంటూరు కేంద్రంలో 7,323, కర్నూలు కేంద్రంలో 6,320, తిరుపతి కేంద్రంలో 4,417 మంది ఎంపికయ్యారని వెల్లడించారు. అభ్యర్థులు వారి మార్కుల జాబితాల కోసం షషష.రశీజూత్జీ.చ్జూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. అభ్యర్థులు వారి ఒఎంఆర్ షీట్‌లను పరిశీలించు కునేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఒఎంఆర్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 12వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతోపాటు రూ.వెయ్యి ఫీజు చెల్లించాలని తెలిపారు. వెరిఫికేషన్‌లో మార్కులు పెరిగితే చెల్లించిన ఫీజును అభ్యర్థికి వెనక్కి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాల వివరాలను ఎస్ఎంఎస్, ఇమెయిల్ ద్వారా పంపనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు హెల్ప్ లైన్ 94414 50639 లేదా 91002 03323 నంబర్లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల లోపు సంప్రదించవచ్చని సూచించారు.

# వేగంగా దుర్గమ్మ ఆలయ అభివృద్ధి పనులు

**- జగన్మాతకు భక్తుల జయనాదాలతో ఆషాఢం సారె**

**ఇంద్రకీలాద్రి, జూలై 11, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగిరం చేయాలని ఇఓ వికె శీనా నాయక్ అధికారులకు ఆదేశాలిచ్చారు. శుక్రవారం నాడు అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఆలయంలోని నూతన యాగశాల, పోటు పనుల అభివృద్ధిని తెలుసుకుని పనులు త్వరితంగా చేయాలన్నారు. సమీక్షకు ముందు ఇఓ క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సమీక్షలో యాగశాల డోనర్ సంగా నరశింహారావు, ఆలయ ఇఇ కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది, అన్ని వర్కుల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. వారికి శుక్రవారం భక్తబృందాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆషాడం సారెను సమరి ్పంచారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ పలు ప్రాంతాలకు చెందిన 100బృందాలు తమ ఇంటి ఆడపడుచుగా భావించి దుర్గమ్మవారికి సారె సమర్పించారు. ఆషాడం సారె సమ ర్పించిన భక్తుల బృందాలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు అన్న



నిత్యాన్నపథకానికి దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం



మంత్రి కొల్లురవీంద్ర దంపతులకు వేదాశీర్వచనం అందిస్తున్న దృశ్యం

ప్రసాదాలు అందించారు. దుర్గమ్మవారికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు చీర, సారె, వెండిపళ్ళెంను శుక్రవారం అందించారు. వారికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం ప్రసాదం, శేషవ స్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన ఆళ్ళ శివారెడ్డి దంపతులు శుక్రవారం రు.1లక్ష విరాళాన్ని అందించారు. దాతకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం ప్రసాదం, శేషవ స్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**- మంత్రి సత్య కుమార్ యాదవ్**



ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ధర్మవరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్

**అనంతపురం, జూలై 11 ప్రభాతవార్త బ్యూరో** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గంలోని శివనగర్‌లో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, రోగులతో నేరుగా సంభాషించి, కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కేంద్ర పనితీరును పరిశీలించి, వారి సేవాపరమైన అంకితభావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ, సంతానోత్పత్తి, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపుదల అవసరమని పేర్కొన్నారు. యువతకు సరైన సమాచారం, ఆరోగ్య సంరక్షణ సదుపాయాల అందుబాటుతో వారి భవిష్యత్తు మెరుగవుతుందని నొక్కిచెప్పారు. జనాభా గణాంకాల కంటే మానవ అస్తిత్వం, శ్రేయస్సు ముఖ్యమన్నారు. స్వర్ణ ఆంధ్ర 2047 దిశగా మేము నడుస్తున్నామన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రం ప్రజలకు సాధికారత కలిగించే వేదికగా మారాలని, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసి, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. స్వర్ణ ఆంధ్ర 2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం సిబ్బంది అంతా నిబద్ధతతో పని చేయాలని పిలుపునిచ్చారు.

## సెప్టెంబర్‌లో తిరుపతిలో క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో

**- బ్రోచర్లను ఆవిష్కరించిన తుడ ఛైర్మన్, క్రెడాయి కార్యవర్గం**

**తిరుపతి,జూలై 11ప్రభాతవార్త:** ఆధ్యాత్మికనగరం తిరుపతిలో క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌ఫో 2025 సెప్టెంబర్ 5,6,7తేదీల్లో జరగనుంది. ఈ ఎక్స్‌ఫోకు సంబంధించి కార్యక్రమాల ప్రాధాన్యత బ్రోచర్లు తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, క్రెడాయ్ కార్యవర్గం ప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను క్రెడాయ్‌లో ఒక సభ్యుడని,

నేడు తుడ ఛైర్మన్ హోదాలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో స్థిరపడాలని, స్థిరనివాసం ఏర్పరచుకోవాలని ఇతర ప్రాంతాల వాసులు అధికంగా సుముఖత చూపుతుంటా రన్నారు. ముఖ్యంగా విల్లాస్, డూప్లెక్స్‌హౌస్, అపార్టుఎమంట్లు అధికమవుతున్న సందర్భంలో క్రెడాయి లాంటి నమ్మకమైన సంస్థ ప్రజల అవసరాలను గుర్తించి,నిర్మాణాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు.

## డ్రాపవుట్ చిల్డ్రన్స్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతి**

**ఆత్మకూరు (నెల్లూరు), జూలై 11, ప్రభాతవార్త :** రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ మెంబర్ బత్తుల పద్మావతి ఆత్మకూరులోని ఎపిఆర్ఇఐఎస్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె ముందుగా విద్యార్థులతో ముఖా ముఖి సంభాషించారు. వారి నుండి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్స్, విద్యార్థుల అటెండెన్స్‌ను , ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రాపవుట్ చిల్డ్రన్స్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రత్యేక బాల బాలికలు తప్పనిసరిగా స్కూల్ జీవితాన్ని అనుభవించాలని దానికి సిబ్బంది చేయాలని ప్రిన్స్‌పాల్‌ను ఆదేశించారు.మెనూ రిజిస్టర్ ప్రకారం ఆహారపదార్థాలను తనిఖీ చేశారు. స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించినా, వారి హక్కులకు భంగం కలిగించినా ఉపేక్షించేది లేదన్నారు. పాఠశాల తరగతి గదులు , ప్రాంగణం అపరిశుభ్రంగా ఉందని పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బిసి హక్కుల సాధనకు జూలై 20న ఛలోఢిల్లీ

**విజయవాడ, జూలై 11, ప్రభాతవార్త :** దేశంలో 50శాతం పైగా వున్న బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించి బిసి ల హక్కుల సాధనకు జూలై 20న ఛలో ఢిల్లీ కి తరలిరావాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డా లగుడు గోవిందరావు పిలుపునిచ్చారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జూలై 21న జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బిసిల జనగణన, కులగణన కూడా చేపట్టాలనిన్నారు.

12-7P□g7exHMNWJQE.qxd:12-7P□g7exHMNWJQE.qxd 01/01/01 9:47 AM Page 1



# పర్యావరణహిత నిర్మాణాలే పరిష్కారం



## 2024-25లో నిర్మాణ రంగం వృద్ధి రేటు 11.97 శాతం

### కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలకు ప్రోత్సాహం

### యువ సివిల్ ఇంజనీర్లు వినూత్నంగా ఆలోచించాలి

### రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల తదితర ఎన్నో సమస్యలకు పర్యావరణహిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని, ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని సివిల్ ఇంజనీర్లను కోరారు. మూడున్నరేళ్లలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (హైదరాబాద్) సెంటర్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నెక్స్ట్ జెన్ హైరైజ్ బిల్డింగ్స్ (అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్) అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సును ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు 80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చింది. రాష్ట్ర సేవల స్థూల విలువ జోడింపులో ఇది 24.9 శాతం. ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనం అని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. ఇటీవల కాలంలో దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో హైరైజ్ భవన నిర్మాణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాల సంఖ్య 200 కంటే ఎక్కువగా ఉంది. మరో 250 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఇలాంటి తరుణంలోనే మనం పర్యావరణహితంగా అడుగులు వేయాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో రీన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్ (ఆర్‌సిసి) నిర్మాణాలకు బదులుగా కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్‌కు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ వినియోగం వల్ల భవన పూర్తయ్యేందుకు పట్టే సమయం 40 శాతం, భారం 30 శాతం తగ్గుతుంది. భూకంపాలను సమర్థవంతంగా తట్టుకోగలవు. నిర్మాణ సమయంలో వెలువడే కాలుష్యం తగ్గుతుంది. మరీ ముఖ్యంగా పునర్వినియోగం వల్ల సర్క్యులర్ ఎకానమీ వృద్ధి చెందుతుందని అని చెప్పారు. తెలంగాణలో ఆవిష్కరణలు కేవలం మాటలకే పరిమితం కావడం లేదు. ఆచరణలోనూ చూపిస్తున్నాము. భావితరాల కోసం కంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నాం. ఇందుకు నగరవాసులకు అందు బాటులోకి తెచ్చిన స్టీల్ వంతెనలు గొప్ప ఉదా హరణ. నిర్మాణ రంగంలో ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా నిర్మాణ అనుమ తుల్లో వేగం, జవాబుదారీతనం, విశ్వాసాన్ని పెంపొందించే దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం అని పేర్కొన్నారు. కాంపోజిట్ స్టీల్ హైరైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు(కోడ్) తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బిఐఎస్)తో కలిసి పని చేస్తున్నారు. సాంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు మా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజనీర్లకు సూచించారు. స్మార్ట్ నగరాలు, స్థిరమైన గృహనిర్మాణం, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ప్రతినిధులు ఎస్ జిఎస్ మూర్తి, మహేందర్ రెడ్డి, శేషాద్రి, కాశీరాం, నర్మద, రమేష్, భీం రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మరో 18 దత్తత కేంద్రాలు

### రెండు బాలల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

### ఫైల్‌పై సంతకం చేసిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మరో 18 ప్రత్యేక దత్తత కేంద్రాలు (ఎస్ఏఏ), 2 బాలల సంరక్షణ కేంద్రాలు (చిల్డ్రన్ హోమ్స్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పూర్తి కాగా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆ ఫైల్‌పై శుక్రవారం నాడు సంతకం చేశారు. సీఎం ఆమోదం లభించిన వెంటనే ఈ కేంద్రాల ఏర్పాటుకు అధికారిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. తెలంగాణలో శిశు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. అనాథలు లేదా తల్లిదండ్రులు వదిలి వేసిన పిల్లలను దత్తత కేంద్రాల్లో సంరక్షిస్తూ, వారికి అన్ని అవసరాలను అందించడంతో పాటు, నిబంధనల ప్రకారం దత్తత ఇచ్చే ప్రక్రియను చేపడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 15 జిల్లాల్లో 17 దత్తత కేంద్రాలు ఉన్నాయి. వీటికి అదనంగా 18 కొత్త కేంద్రాలు ఏర్పాటుతో మొత్తం దత్తత కేంద్రాల సంఖ్య 35కి చేరనుంది. పిల్లల అక్రమ విక్రయాలు, అనధికార దత్తతలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. దీనికి కొనసాగింపుగా దత్తత కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పాటయ్యే కేంద్రాల నిర్వహణ, పిల్లల బాగోగుల కోసం ఏటా రూ. 5.44 కోట్లు ఖర్చు అవుతాయని తెలంగాణ ప్రభుత్వం అంచనాలు సిద్ధం చేసింది. ఇందులో 60 శాతం (రూ. 3.26 కోట్లు) కేంద్ర ప్రభుత్వం, మిగిలిన 40 శాతం (రూ. 2.17 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఈ కేంద్రాల్లో సేవలందించేందుకు 228 మంది సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ విధానంలో నియమించనున్నారు. ముఖ్యమంత్రి సంతకం అనంతరం ఈ ప్రాజెక్టు అమలు ప్రారంభమవుతుంది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని నిరాశ్రయ పిల్లల భద్రతకు, దత్తత ప్రక్రియ పారదర్శకతకు మరింత బలాన్ని చేకూర్చనుంది.

## ప్రజల ఆదరణ పొందిన ఎల్‌ఐసి అమ్మకం తగదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ ఖండన

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 11, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం బంగారు బాతు వంటి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ (ఎల్‌ఐసి)ని విక్రయించడాన్ని ఎఐటియుసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ తీవ్రంగా ఖండించారు. 1965లో కేవలం 5 కోట్లతో ప్రారంభించిన ఎల్‌ఐసి అంచెలంచెలుగా 70 యేళ్ల కాలంలో లక్షల కోట్లు ఆదాయాన్ని, వ్యాపారాన్ని తన సొంతం చేసుకున్నదన్నారు. ఎల్‌ఐసి సేవలతో భారతదేశ ప్రజల మన్నలను పొందిందని, ఎల్‌ఐసి రంగంలో ప్రజలను ఆకర్షించి తన శక్తి మేరకు ప్రజలకు సేవ చేస్తున్నదని ఆయన వివరించారు. ఇలాంటి ఎల్‌ఐసిని దురాశపరులు, అవినీతి పరులు, అక్రమార్కులు, దోపిడీదారులు అయిన ప్రైవేటు వారికి ఎల్‌ఐసి వాటాలను అమ్మడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్‌ఐసి వాటాల అమ్మకాల విరమించుకుంటే మంచిదని, లేకపోతే దేశవ్యాప్తంగా ఎల ్ఐసి ఉద్యోగులు, వాటాదారులైన పాలసీదారులుగా ఉన్న ప్రజలు తిరగబడతారని వి.ఎస్.బోస్ హెచ్చరించారు.



అంబేద్కర విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## రిజర్వేషన్‌లపై ప్రభుత్వ నిర్ణయం బిసి బిడ్డలు, జాగృతి విజయం


### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 11, ప్రభాతవార్త:** బిసిల రిజర్వేషన్‌లపై ఆర్డినెన్స్ తీసుకువస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని ఇది బిసి బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. తాము ప్రజా ఉద్యమాల ద్వారా వత్తిడీ తీసుకురావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. తాను ఢిల్లీలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కాంగ్రెస్, బిజెపి పార్టీల వైఖరిని ఎండగట్టడం వల్లనే రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వచ్చిందని, తాము రైల్‌రోకో కార్యక్రమాన్ని ప్రకటించగానే ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చిందని ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించ తలపెట్టిన రైల్‌రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని చెప్పారు. అయితే తమకు కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయన్నారు. శుక్రవారం బంజారా హిల్స్‌లోని కవిత నివాసం నుంచి ఆనేక మంది జాగృతి కార్యకర్తలు ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో న్యాయస్థానంలో ఏలాంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి రిజర్వేషన్‌ల చుట్టు రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి కేంద్రంలో అధికారంలో ఉన్నదని, అనుకుంటే ఒకే నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వగలదన్నారు. బిసి బిడ్డ, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని ఆమె కోరారు.

## బిసి రిజర్వేషన్లపై 'ఆర్డినెన్స్' నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** కేబినెట్ సమావేశంలో బీసీల విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని, 2018 పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి బీసీలకు ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లా డుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని గత 18 నెలలుగా అనేక రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని గల్లీ నుండి ఢిల్లీ వరకు నిర్వహించిన పోరాట ఫలితమే ఈ 42 శాతం రిజర్వేషన్ల ప్రకటన, ఇది ముమ్మాటికి బీసీల విజయంగా భావిస్తున్నామన్నారు కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం మొదటగా తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగనన చేపట్టాలని, ఆ తర్వాత బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశామని తమ డిమాండ్‌ను గౌరవించి తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లును రాష్ట్ర గవర్నర్ ద్వారా గత ఏప్రిల్ 11వ తేదీన రాష్ట్రపతికి పంపించడం జరిగిందన్నారు. రాష్ట్రం ప్రభుత్వం పంపించిన బిల్లు జూలై 11 నాటికి మూడు నెలలు పూర్తయిందని అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్ల విషయంలో కనీసం స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య కృతజ్ఞతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 11:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం సాయంత్రం ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డిని ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంఘాల నాయకులు, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తదితరులు కలిశారు.

# కొత్త ఆవిష్కరణలకు కేంద్రాలు తెలంగాణ, యుపి

### ఉత్తరప్రదేశ్ ఎంఎస్ఎంఇ, ఖాదీ, గ్రామీణ, హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ పరిశ్రమల మంత్రి రాకేష్‌సచన్

### ఉత్తరప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో యుపిఐటిఎస్-2025పై అవగాహన కార్యక్రమం

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 11, ప్రభాతవార్త :** ఉత్తరప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలు పరిశ్రమలు, ఐటి, హ్యాండీక్రాఫ్ట్స్, ఫార్మా తదితర రంగాలు, కొత్త ఆవిష్కరణలకు కేంద్రాలని, ఈ రెండు రాష్ట్రాలు కలిస్తే అనేక సామాన్యతలతో ఎన్నో అద్భుతాలు సంభవిస్తాయని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఖాదీ గ్రామీణ పరిశ్రమలు, సిరికల్చర్, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి రాకేష్ సచన్ అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, భారత ఎక్స్‌పొజిషన్ మార్ట్ లిమిటెడ్ సంయుక్త నిర్వ హణలో సెప్టెంబరు 25 నుండి 29వరకు జాతీయ అంతర్జా తీయస్థాయిలో 5రోజుల పాటు ఇండియా ఎక్స్‌పో సెంటర్ అండ్ మార్ట్, గ్రేటర్ నోయిడాలో జరగనున్న ఉత్తరప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో-2025 (యుపిఐటిఎస్)పై అవగాహన పెంపొందించడమే, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆయా పారిశ్రామిక వాణిజ్య సంస్థలను ఆహ్వా నించడమే లక్ష్యంగా హైదరాబాద్‌లో ఈ రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసిఐ, సురానా ఆడిటోరియంలో శుక్ర వారం మధ్యాహ్నం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి రాకేష్ సచన్‌పాటు గౌరవ అతిథులుగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల శాఖ అదనపు కమిషనర్ రాజ్‌కమల్ యాదవ్ ఐఎఎస్, ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్, ఎఫ్‌టిసిసిఐ సీనియర్ ప్రెసిడెంట్ ఆర్.రవికుమార్, ఇండియా ఎక్స్‌పొజిషన్ మార్ట్ లిమిటెడ్ సిఈఓ సుదీప్ సర్కార్‌లు పాల్గొన్నారు. మంత్రి రాకేష్ సచన్ మాట్లాడుతూ దేశంలో మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో యుపిఐటిఎస్ అంతర్జాతీయ ట్రేడ్‌షో నిర్వహిస్తున్న తొలిరాష్ట్రం ఉత్తరప్రదేశ్ అన్నారు. జాతీయ అంతర్జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ఈ ట్రేడ్‌షోకై రోడ్‌షో కార్యక్రమాల్లో భాగంగా ఢిల్లీ తర్వాత రెండవది హైదరాబాద్‌లో నిర్వహి స్తున్నట్లు, దేశవ్యాప్తంగా పరిచయం చేయడం లక్ష్యంగా సాగుతున్నామని చెప్పారు. యుపిఐటిఎస్ ప్లాట్ ఫామ్ ద్వారా ఓడిఓపి ఉత్తత్తులు, హ్యాండ్లూమ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఈవిలు, రిన్యూవబుల్ ఎనర్జీ వంటి పలురంగాలలో ఉన్న సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఉత్పత్తి, విమాన, రైలు, రోడ్డు రవాణా సౌకర్యాలు, శాంతి భద్రతల పరిరక్షణ, అన్ని రంగాలకు ప్రభుత్వ ఇతోధిక ప్రోత్సాహం తోడుగా నిలు స్తుందని, ఈ ప్రదర్శనలో తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్‌కు చెందిన వాణిజ్య వ్యాపారసంస్థలు భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. చివరిగా దేశ విదేశాల్లో భారతదేశ గొప్పదనం, ప్రాముఖ్యతను చాటుదామని పిలుపునిచ్చారు.




సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి రాకేష్ సచన్, రాజ్‌కమల్ యాదవ్, సురేష్‌కుమార్ సింఘాల్, రవికుమార్, సుదీప్‌సర్కార్



శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు

## సంక్షేమానికి ఆదర్శంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం

### మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకరెడ్డి, జూపల్లి కృష్ణారావు

**రంగారెడ్డి అర్బన్, జూలై 11, ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని సంక్షేమానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని మంత్రులు అన్నారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు భవనాలు, సిని మాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల కేంద్రంలో రూ. 12.70 కోట్లతో నిర్మించనున్న 30 పడకల ఆసుపత్రి భవనానికి, మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు మాడ్గుల నుండి దేవరకొండ రోడ్ వరకు రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించే బీటీ రోడ్డునకు శంకుస్థాపన చేశారు. అంబేద్కర్, జ్యోతిరావుపూలే, చాకలి ఐలమ్మ విగ్రహాలకు, మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించిన మంత్రులు, స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడారు.

ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా మాడ్గుల వద్ద కోనాపూర్ నుండి మాడ్గుల వరకు మాడ్గుల నుండి దేవరకొండ రోడ్డు వరకు డబుల్‌లైన్ రోడ్ పనులకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ ముందు తీసుకెళుతున్నామన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లాలోని మాడ్గుల కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు మండలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. అనంతరం మంత్రులు మాడ్గుల మండలంలోని 220 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి ్ౖమ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్‌లో ఇళ్ల నిర్మాణదారులకు తీపికబురు

### అందుబాటులోకి నాలుగు ఇసుక రీచ్‌లు

### ఇక కొరత ఉండదంటున్న అధికారులు

**హైదరాబాద్, జూలై 11, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్‌లో ఇసుక కొరత తీర్చడానికి తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టిఎస్ఎం డిసి) కొత్తగా నాలుగు ఇసుక బజార్లను ప్రారంభించింది. సన్న ఇసుక టన్ను రూ. 1800, దొడ్డ ఇసుక రూ. 1600 చొప్పున విక్రయిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని వట్టినాగులపల్లి, అబ్దుల్లాపూర్ మెట్, ఆదిభట్ట, మేడ్చల్ జిల్లాలోని భౌరంపేటలో ఇవి అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల రీచ్‌ల నుంచి ఇసుక వస్తుండగా.. వర్షాకాల కొరతను ఈ బజార్లు తీరుస్తాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టే వారికి నిజంగా ఇది శుభవార్తే. ఇసుక కొరతను తీర్చడానికి తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టిఎస్ఎండిసి) కీలక చర్యలు చేపట్టింది. భారీ నిర్మాణదారులకు, వ్యక్తిగత వినియోగదారులకు ఇసుకను సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు నాలుగు కొత్త ఇసుక బజార్లను ఏర్పాటు చేసింది. ఇది నిర్మాణ రంగంలో ఎదురవుతున్న ఇసుక కొరత సమస్యకు ఒక పరిష్కారంగా మారనుందని అధికారులు తెలిపారు.

ఈ నూతన ఇసుక బజార్లలో సన్న ఇసుకను టన్ను రూ. 1800కు, దొడ్డు ఇసుకను రూ. 1600కు విక్రయిస్తున్నట్లు గిలీలీదీది ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఇసుక బజార్లు రంగారెడ్డి జిల్లాలోని వట్టి నాగులపల్లి, అబ్దుల్లా పూర్‌మెట్, ఆదిభట్ట, మేడ్చల్ జిల్లాలోని భౌరంపేటలో అందుబాటులో ఉన్నాయి. ఈ అన్ని ఇసుక బజార్లలో నాణ్యమైన నదీ ఇసుక సరిపడా నిల్వ ఉందని, వ్యక్తిగత వినియోగదారులు, కాంట్రాక్టర్లు, నిర్మాణ సంస్థల అవసరాలను తీర్చగలిగేలా పూర్తి స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవలి కాలంలో హైదరాబాద్ నగరంలో పరిసర ప్రాంతాల్లో ఇసుక కొరత నిర్మాణ రంగంలో పెద్ద సమస్యగా మారింది. ఇసుక సరఫరాలో జాప్యం, అధిక ధరలు, అక్రమ రవాణా వంటి సమస్యల వల్ల నిర్మాణ ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్నాయి. దీనివల్ల నిర్మాణ వ్యయం పెరిగి, వినియోగదారులపై భారం పడుతోంది. నగరానికి ఇసుక ప్రధానంగా కృష్ణా, గోదావరి నదుల రీచ్‌ల నుంచి వస్తుంది. వర్షాకాలంలో నదీ రీచ్‌లలో తవ్వకాలు నిలిచిపోవడం కూడా కొరతకు ఒక కారణం. ఈ నేపథ్యంలో ఇసుక బజార్ల ఏర్పాటు నిర్మాణ రంగానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుం దని అధికారులు భావిస్తున్నారు.

వినియోగ దారులు టిఎస్ఎండిసి సాండ్ సేల్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకోవచ్చు. మరింత సమాచారం లేదా సందేహాల నివృత్తి కోసం విని యోగదారులు టిఎస్ఎండిసి, హెల్ప్‌లైన్ నంబర్ 155242ను సంప్రదించవచ్చు.. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలు, నిర్మాణదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ విజ్ఞప్తి చేసింది. ఇది ఇసుక లభ్యతను మెరుగుపరచి, నిర్మాణ రంగానికి ఊతమిస్తుందని అధికారులు ఆశిస్తున్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 281

**హైదరాబాద్ (బేగంపేట), జూలై 11, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 281 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 67 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 58 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు 24, పౌర సరఫరాల శాఖకు 9, ఇందిరమ్మ ఇళ్ల కోసం 44 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

# ఇది బిసిల పోరాట విజయం

### రిజర్వేషన్‌లకు ఆర్డినెన్స్ తెస్తామని ప్రకటించడం అభినందనీయం: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 11, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఆర్డినెన్స్ తీసుకువస్తామని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించడం ఇది బిసిల పోరాట విజయమని, ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, పలు బిసి సంఘాల నేతలు అభినం దనలు తెలిపారు. బిసిలు ఎన్నో సంవత్సరాలుగా రిజర్వేషన్‌లు పెంచాలని పోరాటాలు చేస్తున్నారని, గత మార్చి నెలలో ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును జారీ చేసినప్పుడే జివో జారీ చేసి ఎన్నికలు నోటిఫికేషన్ జారీ చేసి ఉంటే ఇప్పటికే ఎన్నికలు జరిగిఉండేవని చెప్పారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఇక ముందు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు జరిగేంతవరకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రత్యేకంగా శ్రద్ద తీసుకోవాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. బిసిలకు వ్యతిరేకంగా కోర్టులకు ఎవరూ వెళ్లరని, రిజర్వే షన్‌లు పెంచు కోవడానికి న్యాయపరమైన, చట్టపరమైన, రాజ్యాంగ పరమైన అవరోధాలు ఏమి లేవని స్పష్టం చేశారు. బిసిలందరూ ఈ 42 శాతం రిజర్వేషన్‌లను కాపాడు కోవడానికి ఐక్యంగా ఉండాలని, వీటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బిసిలకు ప్రజాస్వామ్యంగా, రాజ్యంగంబద్ధమైన వాటా రాకుండా 76 సంవత్సరాలుగా అన్యాయం జరిగిందని, కనీసం స్థానిక సంస్థల్లో బిసిలకు వాటా ఇస్తుంటే కొంత మంది ఓర్వలేకపోతున్నారన్నారు.



సమావేశంలో ఐక్యతను చాటుతున్న బిసి సంఘాల నేతలు

## పురుగులమందు తాగి తల్లీకూతురు ఆత్మహత్య

**వర్గల్, జూలై 11, ప్రభాతవార్త:** పురుగులమందు తాగి తల్లీ, కూతురు ఆత్మహత్యకు చేసుకున్న సంఘటన వర్గల్ మండలం గౌరారంలో శుక్రవారం చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గౌరారం గ్రామానికి చెందిన వెల్దుర్తి మంజునాథ్ భార్య వెల్దుర్తి కవిత(32) పుట్టుకతోనే దివ్యాంగురాలు కాగా అత్త వెల్దుర్తి భారతమ్మ(60) కొంతకాలంగా నరాలవ్యాధితో బాధపడుతున్నది. వారి బాగోగులను మంజునాథ్ చూసుకుంటున్నాడు. అయితే నెల రోజుల నుండి మంజునాథ్ పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 7న చికిత్స నిమిత్తం మంజునాథ్ హైదరాబాద్‌కు వెళ్లగా మంజునాథ్‌కు ఏమైనా అయితే తమ బాగోగులు చూసుకునేవారు ఉండరని ఆందోళనతో మనస్తాపానికి గురై 10వ తేదీ గురువారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న మంజునాథ్ హైదరాబాద్ నుండి వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

12-7pg10.qxd:12-7pg10.qxd 01/01/01 8:16 AM Page 1



# ఫిఫా ర్యాంకింగ్స్‌లో..భారత్ పరిస్థితి దారుణం

## 8 యేళ్లలో అత్యంత చెత్త రికార్డు



**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో భారత్ ప్రపంచంలోని అగ్రశ్రేణి జట్లలో ఒకటిగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇదే సమయంలో భారత్ ఫుట్‌బాల్ జట్టు పరిస్థితి దారుణంగా తయారైంది. ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్‌లో టీమిండియాకు పెద్ద నష్టం వాటిల్లింది. ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఫిఫా) విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ 133వ స్థానానికి పడిపోయింది. ఇది భారత ఫుట్‌బాల్ జట్టుకు గత 8 ఏళ్లలో అత్యంత చెత్త ర్యాంకింగ్. అంతకు ముందు భారత జట్టు 2016-2017 సీజన్‌లో 130వ స్థానం కంటే దిగువకు వచ్చింది. ఈ ర్యాంకింగ్స్‌లో నష్టానికి ఒక ప్రధాన కారణం. భారత్ 2025లో ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడకపోవడం. భారత ఫుట్‌బాల్ జట్టు ఇంతకుముందు 127వ స్థానంలో ఉంది. కానీ ఇప్పుడు 2025లో పేలవమైన ప్రదర్శనకు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. టీమిండియా 7 స్థానాలు కిందకు పడిపోయి 133వ స్థానానికి చేరుకుంది. 2025లో భారత్ ఇప్పటివరకు మొత్తం 4 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. వాటిలో మూడు మ్యాచ్‌లలో ఓటమి పాలైంది, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది.

దురదృష్టవశాత్తు ఈ నాలుగు మ్యాచ్‌లు కూడా భారత్ కంటే తక్కువ ర్యాంకింగ్‌లో ఉన్న జట్లతోనే ఆడటం గమనార్హం. దీంతో భారత జట్టుపై ఎక్కువగా ప్రశ్నలు తలెత్తాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసినప్పుడు జట్టు ఫామ్‌పై విమర్శలు మొదలయ్యాయి. ఆ మ్యాచ్‌లో భారత్ ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. భారత జట్టు తన అత్యుత్తమ ర్యాంకింగ్‌ను 1996లో సాధించింది. అప్పుడు అది 94వ స్థానానికి చేరుకుంది. మరోపక్క పాకిస్థాన్ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు 133వ స్థానంలో ఉండగా, పొరుగు దేశమైన పాకిస్థాన్ పరిస్థితి మరింతదిగజారింది. పాకిస్థాన్ టాప్200 ర్యాంకింగ్స్‌లో కూడా లేదు. తాజా ర్యాంకింగ్స్‌లో పాక్ జట్టు మూడు స్థానాలు కిందకు పడిపోయి 201వ స్థానానికి చేరుకుంది. భారత మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ ప్రస్తుతం 184వ స్థానంలో ఉంది.



## ఆస్ట్రేలియా మల్టీ ఫార్మాట్ టూర్ టీమిండియా కెప్టెన్‌గా రాధ

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో తలపడే భారత్ క్రికెట్ ఎ జట్టు కెప్టెన్‌గా రాధా యాదవ్ నియమితులైంది. ఆగస్టు 7 నుండి 24 వరకు జరగనున్న ఆస్ట్రేలియాలో జరగనున్న బహుళ ఫార్మాట్ పర్యటన కోసం భారత ఎ మహిళా జట్టుకు స్పిన్నర్ రాధా యాదవ్ నాయకత్వం వహిస్తారు. భారత మహిళలు మూడు టి20లు మరియు 50 ఓవర్ల మ్యాచ్‌లు ఆడనున్నారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా-ఎ తో 4 రోజుల మ్యాచ్ ఆడనున్నారు. ఈ పర్యటన ఆగస్టు 7 నుండి మూడు టి 20 మాకేలో ప్రారంభమవుతుంది. తదుపరి మూడు 50 ఓవర్ల మ్యాచ్‌ల కోసం బ్రిస్బేన్‌లోని నార్త్స్‌కు టీమిండియా వెళుతుంది, భారత మహిళల సీనియర్ జట్టు తరపున ఏడు పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు ఆడిన మిన్ను మణి ఈ పర్యటనకు డిప్యూటీ కెప్టెన్‌గా ఎంపికయింది. ఇక ఇంగ్లాండ్ పర్యటనలో టి20 జట్టులోకి తిరిగి వచ్చిన ఓపెనర్ షఫాలి వర్మ అన్ని ఫార్మాట్ స్క్వాడ్‌లలో చోటు దక్కించుకుంది. అలాగే సజన సజీవన్, ఉమా చెత్రీ, టైటాస్ సాధు, షబ్నమ్ షకీల్ టి20 జట్టులో స్థానం లభించగా, శ్రేయాంక పాటిల్ అతి తక్కువ ఫార్మాట్ మ్యాచ్‌లలో పాల్గోనుంది. ప్రియా మిశ్రా ఫిట్‌నెస్‌కు లోబడి వన్డే, మల్టీడే మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటుంది. టి20 జట్టు: రాధా యాదవ్ (సి), మిన్ను మణి (విసి), షఫాలి వర్మ, డి. వృందా, సజన సజీవన్, ఉమా చెత్రీ (డబ్ల్యుకె), రాఘవి బిస్త్, శ్రేయాంక పాటిల్, ప్రేమ రావత్, నందిని కశ్యప్ (డబ్ల్యుకె), తనూజా కన్వేర్, జోషిత విజె, సహూామ షకీల్, షబ్తా విజె ఉండగా, వన్డే మరియు బహుళ ఫార్మాట్ జట్టులో రాధా యాదవ్ (సి), మిన్ను మణి (విసి), షఫాలీ వర్మ, తేజల్ హాసబ్నిస్, రఘ్వీ బిస్త్, తనుశ్రీ సర్కార్, ఉమా చెత్రీ (జూరీ), ప్రియా మిశ్రా, తనుజా కన్వర్, నందిని కశ్యప్ (డబ్ల్యూకె, షబ్, షబ్‌గుజ్‌కే, సాబ్ గుజ్జార్ ఠాకోర్, టిటాస్ సాధు).

## మహిళల ప్రపంచ కప్ మూడవ రౌండ్‌కు దివ్య, హంపి, హారిక, వైశాలి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ చెస్ కప్-2025 టోర్నమెంట్‌లో భారత్‌కు చెందిన నలుగురు క్రీడాకారిణిలు మూడవ రౌండ్‌కు చేరుకున్నారు. అగ్రస్థానంలో ఉన్న గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తమ మినీ మ్యాచ్‌లోని రెండవ గేమ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన అఫ్రుజా ఖమ్‌డమోవాతో డ్రా చేసుకుని 1.5-0.5 తేడాతో విజయం సాధించింది. తెల్ల పావులతో ఆడుతున్న హంపి నియంత్రణలో ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేసి టైబ్రేక్ అవసరం లేకుండానే దూసుకెళ్లింది.

ఈ ఈవెంట్‌లో రెండుసార్లు కాంస్య పతక విజేత అయిన ద్రోణవల్లి హారిక, తన స్వదేశీయురాలు పివి నందిదాను ఓడించి చివరి 32లోకి ప్రవేశించింది. రెండవ గేమ్‌లో హారిక ఎలాంటి దాడి అవకాశాలను తటస్థీకరించి 2-0 తేడాతో విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌లలో, ఆర్ వైశాలి కెనడాకు చెందిన మైలీజాడే ఔలెట్‌ను ఓడించగా, దివ్య దేశ్‌ముఖ్ జార్జియాకు చెందిన కేసరియా మ్గెలాడ్జేను ఓడించి, ఇద్దరూ తమ తమ మినీమ్యాచ్‌లను వరుస గేమ్‌లలో గెలిచారు.

తొలి రౌండ్‌లో నిరాశపరిచిన కె. ప్రియాంక, పోలాండ్‌కు చెందిన క్లాడియా కులోన్‌తో జరిగిన రెండు గేమ్‌లను డ్రా చేసుకుని టైబ్రేక్‌ను సాధించింది. మొదటి గేమ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ అన్నా ఉషెనినాపై అద్భుతమైన విజయం సాధించిన తర్వాత, వంటికా అగర్వాల్ రెండవ గేమ్‌లో ఓడిపోయింది. అలాగూ పద్మిని రౌట్ అలెగ్జాండ్రా కోస్టెనిక్‌ను 1-1తో డ్రాగా ముగించడంతో మ్యాచ్ కూడా టైబ్రేకర్‌కు దారితీసింది.


## యూరప్ టూర్‌లో.. భారత్ హాకీ జట్టు రెండో విజయం

### 6-0 తేడాతో ఐర్లాండ్ ఓటమి



**న్యూఢిల్లీ:** యూరప్ టూర్‌లో భాగంగా జరుగుతున్న రెండో మ్యాచ్‌లో ఇండియా పురుషుల హాకీ జట్టు తన అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించింది. ఐర్లాండ్‌పై 6-0 తేడాతో రెండో ఘన విజయం సాధించింది. ఇండియా తరపున ఉత్తమ్ సింగ్ మరోసారి గోల్స్ నమోదు చేయగా, కెప్టెన్ సంజయ్ ఆ తర్వాత వరుస గోల్స్ చేశాడు. మిడ్‌ఫీల్డర్ మహ్మద్ రహీల్ మోసేన్ వరుసగా అద్భుతమైన గోల్స్ సాధించగా, అమన్‌దీప్ లక్రా, వరుణ్ కుమార్ ఒక్కొక్క గోల్ చేయడంతో ఇండియా తన రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. హాకీ క్లబ్ ఆరంజేరూడ్‌లో ఐర్లాండ్‌పై 6-1 తేడాతో ఆధిపత్య విజయంతో భారత్ తమ యూరప్ పర్యటనను ప్రారంభించింది. ఉత్తమ్ సింగ్ పురుషుల కోసం గోల్ చేయడం ప్రారంభించాడు. తరువాత అమన్‌దీప్ లక్రా తమ ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. దీని తర్వాత ఆదిత్య లాలేజ్ వరుసగా గోల్స్ చేయడంతో అద్భుతమైన బ్రేస్ సాధించాడు. ఫార్వర్డ్ ఆటగాళ్లు సెల్వం కార్తీ మరియు బాబీ సింగ్ ధామి కూడా ఒక్కొక్క గోల్ చేసి స్కోరు షీట్‌లో చోటు సంపాదించారు. భారత్ తమ డిఫెండింగ్‌లో పటిష్టంగా ఉండటంతో ఐర్లాండ్ ఒక ఓదార్పు గోల్ మాత్రమే చేయగలిగింది. భారత్ తదుపరి రెండు వారాల పాటు ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బెల్జియం మరియు ఆతిథ్య నెదర్లాండ్స్‌తో ఆడుతుంది.

## ఆర్చరీ ప్రపంచ కప్.. భారత్ రికర్వ్ జట్ల నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్- 2025 టోర్నమెంట్‌లో భారత రికర్వ్ జట్లు ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయాయి. మాడ్రిడ్‌లో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ 4వ దశలో భారత జట్టు ప్రచారం నిరాశాజ నకంగా ప్రారంభమైంది, పురుషుల మరియు మహిళల రికర్వ్ జట్లురెండూ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో నిష్క్రమించాయి. కొత్త కోచ్ రాహుల్ బెనర్జీ మార్గదర్శకత్వంలో దీపికాకుమారి, అంకితా భకత్ మరియు 15 ఏళ్ల అరంగేట్రం గాథా ఖడకేలతో కూడిన మహిళల రికర్వ్ జట్టు ఫ్రాన్స్‌పై తొలి విజయం సాధించింది. ఘనమైన అర్హత స్కోర్ల తర్వాత నాల్గవ సీడ్ అయిన ఈ త్రయం మొదటి సెట్‌ను 58-54తో కైవసం చేసుకుంది. తదుపరి రెండవ సెట్‌ను టైగా ముగించిన తర్వాత 3-1 ఆధిక్యాన్ని సాధించింది. అయితే, ఎనిమిది పాయింట్ల తప్పుడు దాడితో భారత్ మూడో సెట్‌ను 54-56తో కోల్పోవడంతో ఆట వేగం మారిపోయింది. మ్యాచ్ స్థాయి 3-3తో ఉండటం, ఒత్తిడి పెరగడంతో, భారత మహిళలు కోలుకోలేకపోయారు. చివరి సెట్‌లో ఖరీదైన ఆరు పాయింట్ల స్కోరుతో వారి మొత్తం స్కోరు 53కి చేరుకుంది, దీనితో ఫ్రాన్స్ సెట్‌ను 54-53తో అధిగమించి అద్భుతమైన విజయాన్ని సాధించింది. కాగా బ్రెజిల్ చేతిలో ఓడిపోయిన పురుషుల జట్టు పురుషుల రికర్వ్ జట్టు ధీరజ్ బొమ్మదేవర, రాహుల్ సింగ్, నీరజ్ చౌహాన్ తమ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో బ్రెజిల్‌ను ఓడించలేకపోయారు. తొమ్మిదో సీడ్ అయినప్పటికీ, భారతదేశం ప్రారంభంలోనే వెనుకబడి, మొదటి రెండు సెట్‌లను 55-56 మరియు 54-57 తేడాతో కోల్పోయింది.

మూడవ సెట్‌లో 57-56 తేడాతో గెలిచిన కొద్దిపాటి పునరుజ్జీవనం సరిపోలేదు. నాల్గవ మరియు చివరి సెట్‌లో బ్రెజిల్ స్థిరంగాఉండి, 56-54, 6-2 తేడాతో విజయం సాధించి, భారత్‌ను పోటీనుండి తప్పించింది. అంతకు ముందు క్వాలిఫికేషన్ రౌండ్లలో పేలవమైన ప్రదర్శన కారణంగా ఈ తొలినిష్క్రమణలు జరిగాయి. పురుషులలో, ధీరజ్ బొమ్మదేవర భారతదేశం తరపున 13వ స్థానంలో అత్యధికంగా ర్యాంక్ సాధించగా, అరంగేట్రం చేసిన రాహుల్ సింగ్ మరియు చౌహాన్ 34వ మరియు 35వ స్థానాల్లో నిలిచారు, దీనితో భారతదేశానికి తొమ్మిదో సీడ్ జట్టు ర్యాంకింగ్ లభించింది. మహిళలవిభాగంలో, అంకితా భకత్, దీపికా కుమారి మరియు గతా ఖడకే వరుసగా 15, 18 మరియు 25వ స్థానాల్లో నిలిచారు.

# ఎన్‌ఆర్‌ఐ బిలియనీర్లలో 'జెడ్ స్కేలర్' టాప్

**వాషింగ్టన్, జులై 11:** విదేశాల్లో పుట్టి అమెరికాలో పర కుబేరులుగా ఎదిగిన వాళ్లలో భారతీయులే అగ్రస్థానంలో ఉన్నారు. ఫోర్బ్స్ 2025 ర్యాంకింగ్స్‌లో 12మంది భారత సంతతి బిలియనీర్లు చోటు దక్కించుకోవడంతో అత్యధిక మంది విదేశీ అమెరికన్ కుబేరులకు జన్మస్థానంగా భారత్ నిలిచింది. 2022లో కేవలం ఏడుగురు భారత సంతతి బిలియనీర్లు ఉండగా ఇప్పుడు గణనీయంగా పెరిగారు. అమెరికాలో విదేశీ సంతతి సంపన్నుల తాజా జాబితాలో భారత్ ఇజ్రాయెల్, తైవాన్‌లను అధిగమించింది. ఈ రెండు దేశాలకు చెందినవారు చెరో 11 మంది ఈ జాబితాలో ఉన్నారు. స్వయం కృషితో ఎదిగిన ఈ భారత సంతతి కుబేరులు, విదేశాలలో జన్మించిన యుఎస్ బిలియనీర్ల మొత్తం 1.3 లక్షల కోట్ల డాలర్ల సంపదలో గణనీయ వాటాను అందిస్తున్నారు. ఆల్ఫాబెట్ అధినేత సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల వంటి కొత్తవారు ఇటీవల ఈ జాబితాలో చేరినప్పటికీ అంతగా గుర్తింపులేని దిగ్గజాలతో పోలిస్తే వారు ఆశ్చర్యకరంగా తక్కువ ర్యాంకులో ఉన్నారు. సైబర్ సెక్యూరిటీ దిగ్గజం జెడ్ స్కేలర్ వ్యవస్థాపకుడు జె చౌదరి 17.9 బిలియన్ డాలర్ల సంపదతో భారత సంతతి అమెరికన్ బిలియనీర్లలో అగ్రస్థానంలో ఉన్నారు. విద్యుత్తు, నీరు లేని మారుమూల హిమాలయ గ్రామం పనోహ్‌లో జన్మించిన చౌదరి గ్రాడ్యుయేట్ చదువుల కోసం 1980లో తొలిసారి అమెరికా వెళ్లారు.



**భారత సంతతి అపర కుబేరులు వీళ్లే..**

జె చౌదరి 17.9 బిలియన్ డాలర్లు- సైబర్ సెక్యూరిటీ (జెడ్ స్కేలర్), వినోద్ ఖోస్లా 9.2 బిలియన్ డాలర్లు- సన్ మైక్రో సిస్టమ్స్, వెంచర్ కేపిటల్, రాకేష్ గంగ్వాల్ 6.6 బిలియన్ డాలర్లు -ఎయిర్‌లైన్స్ (ఇండిగో సహ వ్యవస్థాపకుడు), రోమేష్ టి.వాధ్వానీ 5.0బిలియన్ డాలర్లు- సాఫ్ట్‌వేర్- సింఫనీ టెక్నాలజీ గ్రూప్, రాజీవ్ జైన్ 4.8 బిలియన్ డాలర్లు -ఫైనాన్స్ (జీక్యూజీ పార్టనర్స్ ఛైర్మన్), కవితార్క్ రామ్ శ్రీరామ్ 3.0 బిలియన్ డాలర్లు-గూగుల్, వెంచర్ కేపిటల్, రాజ్ సర్దానా 2.0 బిలియన్ డాలర్లు- టెక్నాలజీ సేవలు (ఐటి సంస్థ టిసిజిఐ), డేవిడ్ పాల్ 1.5 బిలియన్ డాలర్లు - వైద్య పరికరాలు, నికేష్ అరోరా 1.4బిలియన్ డాలర్లు- సైబర్ సెక్యూరిటీ (పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సిఇఒ).

## టాప్ 10లోకి రాని 'ఇంటెల్': సిఇఒ లిప్-బు టాన్

**వాషింగ్టన్, జులై 11:** టెక్‌దిగ్గజం ఇంటెల్ కృత్రిమ మేధ రేసులో చాలా వెనుకబడిందని ఆ సంస్థ కొత్త సిఇఒ లిప్-బు టాన్ అంగీకరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగులు విడియోలైవ్ టెలికాస్ట్‌లో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. ఈ పరిస్థితి నుంచి పుంజుకోవడానికి తీవ్రంగా కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ఆయన గత సిఇఒ పాట్ గెల్సింగర్ నుంచి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఉద్యోగులతో మాట్లాడారు. '30యేళ్ల క్రితం మనమే నిజమైన లీడర్లం. కానీ ఇప్పుడు ప్రపంచం మొత్తం మారిపోయింది. సెమీ కండక్టర్ కంపెనీల్లో మనం కనీసం టాప్-10లో కూడా లేం' అని స్పష్టం చేశారు. సంప్రదాయ మార్కెట్ నుంచి కీలకమైన కృత్రిమ మేధ రంగంలోకి మళ్లేందుకు కంపెనీ అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందని అభిప్రాయపడ్డారు. ఈ రంగంలోని ఎన్విడియా ఎఐ చిప్ డెవలప్‌మెంట్‌లో చాలా బలంగా ఉందని, దానిని నేరుగా సవాలు చేసే స్థితిలో ఇంటెల్ పరిస్థితి లేదన్నారు. ఇక ఇంటెల్ త్వరలో విడుదల చేయనున్న 18ఎ మోడల్ తమ అంతర్గత వినియోగదారుల అవసరాలను బలంగా తీరుస్తుందన్నారు. సంస్థలో సమూల మార్పు తీసుకురావడం ఓ మారథాన్ అని పేర్కొన్నారు. కంపెనీ ఎఎండి, ఎన్విడియాలా మరింత దూకుడుగా ఉండాలని చెప్పారు. కష్టమర్లతో ఉద్యోగులు వినయంగా ఉండి, వారి అవసరాలకు తగినట్లు స్పందించాలన్నారు. వాస్తవానికి ఇంటెల్ ఆర్థికంగా కూడా ఇబ్బందుల్లో ఉంది. సంస్థ ఒరెగాన్ క్యాంపస్ నుంచే 529 మంది ఉద్యోగులను తొలగించింది. ప్రపంచవ్యాప్తంగా మరిన్ని కోతలు ఉంటాయని సంకేతాలు ఇచ్చింది. మార్కెట్ విలువ కూడా బాగా తగ్గి 100 బిలియన్ డాలర్లకు చేరింది. దాదాపు 18 నెలల క్రితం ఇది రెట్టింపుగా ఉంది. మరోవైపై ఎన్విడియా మార్కెట్ విలువ ఇప్పుడు నాలుగు లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ప్రపంచంలో ఈమార్క్‌కు చేరిన తొలి కంపెనీలుగా నిలిచింది. ఇక తాము టాప్-10లో కూడా లేమని ఇంటెల్‌సిఇఒ లిప్-బు టాన్ చేసిన కామెంట్‌పై కంపెనీ ప్రతినిధి వివరణ ఇచ్చారు. అది కేవలం మార్కెట్ విలువలో మాత్రమే అని, టెక్నాలజీ సామర్థ్యాల్లో కాదని స్పష్టం చేశారు.




## యుపిఐ చెల్లింపుల్లో మనమే ఫాస్ట్

**న్యూఢిల్లీ, జులై 11:** యుపిఐ దన్నుతో, మిగతా ప్రపంచ దేశాలన్నింటిలోకెల్లా భారత్ చెల్లింపుల విధానం అత్యంత వేగవంతంగా ఉంటోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తెలిపింది. 2016లో ప్రవేశపెట్టిన యుపిఐ విధానం చాలా వేగంగా వినియోగంలోకి వచ్చిందని పేర్కొంది. అదే సమయంలో నగదుకు ప్రత్యామ్నాయాలైన డెబిట్, క్రెడిట్ కార్డుల్లాంటి ఇతరత్రా సాధనాల వినియోగం గణనీయంగా తగ్గిందని వివరించింది. ప్రస్తుతం యుపిఐ ప్రతి నెలా 1,800 కోట్ల లావాదేవీలు ప్రాసెస్ చేస్తోందని ఐఎంఎఫ్ పేర్కొంది. వివిధ పేమెంట్ ప్రొవైడర్స్ సేవలు ఉపయోగించుకునే యూజర్ల మధ్య నిరాటంకంగా చెల్లింపు లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు క్లోజ్డ్ లూప్ సిస్టమ్‌లతో పోలిస్తే యుపిఐ లాంటి ఇంటర్ ఆపరబుల్ పేమెంట్ సిస్టమ్‌లు సమర్థవంతంగా ఉంటాయని తెలిపింది. అయితే ఇది మరింత వినియోగంలోకి వచ్చే కొద్దీ ప్రైవేట్ రంగ సంస్థల గుత్తాధిపత్యానికి కూడా దారి తీయొచ్చని, అలాంటిది జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.



# వాణిజ్యం

## ఐటి షేర్ల ఒత్తిడితోనే సెన్సెక్స్ డౌన్

**ముంబై, జులై 11:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిసాయి. ఓ వైపు టారిఫ్‌ల విషయంలో నెలకొన్న అనిశ్చితి, మరోవైపు ఐటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. దీంతో పాటు టిసిఎస్ ఫలితాలు కూడా ఇన్వెస్టర్లను మెప్పించకపోవడంతో ఐటి షేర్లు డీలాపడ్డాయి. ఆటోమొబైల్ షేర్లూ సూచీలపై ప్రభావం చూపాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లు మేర నష్టపోగా, నిఫ్టీ 25,200 దిగువకు చేరింది. చివరికి సెన్సెక్స్ 689.81 పాయింట్లు నష్టపోయి 82,500.47 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 205.40 పాయింట్లు క్షీణించి 25,149.85 పాయింట్ల వద్ద ముగిసింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.80గా ఉంది. టిసిఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, టైటాన్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంకు, సన్‌ఫార్మా, ఎన్‌టిపిసి, ఎటర్నల్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధర 68.78 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,3522.10 డాలర్ల వద్ద నిలిచింది. త్రైమాసిక ఫలితాల్లో అంచనాలను అందుకోవడంలో టిసిఎస్ విఫలమైంది. గతేడాదితో పోలిస్తే 6శాతం వృద్ధితో రూ.12,760 కోట్ల లాభాన్ని నమోదు చేసినప్పటికీ, స్థిర కరెన్సీ వద్ద 3శాతం మేర క్షీణత నమోదైంది. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో క్లయింట్లు ఐటిపై ఖర్చు తగ్గిస్తుండడంతో బ్రోకరేజీ సంస్థలు కూడా ఈ యేడాదికి ఐటి కంపెనీల ఆదాయ అంచనాలు తగ్గిస్తున్నాయి. దీంతో ప్రధాన ఐటి కంపెనీల షేర్లు 1-3 శాతం మేర క్షీణించగా, నిఫ్టీ ఐటి ఇండెక్స్ దాదాపు 2శాతం మేర నష్టపోయింది. అమెరికా అధ్యక్షుడుట్రంప్ తాజాగా కెనడాపై 35శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ప్రధానవ్యాపార భాగస్వాములపై 15-20శాతం టారిఫ్ విధిస్తారని సంకేతాలు ఇచ్చారు.



## 'లూజ్ ఫాస్టాగ్'లపై కేంద్రం కఠిన కార్యాచరణ

**న్యూఢిల్లీ, జులై 11:** టోల్‌గేట్ల వద్ద సులభతర ప్రయాణం కోసం కొత్త టోల్‌పాస్ విధానాలను తీసుకొస్తోన్న కేంద్రం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. 'లూజ్ ఫాస్టాగ్'ల విషయంలో కఠిన చర్యలకు ఉపక్రమించింది. అలాంటి ఫాస్టాగ్ యూజర్లను ఇకపై బ్లాక్‌లిస్ట్‌లోకి చేర్చనుంది. ఈ మేరకు జాతీయ రహదారుల సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. సాధారణంగా వాహనదారులు తమ ఫాస్టాగ్‌లను వాహన విండ్‌షీల్డ్‌లపై అతికించాలి. అప్పుడు టోల్‌ప్లాజాల వద్ద ఉన్న స్కానర్లు వాటిని స్కాన్ చేసేందుకు వీలుంటుంది. కానీ కొందరు ఉద్దేశపూర్వకంగా ఫాస్టాగ్‌లను అతికించట్లేదు. టోల్ గేట్లు వచ్చినప్పుడు పర్సులో నుంచి తీసి చూపిస్తున్నారు. ఇలాంటి వాటినే లూజ్ ఫాస్టాగ్‌గా పిలుస్తారు. ఇలాంటి యూజర్ల వల్ల టోల్ పాస్ నిర్వహణ సమస్యగా మారుతోందని, ప్లాజాల వద్ద రద్దీ పెరుగుతోందని ఎన్‌హెచ్ఎఐ తెలిపింది. అంతేకాకుండా కొందరు టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేసేందుకు యత్నిస్తున్నట్లు పేర్కొంది. అందుకే వీటి కట్టడికి చర్యలు చేపట్టినట్లు జాతీయ రహదారుల సంస్థ తెలిపింది. లూజ్ ఫాస్టాగ్‌లను గుర్తించినప్పుడు సంబంధిత టోల్ కలెక్టింగ్ ఏజెన్సీలు వెంటనే దాన్ని రిపోర్ట్ చేయాలని ఎన్‌హెచ్ఎఐ ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఇ-మెయిల్-ఐడిని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఆ రిపోర్ట్‌లను పరిశీలించిన తర్వాత సదరు ఫాస్టాగ్ యూజర్లను బ్లాక్‌లిస్ట్ జాబితాలో చేరుస్తామని స్పష్టం చేసింది. ఇటీవల జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌లపై వార్షిక ఫాస్టాగ్ టోల్‌పాస్ విధానాన్ని కేంద్రం ప్రకటించిన విషయం విదితమే.




## టెస్లా తొలి షోరూమ్‌కి తేదీ ఖరారు

**వాషింగ్టన్, జులై 11:** చాలా కాలంగా భారతమార్కెట్లో ఎంట్రీకి చూస్తున్న గ్లోబల్ విద్యుత్ వాహనాల దిగ్గజం టెస్లా ఎట్టకేలకు మొదటి షోరూమ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ యేడాది 15వ తేదీన టెస్లా తమ తొలి 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్‌లో ప్రారంభిస్తుందని, ఇది భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు కీలక అడుగు అని పేర్కొంది. ఈ స్టోర్ కోసం టెస్లా కంపెనీ 4వేల చదరపు అడుగుల రిటైల్ స్థలాన్ని లీజుకు తీసుకున్న విషయం విదితమే. గత కొన్ని వారాలుగా యూరప్, చైనా మార్కెట్లలో టెస్లా కార్లకు గిరాకీ తగ్గింది. దీన్ని భర్తీ చేసేందుకు గానూ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద వాహన మార్కెట్‌గా ఉన్న మన దేశం మార్కెట్లోకి అడుగు పెట్టడం ముఖ్యమని టెస్లా భావించింది. ఈ నేపథ్యంలోనే ఎలాన్ మస్క్ కంపెనీ భారత్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. అందుకనుగుణంగా గడచిన నెలా, రెండు నెలల వ్యవధిలోనే భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించే ప్రక్రియను వేగవంతంచేసింది. ముంబైలో తొలి షోరూమ్ ఏర్పాటు అయ్యాక రోజుల వ్యవధిలోనే దేశరాజధాని ఢిల్లీ లోనూ స్టోర్ ఏర్పాటుకు టెస్లా ప్రయత్నిస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ అభిప్రాయపడింది. ఇప్పటికే టెస్లా కంపెనీ చైనా, అమెరికా, నెదర్లాండ్స్ నుంచి ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కోసం అవసరమైన సూపర్ ఛార్జర్స్ పరికరాలు, కార్ యాక్సె సరీస్, ఇతర విడిభాగాలను దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. ముంబై షోరూమ్‌తో కలుపుకుని టెస్లా మొత్తం నాలుగు చోట్ల కమర్షియల్ స్థలాలను లీజుకు తీసుకుంది. పుణెలో ఇంజినీరింగ్ హబ్‌తో పాటు బెంగళూరులో రిజిస్టర్డ్ ఆఫీస్,ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ సమీపంలో తాత్కాలిక ఆఫీస్ ఉన్నాయి. కంపెనీకిచెందిన మోడల్ వైరేర్ వీల్ డ్రైవ్ ఎస్‌యువి కార్లు ఇప్పటికే భారత్‌కు చేరుకున్నాయని తెలుస్తోంది. మోడల్ వై ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడవుతున్న విద్యుత్ కారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14